www.ninadam.co.in
తెలుగు దినపత్రిక
# నినాదం
బుధవారం 5- 3 - 2025 | సంపుటి : 21 | సంచిక : 168
నిఖార్సైన జర్నలిజం
Published from Vijayawada Circulated from Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam
పేజీలు : 12 + 8
వెల : రూ. 7/-

## పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ

**నోటీసులు జారీ చేసిన సుప్రీం ధర్మాసనం.. విచారణ 25కు వాయిదా**



**న్యూఢిల్లీ, (నినాదం):** బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. గత విచారణ సందర్భంగా ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోడానికి ఎంత సమయం తీసుకుంటారో స్పీకర్‌తో సంప్రదించి వివరాలు అందించాలని ధర్మాసనం ఆదేశించింది. కౌంటర్లు దాఖలు చేయడానికి ఇప్పటి వరకు తమకు ఎలాంటి నోటీసులు రాలేదని, సాంకేతికంగా ఇది గమనించాల్సిన విషయమని రాష్ట్ర ప్రభుత్వం, అసెంబ్లీ కార్యదర్శి తరపు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. రాష్ట్ర ప్రభుత్వం, అసెంబ్లీ స్పీకర్, కార్యదర్శి, 10 మంది ఎమ్మెల్యేలు, కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. ఈనెల 22లోపు నోటీసులకు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టిన్ మాహిస్ జార్జ్‌ల ధర్మాసనం మార్చి 25కి వాయిదా వేసింది.

## గాయని కల్పన ఆత్మహత్యాయత్నం

2



**హైదరాబాద్, (నినాదం):** ప్రముఖ గాయని కల్పన ఆత్మహత్యాయత్నం చేశారు. నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు సమాచారం. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో ఆమె చికిత్స పొందుతున్నారు. ఆత్మహత్యాయ త్నానికి కారణం మాత్రం ఇంకా తెలియరాలేదు. కల్పన నిజాంపేటలోని వర్టెక్స్ ప్రీ వీలేజ్ గేటెడ్ కమ్యూనిటీలో నివసిస్తున్నారు.

## బనకచర్లపై ఓ పార్టీ రాజకీయం చేస్తుంది

### తెలుగుజాతిని అగ్రగామిగా నిలపాలన్నదే లక్ష్యం

## తనకు తెలంగాణ, ఏపీ రెండు సమానం

**పట్టభద్రుల ఎమ్మెల్సీ విజయోత్సవ సభలో సీఎం చంద్రబాబు**

**అమరావతి, (నినాదం):** తెలుగు జాతి కోసం పెట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. తెలుగు జాతిని అగ్రగామిగా నిల పాలన్నదే తన లక్ష్యమని తెలిపారు. తనకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు ప్రాంతాలు సమానమని ఆయన చెప్పారు. ఎన్టీఆర్ భవన్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ విజయోత్సవ సభ మంగళవారం సాయంత్రం జరిగింది.



2



### 15కిలోల బంగారం

## తరలింపు

**డిఆర్ఐ అధికారులకు పట్టుబడిన కన్నడ నటి**

**బెంగుళూరు, (నినాదం):** బంగారాన్ని అక్రమంగా తీసుకొచ్చారనే కారణంతో కన్నడ నటి రాన్యా రావ్ అరెస్టు అయ్యారు. దుబాయ్ నుంచి ఆమె తీసుకొచ్చిన దాదాపు 15 కేజీల బంగారాన్ని బెంగళూరు విమానాశ్రయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రాన్యా ఇటీవల తరచూ దుబాయ్ వెళ్లి వస్తుండడంతో ఆమెపై నిఘా పెట్టారు.

2

### నిరుద్యోగులకు

## గుడ్ న్యూస్..



**అమరావతి, (నినాదం):** ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఏపీపీఎస్సీ ఉద్యోగాలకు వయోపరిమితి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఏపీపీఎస్సీ తో పాటు పలు ఏజెన్సీలు నిర్వహించే డైరెక్ట్ రిక్రూట్ మెంట్ ఉద్యోగాలకు వయో పరిమితి పెంచుతూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. యూనిఫాం సర్వీసెస్‌కు 2 సంవత్సరాల వయో పరిమితి, నాన్ యూనిఫామ్ ఉద్యోగాలకు 34 ఏళ్ల నుంచి 42 ఏళ్లకు వయో పరిమితిని పెంచుతూ ప్రకటన విడుదల చేసింది. ఈ ఏడాది సెప్టెంబరు 30 లోపు జరిగే పరీక్షలకు ఇది వర్తిస్తుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

### తిరుమలలో మరోమారు

## చిరుత సంచారం

**అప్రమత్తంగా ఉండాలని భక్తులకు హెచ్చరిక**



**తిరుమల, (నినాదం):** తిరుమలలో మరోసారి చిరుత సంచారం కలకలం రేపింది. సోమవారం రాత్రి తిరుపతి జూ పార్కు రోడ్డులో చిరుత సంచరించింది. వేకువజామున ఒంటిగంట సమయంలో గాలి గోపురం సమీపంలోని మెట్ల మార్గంలో సంచరించింది. నడక మార్గంలోకి వచ్చి.. పిల్లిని వేటాడి అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. సీసీ కెమెరా దృశ్యాలను చూసి దుకాణదారులు షాక్ అవుతున్నారు. చిరుత సంచారం సమాచారంపై మెట్ల మార్గం వద్ద దుకాణదారులు ఫారెస్ట్, టీటీడీ విజిలెన్స్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులు తనిఖీ చేయగా.. చిరుత జాడ ఎక్కడా కనిపించలేదు. టీటీడీ అధికారులు నడక మార్గంలో భక్తులను అలెర్ట్ చేశారు. మధ్యాహ్నం 2గంటల వరకే 12 ఏళ్ల లోపు చిన్న పిల్లలను నడక మార్గంలో తీసుకెళ్లేందుకు అనుమతిని ఇచ్చారు. మధ్యాహ్నం అనంతరం భక్తులు గుంపులు గుంపులుగా వెళ్లాలని టీటీడీ అధికారులు సూచిస్తున్నారు. చిరుత సంచారంతో భక్తులు, ప్రజలు భయాందోళనలు గురవుతున్నారు.

## బిసిల సంక్షేమంపై వైసిపి మొసలి కన్నీరు



**ఐదేళ్ల పాలనలో వారిని విస్మరించారు**

**మండలిలో చర్చలో మంత్రులు లోకేశ్, సవితల ఆగ్రహం**

ఏపీ శాసనమండలిలో ప్రశ్నోత్తరాలపై చర్చ వాడి వేడిగా జరిగింది. బీసీల సంక్షేమానికి నిధుల కేటాయింపుపై వైసీపీ సభ్యుల ఆరోపణలకు ధీటుగా మంత్రులు నారా లోకేష్, సవిత సమాధానం చెప్పారు. బీసీలకు గత వైసిపి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో విద్యార్థి అమర్నాథ్ గౌడ్‌ను ఎలా హత్య చేశారో చర్చించేందుకు సిద్ధమా? అని లోకేశ్ సవాల్ విసిరారు.

బీసీల సంక్షేమానికి నిధుల కేటాయింపుపై శాసన మండలి ప్రశ్నోత్తరాల సమయంలో లోకేశ్ మాట్లాడారు. ఎమ్మెల్సీ అనంతబాబు దళితుడిని చంపి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేయలేదా?చేశారా? అనేది వైకాపా సభ్యుడు త్రిమూర్తులు చెప్పాలి. వైకాపా హయాంలో బీసీలకు రిజర్వేషన్లు ఎందుకు తగ్గించారో ఆ పార్టీ సభ్యులు చెప్పాలని లోకేశ్ డిమాండ్ చేశారు. మంత్రి సవిత మాట్లాడుతూ...నా బీసీలు అంటూ గొప్పలు చెప్పిన జగన్.. గత ఐదేళ్ల పాలనలో బీసీలకు ద్రోహం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 8 నెలల్లోనే రూ. 1,977 కోట్లు స్వయం ఉపాధి పథకాలకే కేటాయించాం. రూ.200 కోట్లతో 1.2 లక్షల మందికి ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇస్తూ కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నాం. బీసీల కోసం కార్పొరేషన్ల ద్వారా రాయితీపై రుణాలు అందిస్తున్నాం. ఆదరణ పథకానికి వెయ్యి కోట్ల నిధులు కేటాయించాం. 26 జిల్లాల్లో బీసీ భవన్‌లను నిర్మించబోతున్నాం అని మంత్రి తెలిపారు. బీసీ హాస్టళ్లు, గురుకులాలు మరమ్మతులు చేస్తున్నామని మంత్రి సవిత వెల్లడించారు.

- అమరావతి, (నినాదం)

**ఈ నెలలోనే మెగా డిఎస్సీ**
మరోమారు స్పష్టం చేసిన మంత్రి లోకేశ్

02

అమర్నాథ్ గౌడ్ హత్యపై
**చర్చకు వైసీపీ సిద్ధమా..** మంత్రి లోకేష్

### పులిపిల్లలతో

## సరదాగా ..

**పాలుపట్టి వాటితో ప్రేమ ప్రకటించిన మోడీ**

**వంతారాలో పర్యటించి వివరాలు తెలుసుకున్న ప్రధాని**

02



**జామ్‌నగర్, నినాదం):** పులిపిల్లలతో ప్రధాని మోడీ సరదాగా గడిపారు. వాటికి పాలు పట్టి తన ప్రేమను చాటారు. వంతారాలో పునరావాసం పొందుతున్న వివిధ జాతుల జంతువులతో ప్రధాని సన్నిహితంగా మెలిగారు. అక్కడ సింహాల పిల్లలకు , జిరాఫీలకు ఆహారం అందించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

### సెబీమాజీ చీఫ్ మాధవి పురి బచ్‌కు ఊరట

**ఎసిబి కోర్టు ఉత్తర్వులపై బాంబే హైకోర్టు స్టే**

02

### భారత్‌లో టెస్లా పరుగులు ఖాయం

**ముంబైలో తొలి షోరూమ్ కోసం ఒప్పందం**

### విసిల రాజీనామాలపై

## సభలో రగడ

**ఎవ్వరినీ బెదిరించాల్సిన అవసరం లేదు**

**సభలో ఆధారాలు చూపినా చర్చకు ముందుకు రాలే**

**ప్రభుత్వం తోకముడించదన్న మండలిలో విపక్షనేత బొత్స**

- అమరావతి, (నినాదం)

రాష్ట్రంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ల బలవంతపు రాజీనామాలపై విచారణకు సవాల్ చేసిన ప్రభుత్వం తీరా మండలిలో ఆధారాలు చూపగానే తోకముడిచిందని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. అసెంబ్లీ బయట మీడియా పాయింట్‌లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలతో కలిసి ఆయన మాట్లాడుతూ వీసీలతో బలవంతంగా రాజీనామాలు చేయించారనే ఆరోపణలపై విచారణకు సిద్ధమంటూ సవాల్ చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధారాలు చూపగానే ఎందుకు వెనక్కివెళ్లారో చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో స్వాతంత్రం వచ్చిన తరువాత ఎక్కడా, ఎప్పుడూ ఇలా వీసీలను బెదిరించి రాజీనామాలు చేయించిన ఘటనలు లేవని అన్నారు.



గవర్నర్ నియమించిన విసిలని ఉన్నత విద్యా శాఖ మండలి చైర్మన్, కార్యదర్శులు ఏ విధంగా రాజీనామాలు చేయమని ఆదేశిస్తారు? ఒకేసారి 17 మంది వీసీలు రాజీనామా చేయడంపై జ్యుడీషియల్ విచారణ జరపాలని కోరాం. దీనిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధారాలు చూపాలంటూ సవాల్ విసిరారు. తీరా సభలో అన్ని వివరాలను ముందుంచడంతో, దానిపై సమాధానం చెప్పలేక దబాయింపులు, బుకాయింపులకు దిగారు. పరుష పదజాలంతో దూషణలకు తెగబడ్డారు. వీసీలు తప్పు చేస్తే విచారించండి, వారిపై చర్యలు తీసుకోండి, ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ ప్రభుత్వం మారగానే వైస్ ఛాన్సలర్లతో బలవంతంగా రాజీనామాలు చేయించడం దారుణం. ఇది మొత్తం విద్యా వ్యవస్థకే కళంకం అన్నారు. పోలవరం

➤ 2వ పేజిలో..

### ఎమ్మెల్సీ ఫలితాలపైనా

## మాట మారిస్తే ఎలా?

**మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ విమర్శలు**



**విశాఖపట్నం, (నినాదం):** ఏపీలో ఎమ్మెల్సీ ఫలితాల తర్వాత మాట మార్చడానికి కూటమి నేతలకు సిగ్గులేదా అని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఉద్యోగుల కడుపు మంటకు నిన్నటి ఎన్నికల ఫలితాలే నిదర్శనమని తెలిపారు.ఓటమిని హుం దాగా ఒప్పుకోండి. ఎవరు గెలిస్తే వారే మా అభ్యర్థి అని చెప్పడం ఎంత దారుణం అంటూ ఘాటు విమర్శలు చేశారు.

➤ 5వ పేజిలో..

### పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో..

# కూటమిదే హవా

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి హవా చాటింది. పోటీ చేసిన రెండు స్థానాల్లో విజయం సాధించింది. ఉమ్మడి కృష్ణా-గుం టూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పీడీఎఫ్ అభ్యర్థి ఎంఎస్‌లక్ష్మణరావు మధ్య ప్రధానంగా పోటీ నడిచింది. అదే విధంగా ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరాబత్తుని రాజశేఖరం, స్వతంత్ర అభ్యర్థి వీర రాఘవులు మధ్య హోరాహోరీగా ప్రచారం నడిచింది.



**అమరావతి, (నినాదం):**

నిన్న ఉదయం ఓట్ల లెక్కింపు మొదలవగా తెల్లవారుజామున5గంటల ప్రాంతంలో కృష్ణా-గుంటూరు జిల్లాలపట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితం వెలువడింది. ఇక్కడ మొత్తం 2,41,873 ఓట్లు పోలయ్యాయి. ఆలపాటికి లక్షా 45 వేల 57 ఓట్లు వచ్చాయి. లక్ష్మణరావుకు 62,737 ఓట్లు వచ్చాయి. దీంతో ఆయనను విజేతగా ప్రకటించారు. తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల కౌంటింగ్ ఇంకా కొనసాగుతోంది. ఉదయం 11 గంటలకు అందిన సమాచారం మేరకు 28 టేబుళ్ళ 6వ రౌండు నాటికి 1,68,000 ఓట్లు లెక్కింపు పూర్తయ్యాయి. ఇందులో 1,53, 182 ఓట్లుచెల్లాయి. 14,818 ఓట్లు చెల్లు బాటు కాలేదు. కూట మి తరపున పోటీ చేసిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి 96,291 ఓట్లు రాగా.. పీడీఎఫ్ అభ్యర్థి దిడ్లవీర రాఘవులు 35, 614 ఓట్లు వచ్చాయి. వీరిద్దరి మధ్య 60,677 ఓట్ల వ్యత్యాసం ఉంది. ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. మరోవైపు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గంలో గాదె శ్రీనివాసులు నాయుడు విజయం సాధించారు. పోటాపోటీగా జరిగిన ఈ ఎన్నికలో ఏపీటీఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ మీద ఆయన గెలుపొందారు.



02

**కంగారూలపై ప్రతీకారం..**
ఫైనల్‌కు టీమ్ఇండియా

### ఆదోనికి పోసాని

## తరలింపు

**గుంటూరు, (నినాదం):** సినీ నటుడు పోసాని కృష్ణమురళిని వరుస కేసులు వెంటాడుతు న్నాయి. రోజుకు ఒక జైలు అన్నట్టుగా ఆయన జీవితం మారిపోయింది. అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో నరసరావుపేట పీఎస్ లో నమోదైన కేసులో పోసాని గుంటూరు జైల్లో ఉన్నారు. మరోవైపు కర్నూలు జిల్లా ఆదోని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో కూడా పోసానిపై కేసు నమోదయింది. దీంతో, ఆదోని త్రీ టౌన్ పోలీసులు గుంటూరు జిల్లా జైల్లో ఉన్న పోసానిని పీటీ వారెంట్‌పై అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం గుంటూరు నుంచి ఆయనను ఆదోనికి తరలించారు.

### అన్ని రంగాలను పట్టాలకెక్కించేలా

## కేటాయింపులు

**అసెంబ్లీలో ఆర్థికమంత్రి పయ్యావుల**

➤ 2వ పేజిలో..

## ఈ నెలలోనే మెగా డీఎస్సీ విడుదల

**మరోమారు స్పష్టం చేసిన మంత్రి లోకేశ్**

**అమరావతి, (నినాదం):** ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చి నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ ప్రక్రియ చేపడతామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క సారి కూడా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయలేదన్నారు. 1.82 లక్షల పోస్టులు గత టీడీపీ హయాంలోనే భర్తీ చేశాం అని తెలి పారు. ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో రెండోరోజు ప్రశ్నోత్తరా లు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో డీఎస్సీ నోటిఫికేషన్, నిరుద్యోగ భృతిపై సభ్యుల ప్రశ్నలకు మంత్రి నారా లోకేష్ సమాధానాలు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్కసారి కూడా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. 1.82 లక్షల పోస్టులు గత టీడీపీ హయాంలోనే భర్తీ చేశాం. ఎట్టి పరిస్థి తుల్లోనూ మార్చి నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసే భర్తీ చేపడతామని తెలిపారు. వాస్తవాలు తెలుసుకుని వైసీపీ సభ్యులు మాట్లా డాలి అని అన్నారు. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథ కాన్ని త్వరలోనే అమలు చేయనుందని, ఇందుకు సంబం ధించిన గైడ్ లైన్స్ త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు. తల్లికి వం దనం పథకానికి బడ్జెట్లో రూ.9,407 కోట్లు కేటాయించినట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. తల్లికి వందనం పథకంపై మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు.

## గాయని కల్పన ఆత్మహత్యాయత్నం

**హైదరాబాద్, (నినాదం):** ప్రముఖ గాయని కల్పన ఆత్మహత్యాయత్నం చేశారు. నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు సమాచారం. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో ఆమె చికిత్స పొందుతున్నారు. ఆత్మహత్యాయత్నానికి కారణం మాత్రం ఇంకా తెలియరాలేదు. కల్పన నిజాంపేటలోని వర్టెక్స్ ప్రీ వీలేజ్ గేటెడ్ కమ్యూనిటీలో నివసిస్తున్నారు. రెండు రోజులుగా వారి ఇంటి తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన సెక్యూరిటీ సిబ్బంది... అసోసియేషన్‌కు సమాచారం ఇచ్చారు. అసోసియేషన్ సభ్యులు ఆమెతో మాట్లాడేందుకు ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో, ఆమె భర్తకు కాల్ చేసి విషయం చెప్పారు. ఆయన కూడా కల్పనతో మాట్లాడేందుకు ప్రయత్నించగా ఫలితం లేకపోయింది. అసోసియేషన్ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇంటికి చేరుకున్న పెట్రోలింగ్ పోలీసులు తలుపులు పగులకొట్టారు. ఇంట్లో కల్పన అచేతన స్థితిలో ఉండటంతో సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కల్పన భర్త చెన్నై నుంచి ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. ప్రస్తుతం కల్పనకు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సింగర్ శ్రీకృష్ణ, గాయని సునీత, గీతామాధురి, కారుణ్య ఆస్పత్రికి వచ్చి కల్పన ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు

# బనకచర్లపై ఓ పార్టీ రాజకీయం చేస్తుంది



ఈ విజయోత్సవ సభలో సీఎం చంద్రబాబు నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును తానెప్పుడూ వ్యతిరేకించలేదని ఈసందర్భంగా గుర్తుచేశారు. గోదావరిపై ప్రాజెక్టులు నిర్మించండి.. నీళ్లు తీసుకెళ్లండి అంటూ తెలంగాణ పాలకులకు సూచించారు. అలాగే గంగా, కావేరీ నదులను అనుసంధానం చేయాలని ఆయన ఆకాంక్షించారు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనతో దేశాన్ని ప్రధాని నరేంద్ర మోదీ నడిపిస్తున్నారన్నారు. దేశం దశ,దిశ మార్చే సంస్కరణలు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తీసుకువచ్చారని వివరించారు. జాతి, రాష్ట్ర ప్రయోజనాలతో తన ప్రయోజనాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఇక బనకచర్ల ప్రాజెక్టుపైనా చంద్రబాబు మాట్లాడుతూ.. సముద్రంలోకి పోయే నీళ్లు.. కరువు ప్రాంతానికి తీసుకెళ్తే ఎవరూ బాధపడనక్కర్లేదంటూ తెలంగాణలోని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలకు ఆయన సూచించారు. గోదావరి నీళ్లు పోలవరం నుంచి బనకచర్లకు తీసుకెళ్లానని గతంలో చెప్పానని ఆయన గుర్తు చేశారు. సముద్రంలోకి పోయే నీళ్లను తెస్తామంటే.. ఒక పార్టీ రాజకీయం చేస్తోందంటూ సీఎం చంద్రబాబు నాయుడు విమర్శించారు. తాజాగా జరిగిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇద్దరు కూటమి అభ్యర్థిలు భారీ అధిక్యంతో గెలుపొందారు. అంతేకాకుండా గత అసెంబ్లీ ఎన్నికల్లో కంటే.. ఓటింగ్ షేర్ బాగా పెరిగినట్లు ఈఎన్నికల్లో క్లియర్ కట్‌గా స్పష్టమైంది. ఇది గతకొన్నేళ్ల పాలనకు ప్రజా తీర్పుగా కూటమిలోని నేతలు అభివర్ణిస్తున్నారు. అలాంటి వేళ.. టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీ ఆర్ భవన్‌లో ఎమ్మెల్సీ విజయోత్సవ సభను నిర్వహించారు. మరోవైపు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితోపాటు ఆ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి..తాజాగా ఢిల్లీలో పర్యటించారు. ఈ సందర్భంగా కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్ తో వారిరువురు సమావేశమయ్యారు. తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. గోదావరి జలాల వినియోగంలో ఏపీ దూకుడు మీద వెళ్తుందంటూ ఫిర్యాదు చేశారు. ఏపీలో బనక చర్ల అంశాన్ని సైతం కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ దృష్టికి తెలంగాణ సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తీసుకు వెళ్లారు. అలాంటి వేళ... సీఎం చంద్రబాబు పై విధంగా స్పందించారు.

## ఎమ్మెల్సీ ఫలితాలపైనా

# మాట మారిస్తే ఎలా

**మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ విమర్శలు**



**విశాఖపట్నం, (నినాదం):** ఏపీలో ఎమ్మెల్సీ ఫలితాల తర్వాత మాట మార్చడానికి కూటమి నేతలకు సిగ్గులేదా అని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఉద్యోగుల కడుపు మంటకు నిన్నటి ఎన్నికల ఫలితాలే నిదర్శనమని తెలిపారు. ఓటమిని హుందాగా ఒప్పుకోండి. ఎవరు గెలిస్తే వారే మా అభ్యర్థి అని చెప్పడం ఎంత దారుణం అంటూ ఘాటు విమర్శలు చేశారు. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ విశాఖలో మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల తరువాత టీడీపీ మంత్రులు, నేతల ప్రకటనలు చూసి ఆశ్చర్యం వేసింది. రఘువర్మ ఓటమి తరువాత మాకు సంబంధం లేదని అచ్చెన్నాయుడు చెబుతున్నారు. కూటమి నేతలకు మాట మార్చడానికి సిగ్గు లేదా?. ప్రభుత్వ పని తీరుకు ఎమ్మెల్సీ ఎన్నిక ఫలితం నిదర్శనం. విద్యాశాఖకు మంత్రిగా సీఎం కుమారుడు లోకేష్ ఉన్నారు. ఉద్యోగులకు పీఆర్సీ ఇస్తామని మోసం చేశారు. ఏనాడు జీతాలు సరిగా ఇవ్వలేదు. ఉద్యోగుల కడుపు మంటకు నిన్నటి ఫలితాలు నిదర్శనం. రిగ్గింగ్‌కు పాల్పడి పట్టభద్రుల ఎన్నికల్లో విజయం సాధించారు. ఓటమిని హుందాగా ఒప్పుకోండి. ఎవరు గెలిస్తే వారే మా అభ్యర్థి అని చెప్పడం ఎంత దారుణం. కూటమి తరపున మా అభ్యర్థి రఘు వర్మ అని అనేక సార్లు కూటమి నేతలు చెప్పారు. ఎన్నికల్లో ఎప్పుడూ శ్రీనివాసుల నాయుడు తమ అభ్యర్థి అని కూటమి నేతలు ప్రకటించలేదు. శ్రీనివాసుల నాయుడు కూడా కూటమి తనకు మద్దతు ప్రకటించలేదని స్పష్టం చేశారు. బాబాయి ఏమో.. శ్రీనివాసుల నాయుడు అంటున్నారు.. అబ్బాయి ఏమో.. రఘువర్మ అంటున్నారు. అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు చెప్పిన దాంట్లో ఎవరి మాట నిజం. ఎవరికో పుట్టిన బిడ్డకు మీరు పేరు పెట్టవద్దంటూఎద్దేవా చేశారు.కూటమి పాలనలో రిషికొండ బీచ్‌కు అన్యాయం జరిగింది. ప్రభుత్వ నిర్వాకం వల్ల బ్లూఫ్లాగ్‌ను బీచ్‌లో నుంచి తొలగించారు. ప్రభుత్వం చేతగాని చర్యలు వలన ఉత్తరాంధ్ర జిల్లాలు నష్టపోతున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ దూరంగా ఉంది అని చెప్పుకొచ్చారు.

## అమర్నాథ్ గౌడ్ హత్యపై

# చర్చకు వైసీపీ సిద్ధమా..:



**అమరావతి, (నినాదం):** ఏపీ శాసనమండలిలో ప్రశ్నోత్తరాలపై చర్చ వాడి వేడిగా జరుగుతోంది. బీసీల సంక్షేమానికి నిధుల కేటా యింపుపై వైసీపీ సభ్యుల ఆరోపణలకు ధీటుగా మంత్రులు నారా లోకేష్, సవిత సమాధానం చెప్పారు. మంత్రి లోకేష్ మా ట్లాడుతూ.. బీసీలకు గత ప్రభుత్వం తీవ్రంగా అన్యాయం చేసిం దని, అమర్నాథ్ గౌడ్‌ను వైసీపీ ప్రభుత్వం ఎలా హత్య చేసిందో చర్చించేందుకు సిద్ధమేనా అంటూ మంత్రి సవాల్ చేశారు. ఎమ్మెల్సీ అనంతబాబు దళితున్ని చంపి ఆ శవాన్ని డోర్ డెలివరీ చేశారా లేదా.. వైసీపీ సభ్యుడు త్రిమూర్తులు చెప్పాలన్నారు. వైసీపీ సర్కారు బీసీలకు రిజర్వేషన్లు ఎందుకు తగ్గించారో ఆ పార్టీ సభ్యులు చెప్పాలని మంత్రి లోకేష్ డిమాండ్ చేశారు.

## అన్ని రాష్ట్రాల్లో శ్రీవారి ఆలయాలు

**స్థలాలు కేటాయించాలంటూ ఛైర్మన్ లేఖలు**

**తిరుమల, (నినాదం):** దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణానికి ఉచితంగా స్థలం కేటాయించాలని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు కోరారు. ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖ రాశారు. దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలే కాదు.. సమాజ అభివృద్ధికి దోహదపడతాయి. దేశాభివృద్ధిలో టెంపుల్ టూరిజం ప్రత్యేక పాత్ర పోషిస్తోంది. ఆధ్యాత్మికత వైపు అందరూ అడుగులు వేస్తున్నారు. ప్రతి రాష్ట్ర రాజధానిలో వేంకటేశ్వరస్వామి ఆలయం ఉండాలి. కోట్లాది మంది భక్తులు దేవాలయాలకు విరాళాలు ఇస్తున్నారు. వాటిని విద్య, వైద్యం సహా ఇతర సేవా కార్యక్రమాల కోసం ఖర్చు చేస్తున్నాం. మన సంస్కృతి, వారసత్వ పరిరక్షణకు దేవాలయాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని లేఖలో పేర్కొన్నారు.

## మహిళల రక్షణ కోసం

# శక్తియాప్: అనిత




**అమరావతి, (నినాదం):** మహిళలపై లైంగిక వేధింపులు అరికట్టేందుకు, పని ప్రదేశాలలో వారికి రక్షణ కల్పించేందుకు కొత్తగా 'శక్తి' యాప్‌ను తీసుకొస్తున్నామని ఏపీ హోంశాఖ మంత్రి అనిత తెలిపారు. మహిళా దినోత్సవం రోజున ఈ యాప్‌ను సీఎం చంద్రబాబు ప్రారంభించబోతు న్నారని వెల్లడించారు. మహిళలపై లైంగిక వేధింపులు, దిశ చట్టంపై శాసనమం డలిలో వైకాపా ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. గత ప్రభుత్వం దిశ చట్టానికి చట్టబద్ధత కల్పించిందో లేదో గుండెలపై చేయి వేసుకొని చెప్పాలని అనిత నిలదీశారు.

# విసిల రాజీనామాలపై సభలో రగడ

ప్రాజెక్ట్ అనేది ఈ రాష్ట్రానికి జీవనాడి. ఈ ప్రాజెక్ట్ పేరు చెప్పగానే వైఎస్సార్ గుర్తుకు వస్తారు. ఈ ప్రాజెక్టును 45.72 మీటర్లతో నిర్మించిప్పుడే విద్యుత్ ఉత్పత్తి, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నీరు, ఉత్తరాంధ్రకు తాగునీరు అందుతాయి. కానీ ప్రభుత్వం పోలవరం ఎత్తును 41.15 మీటర్లకే పరిమితం చేస్తోంది. పోలవరం ప్రాజెక్టును కేంద్రమే నిర్మించి ఇవ్వాలి. కానీ చంద్రబాబు మాత్రం తన స్వలాభం కోసం కాంట్రాక్టర్ల కోసం తామే నిర్మిస్తామని బాధ్యత తీసుకున్నారు. చివరికి పోలవరం ఎత్తుపైన కూడా చంద్రబాబు రాజీ పడుతున్నారు.రికార్డులను పరిశీలిస్తే ఇందులో వాస్తవాలు బయటపడతాయి. దీనిపై వివరణ ఇవ్వాలని మండలిలో ప్రభుత్వాన్ని నిలదీశాం. కానీ ప్రభుత్వం నుంచి దీనిపై సూటిగా సమాధానం రాలేదు. పోలవరం ఎత్తును తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందనీ అర్థమవుతోంది. వైఎస్సార్‌సీపీగా దీనినిఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించం అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో చేనేత కార్మికులను గాలికి వదిలేసింది. దీనిపై మండలిలో ప్రశ్నిస్తే శవాలమీద పేలాలు ఏరుకుంటున్నారంటూ మాపై ప్రభుత్వం ఎదురుదాడి చేస్తోంది. బీసీల గురించి మాట్లాడితే ఇలాంటి నీచమైన వ్యాఖ్యలు చేస్తారా? చేనేత కార్మికుల కోసం రూ.వెయ్యి కోట్ల నిధిని పెడతానని మోసం చేసిన ఘనత చంద్రబాబుది. 2019-24 మధ్య వైయస్ఆర్ నేతన్న నేస్తం కింద రూ.960 కోట్లునేతన్నలకు ఇచ్చాం. రూ.1396 కోట్లు వారి పెన్షన్‌ల కోసం ఖర్చుచేశాం. కానీ కూటమి ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం కోసం అంటూ అంకెల గారడీతో ప్రచారం చేసుకుంటోంది. తమకు అనుకూలమైన మాధ్యమాల్లో లేనిది ఉన్నట్లుగా చాటుకుంటోంది. బలహీనవర్గాల విషయంలో న్యాయం చేయకపోగా వారిని కించపరిచేలా మాట్లాడుతున్నారు. సంక్షోభంలో ఉన్న విద్యుత్ డిస్కామ్ లు వాటిని కాపాడటానికివైఎస్సార్‌సీపీ ప్రభుత్వంరూ. 47వేల కోట్లు ఖర్చు పెట్టింది.ట్రూఅప్ చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజలపై వేసిన రూ.15 వేల కోట్ల ప్రభారాన్ని ప్రభుత్వమే భరించాలి. 2014-19లో తెలుగుదేశం ప్రభుత్వం చేసిన అప్పుల్లో కనీసం మూడోవంతు కూడా మా హయాంలో చేయ లేదు. రాష్ట్రంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎక్కడా మా పార్టీ అభ్యర్థులు పోటీ చేయ లేదు. కూటమి నిలబెట్టిన అభ్యర్థులకు మేం వ్యతిరేకమని మాత్రమే చెప్పాం. ఎవరికీ మద్దతు ప్రకటించలేదు. రిగ్గింగ్‌లు, డబ్బు పంపిణీ, అధికార దుర్వినియోగంతో కూటమి అభ్యర్థులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచారు. ఉత్తరాంధ్రలో రఘువర్మ తమ అభ్యర్థి అంటూ కూటమి నేతలు ప్రచారం చేసుకున్నారు. ఇప్పుడు ఆయనక బదులు గెలిచిన శ్రీనివాసులు నాయుడిని తమ అభ్యర్థి అంటూ చెప్పుకోవడం దారుణం. ఎవరికో పుట్టి న పిల్లవాడిని తమ కొడుకు అని చెప్పు కుంటున్నట్లుగా ఉందన్నారు.

# శక్తి యాప్.. అదే దీని స్పెషాలిటీ.. హోంమంత్రి



**అమరావతి, (నినాదం):** వైసీపీ ప్రభుత్వంలో పస లేని దిశ చట్టాన్ని పక్కన పెట్టి సరికొత్తగా శక్తి యాప్ ని తీసుకువస్తున్నట్లు హోం మంత్రి వంగలపూడి అనిత మండలిలో ప్రకటించారు. నెట్ వర్క్ లేని రిమోట్ ప్రదేశాల్లో కూడా పనిచేసేలా ప్రత్యేకంగా యాప్‌ని తీర్చిదిద్దుతున్నట్లు తెలియజేశారు.మార్చి 8వ తేదీన మహిళా దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు చేతులమీదుగా 'శక్తి యాప్ 'ను ఆవిష్కరించ నున్నట్లు హోంమంత్రి అనిత పేర్కొన్నారు.మహిళలు, చిన్నారుల భద్రత కోసం ప్రత్యేక రక్షణ విభాగం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈగల్ తరహాలో ఐజీ స్థాయి ఐపీఎస్ అధికారి దీనికి నేతృత్వం వహిస్తారన్నారు. మహిళలకు రాజకీయాలకతీతంగా రక్షణ చర్యలు చేపడతామని ఆమె స్పష్టం చేశారు. మహిళల భద్రత విషయంలో రాజీపడబో మన్నారు. దిశ యాప్‌తో గత ప్రభుత్వంలో రక్షణ ఉండేదన్న వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి వ్యాఖ్యలపై హోంమంత్రి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. దిశ చట్టం కింద ఫిర్యాదు చేసిన కేసు ఒక్కటైనా ఉందా? 'దిశ' కేవలం ప్రచారానికే పరిమితమైందన్నారు. ఐదేళ్లలో దిశ చట్టాన్ని ఎందుకు చేయ లేదు? అంటూ సూటిగా ప్రశ్నించారు. దిశ యాప్‌కు చట్టబద్ధత ఎక్కడుంది? ఎంతమందిని యాప్ ద్వారా కాపాడారు? వివరాలు చెప్పాలని హోంమంత్రి డిమాండ్ చేశారు. వేధింపులు జరిగితే దిశ చట్టం కింద ఫిర్యాదు చేసిన కేసు ఒక్కటైనా ఉందా? అని అడిగారు.పని ప్రదేశాల్లో మహిళ భద్రత కోసం 2013 పీఓఎస్‌హెచ్ చట్టం అమలవుతోందని హోంమంత్రి అనిత వెల్లడించారు. 2019-24 వరకూ ఈ చట్టం కింద 85 కేసులు నమోదైనట్లు తెలిపారు.41ఎ సీఆర్ పీసీ/35(3) కింద 72 మందికి బీఎన్ఎస్ఎస్ నోటీసులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. మొత్తం ఈ చట్టం ప్రకారం అందిన ఫిర్యాదుల మేరకు దర్యాప్తు చేసి కేసు నమోదు చేసి 24 మందిని అరెస్ట్ చేశామని వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి అడిగిన ప్రశ్నకు హోంమంత్రి అనిత సమాధానం చెప్పారు. 2024 సెప్టెంబర్ నుంచి 2025 జనవరి వరకూ కమిటీలకు వచ్చిన ఫిర్యాదుల సంఖ్య మొత్తం 50 అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పా టయ్యాక 2024లో మొత్తం 30 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. 23 మందికి నోటీసులివ్వగా.. ఐదుగురిని ఇప్పటివరకూ అరెస్ట్ చేసినట్లు స్పష్టం చేశారు. వేధింపులు, దాడులకు పాల్పడిన వారిపై ఫిర్యాదు చేయడానికి జిల్లా స్థాయి స్థానిక ఫిర్యాదు కమిటీ, అంతర్గత ఫిర్యాదు కమిటీ అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతి పదిమంది మహిళలతో ఏర్పాటు చేసిన ఈ కమిటీలో మహిళలకు 50 శాతం ప్రాతినిధ్యం ఉంటుందని తెలియజేశారు.రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలలో ఏర్పాటు చేసిన అంతర్గత కమిటీలు 6,681 గా తేల్చి చెప్పారు. రాష్ట్ర పునర్ విభజన తర్వాత ఏపీ వ్యాప్తంగా 26 ఎల్సీ, ఐసీ కమిటీలు ఏర్పాటయ్యాయన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పని ప్రదేశాల్లో రక్షణకు సంబంధించిన చట్టపరమైన పరిణామాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు హోంమంత్రి తెలిపారు. ఏదైనా ఇబ్బంది జరిగినపుడు చెప్పుకో వడానికి భయపడి ఆగిపోకుండా అవగాహన కలిగించి వారికి న్యాయం చేస్తామనే భరోసా అందిస్తామన్నారు. స్త్రీ,శిశు సంక్షేమ శాఖను అడగాల్సిన ప్రశ్నలను వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి హోంమంత్రిని అడుగుతున్నారన్నారు. ఏ ప్రశ్న ఎవరిని అడగాలో అవగాహనతో ఉంటే బాగుంటుందన్నారు. శాసన మండలిలో మంగళవారం వైసీపీ ఎమ్ఎల్‌సీలు వరుదు కళ్యాణి, ఏసురత్నంల ప్రశ్నలకు హోం మంత్రి అనిత ధీటుగా బదులిచ్చారు.

## ఎడిసి అధికారులతో ప్రపంచబ్యాంక్ బృందం భేటీ

**ప్రాజెక్ట్ నిర్మాణాలపై అధికారులతో చర్చ**

**అమరావతి, (నినాదం):** ఏపీ రాజధాని అమరావతిలో ప్రపంచ బ్యాంకు రుణంతో చేపడుతున్న వివిధ ప్రాజెక్టుల నిర్మాణాలపై అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) అధికారులతో ప్రపంచబ్యాంకు బృందం సమావేశమైంది. ఏడీసీ సీఎండీ డి.లక్ష్మీపార్థ సారథితో బ్యాంకు ప్రతినిధులు .. రుణం మంజూరు చేస్తున్న ప్రాజెక్టు నిర్మాణాలపై చర్చించారు. ముఖ్యంగా అమరావతి నగరానికి కావాల్సిన తాగునీటి సరఫరాపై చర్చ జరిగింది. తాగునీటి సరఫరా వ్యవస్థకు చేపడుతున్న ముఖ్యమైన మౌలిక సదుపాయాల రూపకల్పనపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాజధానిలో నివసించే ప్రజలకు తాగునీటి లభ్యతకు గల అవకాశాలతో పాటు,నీటిని శుద్ధిచేసి పంపిణీ చేసే వ్యవస్థపై ఏడీసీ అధికారులు ప్రపంచ బ్యాంకు ప్రతినిధులకు వివరించారు. వాటర్ ట్రీట్మెంట్ ఎలాంట్లు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి టెండర్లు రూపొందించినట్లు సీఎండీ.. బ్యాంకు ప్రతినిధులకు స్పష్టం చేశారు.

## సెబీమాజీ చీఫ్ మాధవి పురి బచ్‌కు ఊరట

**ఎసిబి కోర్టు ఉత్తర్వులపై బాంబే హైకోర్టు స్టే**

**ముంబై, (నినాదం):** సెబీమాజీ చీఫ్ మాధవి పురి బచ్‌కు బాంబే హైకోర్టు లో ఊరట లభించింది. తమపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానం జారీ చేసిన ఉత్తర్వులపై మాధవి పురి బచ్‌తో పాటు మరో అయిదుగురు ఉన్నతాధికారులు బాంబే హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై మంగళవారం విచారణ జరిగింది. నాలుగు వారాల పాటు కింది కోర్టు ఉత్తర్వులను నిలిపివేస్తూ తాజాగా హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. పూర్తిస్థాయి పరిశీలన లేకుండా కింది కోర్టు ఈ ఉత్తర్వులు ఇచ్చినట్లు కనిపిస్తోంది. ఇరువర్గాల వాదనలు పరిశీలించిన తర్వాత వాటిని నిలిపివేస్తున్నాం' అని ఉన్నత న్యాయస్థానం వెల్లడించింది. స్టాక్‌ఎక్స్ఛేంజ్‌లో కంపెనీలను లిస్ట్ చేయడంలో పెద్దఎత్తున ఆర్థిక మోసం, అవినీతి జరిగిందని ఆరోపిస్తూ థానేకు చెందిన జర్నలిస్ట్ సపన్ శ్రీవాత్సవ దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రత్యేక న్యాయమూర్తి ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. మాధవి పురి బచ్ తో సహా ఐదుగురు ఉన్నతాధికా రులపై ఎఫ్ఐఆర్ నమోదుచేయాలని ఆదేశాలు ఇచ్చారు. గత కొన్ని నెలలుగా మాధవి పురి బచ్ పలు వివాదాల్లో చిక్కుకున్నారు. అదానీ గ్రూప్‌నకు చెందిన ఆఫ్‌షోర్ కంపెనీల్లో మాధవి పెట్టుబడులు పెట్టారని గతేడాది ఆగస్టులో హిండెన్‌బర్గ్ చేసిన పోస్ట్ సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఆమెపై మరిన్ని ఆరోపణలు వచ్చాయి. ఇందులో తన భర్త ధావల్ బచ్‌కు కూడా పెట్టుబడులు ఉన్నాయని పేర్కొనడం చర్చకు దారితీసింది. అవన్నీ తప్పుడు ఆరోపణలే అంటూ బచ్ దంపతులు వివరణ ఇచ్చిన విషయం తెలిసిందే.

## భారత్‌లో టెస్లా పరుగులు ఖాయం

**ముంబైలో తొలి షారూమ్ కోసం ఒప్పందం**

**ముంబై, (నినాదం):** ముంబైలో తన మొదటి షోరూమ్ కోసం ఒప్పందాన్ని ఖరారు చేయడంతో టెస్లా భారతదేశంలో ప్రారంభించటానికి దగ్గరగా ఉంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతీయ మార్కెట్‌లోకి ప్రవేశించడానికి సిద్ధమవుతున్న ఈ సమయంలో కంపెనీకి ఇది ఒక ముఖ్యమైన అడుగు. ఇటీవలి మీడియా నివేదికల ప్రకారం, టెస్లా ముంబైలోని ప్రధాన బాంద్రా-కుర్లా కాంప్లెక్స్ లో 4,000 చదరపు అడుగుల వాణిజ్య సముదాయాన్ని బుక్ చేసుకుంది. ఈ ఫ్లాగ్‌షిప్ షోరూమ్ టెస్లా తాజా ఎలక్ట్రిక్ మోడళ్లను ప్రదర్శిస్తుంది. టెస్లా నెలవారీ అద్దెను దాదాపు రూ.35 లక్షలు అంటే చదరపు అడుగుకు రూ.900 గా నిర్ణయించింది. లీజు ఒప్పందం ఐదు సంవత్సరాలు. టెస్లా ఇప్పటికే ఢిల్లీలోని ఏరోసిటీ కాంప్లెక్స్‌లో రెండవ షోరూమ్‌ను ప్రారంభించాలని యోచిస్తోంది. టెస్లా భారతదేశంలో తన ఉనికిని విస్తరించాలని యోచిస్తోంది. అలాగే దీని కోసం కంపెనీ ఢిల్లీ, ముంబై, పూణెలి వంటి నగరాల్లో అనేక ప్రాంతాలను ఎంచుకోగా, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్, ప్రధాని నరేంద్ర మోడీ మధ్య జరిగిన సమావేశం తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆ కంపెనీ తన మొదటి షోరూమ్‌ను ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో ప్రారంభించాలని యోచిస్తోంది. ఇది ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ప్రాంతాలలో ఒకటి. దీనితో పాటు టెస్లా ఢిల్లీలోని ఏరోసిటీలో తన షోరూమ్‌ను కూడా ప్రారంభించాలని యోచిస్తోంది. భారతదేశంలోకి టెస్లా ప్రవేశం ఎలక్ట్రిక్ వాహన మార్కెట్‌లో పోటీని పెంచడమే కాకుండా భారతదేశ ఆటోమొబైల్ రంగానికి ఒక కొత్త విప్లవంగా కూడా నిరూపించుకోనుంది.టెస్లా మోడల్స్ భారతదేశంలో ప్రీమియం ఆఫర్‌లుగా ఉండనున్నాయి. ధరలు దాదాపు రూ. 21 లక్షల నుండి ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

# కంగారూలపై ప్రతీకారం..


## ఫైనల్‌కు టీమ్ఇండియా



దుబాయ్: ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో టీమ్ ఇండియా ఫైనల్‌కు చేరింది. మంగళవారం ఆస్ట్రేలియాతో జరిగిన తొలి సెమీ ఫైనల్‌లో 4 వికెట్ల తేడాతో భారత్ ఘన విజయం సాధించింది.తొలుతబ్యాటింగ్‌చేసిన ఆసీస్. 49.3 ఓవర్లలో 264 పరుగులకు ఆలౌటైంది. ఈ లక్ష్యాన్ని టీమ్ఇండియా 48.1 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి ఛేదించింది. దీంతో 2023 వన్డే ప్రపంచ కప్ ఫైనల్ ఓటమికి కంగారూలపై భారత్ ప్రతీకారం తీర్చుకున్నట్లయింది. విరాట్ కోహ్లీ (84బీ 98 బంతుల్లో 5 ఫోర్లు) జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. శ్రేయస్ అయ్యర్ (45బీ 62 బంతుల్లో 3 ఫోర్లు) మరోసారి మంచి ప్రదర్శన చేశాడు. కేఎల్ రాహుల్ (42బీ 34 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సలు), హార్దిక్ పాండ్య (28బీ 24 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సలు) రాణించారు.రోహిత్ శర్మ (28బీ 29 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), అక్షర్ పటేల్ (27బీ 30 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. శుభ్‌మన్ గిల్ (8) నిరాశపర్చాడు. ఆసీస్ బౌలర్లలో ఆడమ్ జంపా 2, బెన్ ద్వార్షుయిస్, నాథన్ ఎల్లిస్, కూపర్ కనోలీ ఒక్కో వికెట్ పడగొట్టారు. మార్చి 9న ఫైనల్ మ్యాచ్ దుబాయ్‌లో జరగనుంది. బుధవారం సౌతాఫ్రికా, న్యూజిలాండ్ మధ్య జరిగే సెమీ ఫైనల్-2లో విజేతగా నిలిచిన జట్టు తుది పోరులో భారత్‌తో తలపడనుంది.

## పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా

# ఆలపాటి రాజేందప్రసాద్ విజయం



**గుంటూరు, (నినాదం):** ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఘన విజయం సాధించారు. మొత్తం తొమ్మిది రౌండ్లకు గానూ, మంగళవారం తెల్లవారుజామున 5:50 గంటల సమయంలో చివరి రౌండ్ పూర్తయ్యే సరికి ఆయనకు 82,320 ఓట్ల ఆధిక్యం వచ్చింది. 7వ రౌండ్ ముగిసే సరికి ఆయనకు 1,18,070 ఓట్లు వచ్చాయి. మొత్తం 2,41,873 ఓట్లు పోలవగా, ఏడో రౌండ్ పూర్తయ్యే సరికి 21,577 చెల్లని ఓట్లుగా గుర్తించారు. దీంతో 50 శాతానికి పైగా ఓట్లు సాధించడంతో ఆలపాటిని విజేతగా ప్రకటించారు. ఇక తొమ్మిదో రౌండ్ పూర్తయ్యే సరికి ఆలపాటికి 1,45,057 ఓట్లు వచ్చాయి. సమీప ప్రత్యర్థి లక్ష్మణరావు 62,737 ఓట్లు సాధించారు. ఆలపాటి రాజాకి 82,320 ఓట్ల మెజార్టీ దక్కింది. చెల్లుబాటు అయిన ఓట్లలో 60 శాతం పైగా ఓట్లను ఆలపాటి సాధించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ తరఫున పోటీచేసిన గాదె శ్రీనివాసులు నాయుడు విజయం సాధించారు. పోటాపోటీగా సాగిన ఎన్నికలో ఏపీటీఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ మీద ఆయన గెలుపొందారు. ఏయూలో జరిగిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చివరివరకు ఉత్కంఠగా సాగింది. ఈ ఎన్నికల్లో 10 మంది బరిలో ఉన్నా.. పీఆర్‌టీయూ అభ్యర్థి శ్రీనివాసులు నాయుడు, పీడీఎఫ్ అభ్యర్థి విజయగౌరి, ఏపీటీఎఫ్ అభ్యర్థి రఘువర్మ మధ్యే పోటీ నెలకొంది. నువ్వానేనా అన్నట్లు పోటీ సాగగా ఆఖరుకు రఘువర్మను ఎలిమినేట్ చేశారు. మొత్తం పోలైన ఓట్లు 20,791 అయితే చెల్లిన ఓట్లు 20,135. ఇందులో 10,068 ఓట్లతో మేజిక్ ఫిగర్ని అందుకోవాల్సి ఉండగా గాదెకు 12,035 ఓట్లు వచ్చాయి. దీంతో ఆయన గెలిచినట్లు ప్రకటించారు.

## విద్యుత్ ఛార్జీలను పెంచేది లేదు మండలిలో స్పష్టం చేసిన మంత్రి గొట్టిపాటి

**అమరావతి, (నినాదం):** :కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచలేదని, పెంచదని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపు పాపం మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిదే అని, వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు 9 సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచారన్నారు. విద్యుత్ ఛార్జీలు వాళ్లే పెంచి, వాళ్లే ధర్నాలు చేసి, వాళ్లే ప్రశ్నలు అడగడం ఒక వింత పరిస్థితి అని మంత్రి గొట్టిపాటి విమర్శించారు.విద్యుత్ ఛార్జీల పెంపు అంశంపై ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో ప్రశ్నోత్తరాలు కొనసాగాయి. సభ్యుల ప్రశ్నలకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి సమాధానం ఇచ్చారు. ఈ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచబోదు. ప్రభుత్వం దానికి కట్టుబడి ఉంది. గత కౌన్సిల్ సమావేశాల నుంచి పదే పదే సత్యదూరమైన ప్రచారం చేస్తున్నారు. వారు పెంచిన విద్యుత్ చార్జీలకు వారే ధర్నాలకు పిలుపునిస్తున్నారు, వాళ్లే ప్రశ్నలు వేస్తున్నారు. వైసీపీ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. 2023-24 లోనే 15 వేల కోట్ల భారాలు వేశారు. రాష్ట్రానికి రావాల్సిన పెట్టుబడిదారులను తరిమికొట్టారు. కృష్ణపట్నం, వీటీపీఎస్ ఎలాంట్లను గత టీడీపీ ప్రభుత్వం అభివృద్ధి చేయాలని చూస్తే.. ఆ తర్వాత వచ్చిన వైసీపీ షట్ డౌన్ చేసింది. విద్యుత్ వ్యవస్థలను నిర్వీర్యం చేసిన ఘటన వైసీపీది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సొంతగా తయారీపై దృష్టి పెట్టింది. రైతులకు పగటి పూట కరెంట్ ఇచ్చేందుకే కృషి చేస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచలేదు, పెంచదు' అని మంత్రి గొట్టిపాటి చెప్పారు.

## 15కిలోల బంగారం తరలింపు

గత 15 రోజుల్లో 4 సార్లు దుబాయ్ వెళ్లొచ్చిన రాన్యా.. ఎలాంటి అనుమానం రాకుండా.. గోల్డ్ బిస్కెట్లను దుస్తుల్లో దాచి, తీసుకొచ్చేవారని డీఆర్ఐ అధికారులు తెలిపారు. ప్రణాళిక ప్రకారం తాజాగా ఆమెను అరెస్ట్ చేశారు. కర్ణాటకకు చెందిన ఓ పోలీసు అధికారికి రాన్యా బంధువని సమాచారం. డీఆర్ఐ అధికారులు ప్రశ్నించగా.. తాను డీజీపీ కుమార్తెనని చెప్పి.. ఇంటి వద్ద డ్రాప్ చేసేందుకుగానూ ఆమె పోలీసులకు కాల్ చేసినట్టు తెలిసింది. అసలు పోలీసు అధికారులతో రాన్యాకు సంబంధమేంటి? ఆ స్మగ్లింగ్‌లో వారి ప్రమేయం ఏమైనా ఉందా? అన్న కోణంలో డీఆర్ఐ అధికారులు ఇన్వెస్టిగేషన్ చేస్తున్నారు. కిచ్చా సుదీప్ హీరోగా నటించిన 'మాణిక్య' చిత్రంతో తెరంగేట్రం చేశారు రాన్యా రావ్. ఆ తర్వాత 'వాఘా', 'పటాకీ' సినిమాల్లో నటించారు.

## అన్ని రంగాలను పట్టాలకెక్కించేలా

# కేటాయింపులు

**అమరావతి, (నినాదం):** బడ్జెట్‌లో అన్ని వర్గాలకు సంతృప్తి కలిగేలా, అన్ని రంగాలను ముందుకు తీసుకుని వెళ్లేలా సమతూకంతో కేటాయింపులు చేపట్టామని,ఎంత క్లిష్ట పరిస్థితుల్లో బడ్జెట్ వచ్చిందనేది అందరూ గుర్తించారని, కానీ, అసెంబ్లీకి రాని శాసనసభ్యులు మాత్రం బయట ఉండి విమర్శలు చేస్తున్నారని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైకాపా నేతల తీరుపై మండిపడ్డారు. కొందరు సభకు రాకుండా ఉన్నవి లేనివి కల్పించి ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. చేసిన పాపాలు వెంటాడటం వల్లే వారు అసెంబ్లీకి రాలేకపోతున్నారన్నారు. గత లోపాలు ఎత్తి చూపుతారనే శాసనసభకు ముఖం చాటేస్తున్నారు. రాష్ట్రంలో ఐదేళ్లపాటు ఆర్థిక విధ్వంసం సృష్టించారు. విలువలు వదిలేసి ప్రతిపక్షాల గొంతు నొక్కడంపైనే దృష్టిపెట్టారు. పేదోడి బువ్వ లాక్కున్నందునే వారు 11 స్థానాలకు పరిమితమయ్యారు. వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించలేదని చెబుతున్నారు.. కానీ, గతంలోనే ప్రాజెక్టు పూర్తయింది.. జాతికి అంకితం చేసినట్లు ప్రచారం చేశారు. పూర్తయిన ప్రాజెక్టుకు ఏం కేటాయింపులు చేయాలి? ఇదేం ద్వంద్వ వైఖరని మంత్రి ప్రశ్నించారు. వైసీపీపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సభలో సంచలన కామెంట్లు చేశారు. అలాగే రాష్ట్ర పరిస్థితిపై ప్రజెంటేషన్ ఇచ్చారు. అంతే కాకుండా నాటి, నేటి ప్రభుత్వాల మధ్య తేడాలను చెప్పారు. బాలయ్య డైలాగ్స్ చెబుతూ ఇరు ప్రభుత్వాల మధ్య వ్యత్యాసాలను సభ ముందు ఉంచారు. వైసీపీ సమాజానికి హానికరం అంటూ కామెంట్స్ చేశారు. సిగరెట్ పెట్టెల మీద స్టాట్యూరీ వార్నింగ్ ఇచ్చినట్టుగా.. వైసీపీ సమాజానికి హానికరం అంటూ పదే పదే చెప్పాల్సిన బాధ్యత తమసపై ఉందన్నారు. సభకు రాకుండా డ్రాప్ అవుట్ ఎమ్మెల్యేలు బయట కూర్చొని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం గురించి పదే పదే ప్రస్తావించడం దేనికని ప్రశ్నిస్తున్నారన్నారు. వైసీపీ హానికరం అనే విషయాన్ని ఇప్పటికే ప్రజలు గుర్తించారని.. అందుకే ఆ పార్టీని 11 స్థానాలకు పరిమితం చేశారని తెలిపారు. ప్రజలు కూటమికి అనుకూలంగా అద్భుతమైన తీర్పు ఇచ్చారని చెప్పుకొచ్చారు. మీరు అనుమతిస్తే నా సమయం తగ్గించుకొని వైసీపీ వారు ఏం మాట్లాడుతారో మాట్లాడమనండి. జీత భత్యాలు, అప్పులు, వడ్డీలకు వచ్చే ఆదాయం సరిపోతుంది అది కూడా 1శాతం లోటు ఉంది ... దీనిలో కమిటెడ్ ఎక్సపెండీచర్ చూపలేదు. అప్పు చేయడం తప్పుకాదు... చేసిన అప్పు క్యాపిటల్ ఇన్వెస్టమెంట్‌లో చేయాలి... ప్రొడక్టవిటీ పెంచాలి. చంద్రబాబు ఉన్నప్పుడు వ్యవసాయ రంగం 16 శాతం.... సేవల రంగం 12 శాతం ఉండగా.. . జగన్ వచ్చాక వ్యవసాయం, సేవల రంగం 3 శాతానికి పడిపోయింది. ఈ మూడు శాతం ఉంటే 76 వేల కోట్లు అదనంగా వచ్చేది. అధికారులను అందరికి ఇదే డైరెక్షన్‌లో ముందుకు వెళ్లే లా చూడాలిని కోరుతున్నా. 2014-19 మధ్య ఇరిగేషన్‌లో 40వేల కోట్లు ఖర్చు పెట్టారు. విడిపోతే పడిపోతాం అని అనుకున్నాం అయితే చంద్రబాబు నిలబెట్టాడు పరుగుపెట్టించారు. గత అయిదేళ్లలో వైసీపీ ఏం చేసింది. రాయలసీమ, ఉత్తరాంధ్ర నుంచి నీటి కోసం విజ్ఞప్తులు వచ్చేవి. అయితే ఇప్పుడు కృష్ణ, గుంటూరు, ఉభయగోదావరి జిల్లల నుంచి వస్తున్నాయని మంత్రి కేశవ్ తెలిపారు.

# పులిపిల్లలతో సరదాగా గడిపిన ప్రధాని

**జావమ్‌నగర్, నినాదం):** పులిపిల్లలతో ప్రధాని మోడీ సరదాగా గడిపారు. వాటికి పాలు పట్టి తన ప్రేమను చాటారు. వంతారాలో పునరావాసం పొందుతున్న వివిధ జాతుల జంతువులతో ప్రధాని సన్నిహితంగా మెలిగారు. అక్కడ సింహాల పిల్లలకు, జిరాఫీలకు ఆహారం అందించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. గాయపడిన, ఇబ్బందుల్లోఉన్న జంతువులను సంరక్షించే లక్ష్యంతో 'వంతారా' కార్యక్రమాన్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, రిలయన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ అనంత్ అంబానీ ప్రారంభించారు. వన్యప్రాణుల రక్షణ, పునరావాసం, సంరక్షణ కేంద్రమైన ఈ వంతారాను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం సందర్శించారు. ప్రధాని మోదీ ప్రస్తుతం తన సొంత రాష్ట్రం గుజరాత్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. సోమవారం ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా గిర్ అడవుల్లో సఫారీకి వెళ్లారు. మంగళవారం జామ్‌నగర్‌లోని వంతారాను సందర్శించారు. వన్యప్రాణుల ఆసుపత్రిని, జంతువుల కోసం ఏర్పాటు చేసిన పశువైద్య సౌకర్యాలను వీక్షించారు. అంతే కాకుండా వైల్డ్‌లైఫ్ అనస్థీషియా, కార్డియాలజీ, నెఫ్రాలజీ, ఎండోస్కోపీ, డెంటిస్ట్రీ, ఇంటర్నల్ మెడిసిన్ మొదలైన అనేక విభాగాలను కూడా పరిశీలించారు.దేశ, విదేశాల్లో గాయపడిన, ప్రమాదంలో చిక్కుకున్న జంతువులను కాపాడి, చికిత్స చేసి, సంరక్షించి, పునరావాసం కల్పించడం 'వంతారా' ముఖ్య లక్ష్యం. వంతారా అనేది కృత్రిమ అడవి. గుజరాత్‌లోని జామ్‌నగర్ రిలయన్స్ రిఫైనరీ కాంప్లెక్స్‌లో 3 వేల ఎకరాల్లో ఇది ఉన్నది. ఈఅడవిలో 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏనుగుల కోసం ప్రత్యేకంగా దవాఖాన ఉంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్దది. ఇందులో దాదాపు 2వేల వన్యప్రాణులను సంరక్షిస్తున్నారు. వేల సంఖ్యలో ఉద్యోగులు కూడా పనిచేస్తున్నారు.

# అభివృద్ధికి కృషి చేయాలి

గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి,



**హైదరాబాద్, (నినాదం):** సికింద్రాబాద్ సర్కిల్ జీహెచ్ఎంసి ఇంజనీర్ విభాగ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బాధ్యతలు స్వీకరించిన కవిత, గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు శోభన్ రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ తార్నాక డివిజన్, సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో ఉన్న సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో పాటు, తార్నాక డివిజన్, సికింద్రాబాద్ నియోజక వర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి కృషి చేయాలని ఈ ఈ కి డిప్యూటీ మేయర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్ సువర్ణ , అసిస్టెంట్ ఇంజనీర్ వేణు తదితరులు పాల్గొన్నారు.

## దుఃఖంలో ఉన్న పోలీస్ కుటుంబానికి అండగా బ్యాంక్ ఆఫ్ బరోడా, తెలంగాణ పోలీస్



**హైదరాబాద్, (నినాదం):** సెంట్రల్ ఆర్మ్‌డ్ రిజర్వ్ (సిఏఆర్), పెట్లబుర్జ్‌లో పనిచేస్తున్న గడ్డం మహేష్ కుమార్ అకాల మరణంతో విషాదంలో కూరుకుపోయిన వారి కుటుంబానికి బ్యాంక్ ఆఫ్ బరోడా, తెలంగాణ పోలీస్ శాఖలు ఫైనాన్షియల్ అసిస్టెన్స్ అందించాయి. తెలంగాణ పోలీస్ శాలరీ ప్యాకేజ్ స్కీమ్ కింద, మహేష్ కుమార్ నామినీ, ఆయన తండ్రి గడ్డం దానయ్యకు ₹15 లక్షల చెక్కును అందజేశారు.బ్యాంక్ ఆఫ్ బరోడా, హైదరాబాద్ మెట్రో రీజియన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆదిత్య కె. కన్నౌజియా, బ్రిగ్. ఎస్.కె. ప్రసాద్ (రిటైర్డ్), డిబిఎ, బ్యాంక్ ఆఫ్ బరోడా, హైదరాబాద్, ఎన్. భాస్కర్, ఎడిజిపి సిఏఆర్ పోలీస్ హెడ్ క్వార్టర్స్, పెట్లబుర్జ్ మరియు ఇతర పోలీస్, బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.మహేష్ కుమార్ నాచురల్ డెత్ తో వారి కుటుంబం తీవ్ర దుఃఖంలో ఉండగా, బ్యాంక్ ఆఫ్ బరోడా, తెలంగాణ పోలీస్ శాఖలు అందించిన ఈ ఫైనాన్షియల్ అసిస్టెన్స్ వారికి ఎంతో ఊరటనిచ్చింది. ఈ సందర్భంగా డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆదిత్య కె. కన్నౌజియా మాట్లాడుతూ, "పోలీస్ సిబ్బంది మరియు వారి కుటుంబాల వెల్ఫేర్ కి బ్యాంక్ ఆఫ్ బరోడా ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది. ఈ సహాయం వారి కుటుంబానికి కొంత ఉపశమనం కలిగిస్తుందని ఆశిస్తున్నాము" అని అన్నారు.ఏడిజిపి ఎన్. భాస్కర్ మాట్లాడుతూ, "తెలంగాణ పోలీస్ సిబ్బందికి బ్యాంక్ ఆఫ్ బరోడా అందిస్తున్న సహకారం అభినందనీయం. ఇలాంటి సపోర్ట్ యాక్షన్స్ పోలీస్ సిబ్బందికి భరోసా నిస్తాయి" అని తెలిపారు.ఈ ఫైనాన్షియల్ అసిస్టెన్స్, పోలీస్ సిబ్బందికి మరియు వారి కుటుంబాలకు అండగా నిలిచేందుకు బ్యాంక్ ఆఫ్ బరోడా మరియు తెలంగాణ పోలీస్ శాఖలు చేస్తున్న కృషికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇలాంటి యాక్షన్స్ పోలీస్ సిబ్బందికి మరింత ధైర్యాన్ని, భరోసాని అందిస్తాయి.

## ఇంటర్ పరీక్ష నిర్వహణకు పటిష్ట భద్రత

- జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే
- జిల్లాలో ఇంటర్ మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద 163 (144 సెక్షన్) అమలు

**భూపాలపల్లి, మార్చి 4 (నినాదం న్యూస్):**



బుధవారం నుండి ఈ నెల 25 వరకు జరగనున్న ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ అన్ని రకాల పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని, పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద 163 బి.ఎన్.ఎస్.ఎస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్స్, ఇంటర్ నెట్ సెంటర్స్, మరియు చుట్టుపక్కల లౌడ్ స్పీకర్లు, మూసి వేయాలని అన్నారు. పరీక్ష సెంటర్స్ సమీపంలో ప్రజలు గుమిగూడ వద్దని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్ నందు పొందుపరిచిన విధంగా సమయానికి చేరుకోవాలని అన్నారు. అభ్యర్థులు తమవెంట పరీక్ష హాల్ లోకి సెల్ ఫోన్లు, ట్యాబ్, పెన్ డ్రైవ్, బ్లూటూత్, ఎలక్ట్రానిక్ వాచ్, కాలిక్యులేటర్లు, వాలెట్లు,వంటివి తీసుకువెళ్లడానికి అనుమతి ఉండదని తెలిపారు. పరీక్షా కేంద్రంలోకి వెళ్ళేముందే ప్రధాన గేట్ వద్ద తనిఖీలు నిర్వహించే పోలీసు వారికి సహకరించాలని ఎస్పీ కిరణ్ ఖరే పేర్కొన్నారు.

## ఇంటర్ పరీక్షలకు భద్రత కట్టుదిట్టం

- పరీక్ష కేంద్రాల వద్ద బిఎన్ఎస్ఎస్163 సెక్షన్ అమలు
- పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలి
- జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ వెల్లడి

**వనపర్తి ప్రతినిధి, మార్చి 4 (నినాదం న్యూస్)**



ఈ నెల 5 నుండి 25 వరకు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో వనపర్తి జిల్లాలో మొత్తం 25 పరీక్ష కేంద్రాలలో పరీక్షలు జరగనున్నట్లు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు.ఈ పరీక్షలు జరుగుతున్న తేదీలలో ఉదయం 09:00 నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు పరీక్ష కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్-2023 (144) సెక్షన్ పి సి చట్టం అమల్లో ఉంటుందని, పరీక్షలు జరిగే సమయంలో సమీపంలో ఆయా పట్టణాలలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలని కోరారు. పరీక్ష సెంటర్ల వద్ద నుండి 500 మీటర్ల వరకు ప్రజలు గుమి గూడ కూడదని తెలిపారు. పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉంటారని, పోలీస్ అధికారులు పరీక్ష సమయంలో పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. పోలీస్ స్టేషన్ల నుండి పరీక్షా పత్రాలు పరీక్ష కేంద్రానికి వెళ్లే సమయంలో కానిస్టేబుల్ తప్పనిసరిగా ఎస్కార్ట్ వుండాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థిని విద్యార్థులు ఉద్రేకం లేకుండా ఉల్లాసంగా పరీక్ష సమయానికి గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని, మానసికంగా ఏటువంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఎస్పీ విద్యార్థులకు సూచించారు.

## మామునూర్ ఎయిర్‌పోర్టు..

# భూ సర్వేలో ఉద్రిక్తత..!

- రెవెన్యూ అధికారులను అడ్డుకున్న రైతులు
- తగిన పరిహారం ఇవ్వాలని నినాదాలు
- గ్రామాలకు ప్రత్యామ్నాయ రోడ్లు నిర్మించాలని డిమాండ్

**వరంగల్ బ్యూరో (నినాదం న్యూస్):**



వరంగల్ జిల్లా మామునూరు ఎయిర్ పోర్టు పరిసర గ్రామాల్లో ఉద్రిక్తత నెలకొంది. ఎయిర్ పోర్టు భూ సర్వేకు వచ్చిన రెవెన్యూ అధికారులను భూ నిర్వాసితులు అడ్డుకున్నారు. నక్కలపల్లి, గుంటూరుపల్లి, నల్లకుంట, గాడిపెల్లిలో భూమి కోల్పోతున్న రైతులు ఆందోళనకు దిగారు. భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పెద్ద ఎత్తున ఎయిర్‌పోర్టు పరిసర ప్రాంతాలకు చేరుకున్న నిర్వాసిత రైతులు జై జవాన్ జై కిసాన్.. అంటూ అని నినాదాలు చేస్తున్నారు. తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని రహదారిపై బైఠాయించి నిరసనకు దిగారు. తమ ఊరికి వచ్చే రోడ్డుకి ప్రత్యామ్నాయ రోడ్డు కావాలని డిమాండ్ చేస్తున్నారు



గుంటూరుపల్లి, గాడిపెల్లి రైతులు. రైతులకు మార్కెట్ ధరకి తగినట్టుగా పరిహారం ఇస్తే భూములు ఇస్తామంటున్నారు. సరైన పరిహారంతో పాటు తమ గ్రామాలకు ప్రత్యామ్నాయ రోడ్డు మార్గాలు చూపిస్తేనే సర్వే అనుమతిస్తామంటున్నారు. అయితే, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీగా మోహరించారు. ధర్నాకు అనుమతి లేదని రైతులతో వాదిస్తున్నారు. వరంగల్ ఎయిర్ పోర్టుకు ఇటీవలే కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఎయిర్పోర్ట్ కోసం దాదాపు వెయ్యి ఎకరాల భూమి అవసరమవుతుంది. ఇప్పటికే ఎయిర్‌పోర్టు పరిధిలో 696 ఎకరాల స్థలం ఉంది. ఆ భూమికి అదనంగా మరో 253 ఎకరాల్లో కొంత రన్‌వే విస్తరణ, టెర్మినల్ బిల్డింగ్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ), నావిగేషన్ ఇన్‌స్ట్రుమెంట్ ఇన్‌స్టాలేషన్ నిర్మాణాలు చేపట్టనున్నారు. భూసేకరణకు అవసరమైన నిధులను కూడా ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రిలీజ్ చేసింది. మార్చిలోనే భూసేకరణను కంప్లీట్ చేయనున్నారు. నాలుగైదు నెలల్లోనే విమానాల రాకపోకలు సాగించేలా ప్లాన్ చేస్తున్నారు.

# పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలి

ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి, మార్చి 4 (నినాదం న్యూస్):**




జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మంగళవారం జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పరీక్షా కేంద్రాలలో ఏర్పాట్లు, పరీక్షా హాళ్ల పరిస్థితులు, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, సీసీ కెమెరా పర్యవేక్షణ, మార్గదర్శకాల అమలును పరిశీలించారు. పరీక్షలు పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాయడానికి అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 3,615మంది విద్యార్థులు పరీక్ష వ్రాయుటకు 8 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభమై మార్చి 25వ తేదీ వరకు జరుగానున్నాయని తెలిపారు. పరీక్షలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తిచేశామన్నారు. జిల్లాలో 34 ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు ఉండగా ప్రథమ సంవత్సరంలో 1,820, ద్వితీయ సంవత్సరంలో 1,795 మంది మొత్తం 3,615 మంది హాజరవుతున్నారని తెలిపారు. 220 మంది ఇన్విజిలేటర్లు, 16 మంది సీఎస్, డీఓలు, మాస్ కాపియింగ్, మాల్ ప్రాక్టీస్ జరగకుండా చూసేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్లను నియమించామని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించామని పేర్కొన్నారు. ప్రత్యేక బస్సులు ఏర్పాటు ద్వారా విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి ఉదయం, మధ్యాహ్న సమయాలలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల సౌకర్యం 8008878060 ఫోన్ నంబర్‌తో కంట్రోల్ రూము ఏర్పాటు చేశా మని, విద్యార్థులకు కావాల్సిన సమాచారం కొరకు ఫోన్ నంబర్ కు కాల్ చేయాలని ఆయన తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఏలాంటి సమస్యలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు సానుకూల దృక్పథంతో ఆలోచిస్తే సత్ఫలితాలు వస్తాయని ఆయన పేర్కొన్నారు. పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులను నిశిత తనిఖీ తదుపరి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారని, సెల్ ఫోన్స్, వాచీలు, కాలిక్యులేటర్లు,ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరని ఆయన తెలిపారు. విద్యార్థులు మంచిగా పరీక్షలు వ్రాయాలని, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆయన ఆకాంక్షిస్తూ విద్యార్థులు వత్తిడికి గురికాకుండా నిర్భయంగా పరీక్షలు వ్రాయాలని బెస్ట్ విషెస్ తెలిపారు. అనంతరం డిగ్రీ, జూనియర్ కళాశాలలో నీట్ పరీక్షా కేంద్రం ఏర్పాటు సౌకర్యాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఇంటర్మీడియట్ అధికారి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# రామప్పకు విదేశీ పర్యాటకుల రాక

ప్రసాద్ స్కీమ్ అభివృద్ధి పనులను పూర్తి చేయాలి – జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.

**ములుగు ప్రతినిధి, (నినాదం):**



యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి రానున్న రోజులలో విదేశీ పర్యటకులు పెద్ద ఎత్తున రానున్నారని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. మంగళవారం వెంకటాపూర్ మండలం పాలంపేటలోని రామప్పలో ప్రసాద్ స్కీమ్ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారులతొ కలసి ఆయన పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రానున్న మే 02న ప్రపంచ సుందరి పోటీలు జరుగుతున్న నేపథ్యంలో పలు దేశాలకు చెందిన మహిళలు పోటీల్లో పాల్గొనేందుకు హైదరాబాద్ కు రానున్న సందర్భంలో జిల్లాలోని పర్యాటక స్థలాలను పర్యటించే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని సంబంధిత శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రసాద్ స్కిం ద్వారా చేపట్టిన పనులను ఏప్రిల్ 20 లోపు పూర్తి చేయాలని, రామప్ప పరిసర ప్రాంతాన్ని సుందరికరించి గ్రీనరీ పెంచాలని అధికారులకు సూచించారు. కాకతీయ కట్టడాలను ప్రపంచవ్యాప్తంగా తెలియజేయడానికి విదేశీ పర్యటకులకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలో మొదటిసారిగా ప్రపంచ సుందరి పోటీలు నిర్వహిస్తున్న సందర్భంగా ఆయా దేశాల సుందరిమణులను పర్యాటక ప్రాంతాలకు తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన వివరించారు. ప్రపంచ దేశాల పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, డిపిఓ దేవ్ రాజ్, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ డాక్టర్ కుసుమ సూర్య కిరణ్, పర్యాటక అభివృద్ధి సంస్థ డి ధనరాజ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ్ కుమార్, ఎంపీడీవో రాజు, తహసిల్దార్ గిరిబాబు, ఎంపీఓ, విష్ణువర్ధన్ సైట్ ఇంచార్జ్, తదితరులు పాల్గొన్నారు.

## ట్రేడ్ లైసెన్స్‌ను పునరుద్ధరించుకొని పట్టణ అభివృద్ధికి సహకరించాలి

### మున్సిపల్ కమిషనర్ ఎన్ మనోహర్

**మంథని టౌన్ మార్చి 04 (నినాదం న్యూస్) :**



మంథని పట్టణంలోని వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్సులను ఈ ఏడాదికి పునరుద్ధరించుకుని పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎన్ .మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రేడ్ లైసెన్స్ గడువు ముగిసిన వ్యాపా రస్తులందరూ మార్చి 31 లోగా తమ లైసెన్సులను రెన్యువల్ చేయించు కోవాలన్నారు. లేనియెడల మొదటి మూడు నెలలు ఏప్రిల్ ఒకటి నుండి జూన్ 30 వరకు 25 శాతం అపరాధము విధించ బడుతుందని జూలై 30 నుండి ప్రతి సంవత్సరం 50 శాతం అపరాధ రుసుము విధించబడునని ఆయన తెలిపారు.అలాగే ఇప్పటివరకు ట్రేడ్ లైసెన్స్ లేని వారు కూడా ట్రేడ్ లైన్స్ కోసం దరఖాస్తుచేసుకోవాలని ఆయన సూచించారు.


Altum® Credo Home Finance

**అల్టం క్రెడో హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్**

రిజిస్టర్డ్ కార్యాలయము: ఫ్లోర్ నెం. 7, కల్పతరు ఇన్ఫినియా, వాక్డేవాడి, శివాజినగర్, పూణె-411005, మహారాష్ట్ర (ఇండియా)

**డిమాండ్ నోటీస్**

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3(1)తో చదవబడు సెక్షన్ 13(2) క్రింద నోటీసు. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సదరు చట్టము) క్రింద **అల్టం క్రెడో హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ACHFL)** తరఫున ఈ క్రింది సంతకముదారు అధీకృత అధికారిగా ఉన్నారు. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3(1)తో చదవబడు సదరు చట్టములోని సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ, చట్టములోని సెక్షన్ 13(2) క్రింద అధీకృత అధికారి రుణగ్రహీత(లు) ("సదరు రుణగ్రహీత(లు)")లకు డిమాండ్ నోటీసు జారీ చేసి సంబంధిత డిమాండ్ నోటీసులో తెలిపిన బకాయి మొత్తములను తిరిగి చెల్లించమని కోరుతూ క్రింద తెలిపినట్లు జారీ చేసినారు. ఇందుకు సంబంధించి ఈ నోటీసు ద్వారా మరొకసారి తెలియజేయడమేమనగా సదరు రుణగ్రహీత(లు)ల ద్వారా అమలు పరచిన ఇతర డాక్యుమెంట్లు/వ్రాత పూర్వకములు, ఏవైన ఉంటే రుణ ఒప్పందము క్రింద నేటి వరకు చెల్లింపు మరియు/లేదా రుణం తీరే వరకు క్రింద తెలిపిన తేది(లు)ల నుండి డిమాండ్ నోటీసు(లు)లలో వివరముగా తెలిపినట్లు బకాయి మొత్తములను తదుపరి వడ్డీతో ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోగా **అల్టం క్రెడో హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ACHFL)**కు తిరిగి చెల్లించవలసిందిగా మరొకసారి కోరడమైనది. సదరు రుణగ్రహీత(లు)ల ద్వారా **అల్టం క్రెడో హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్**కు క్రింద తెలిపిన ఆస్తులను తనఖా పెట్టుట ద్వారా రుణ మొత్తం తిరిగి చెల్లించుటకుగాను సెక్యూరిటీగా పెట్టినారు.

**రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు) మరియు హామీదారు(ల)ల పేరు. రుణ ఖాతా నంబర్**

1. జనగం శివ కుమార్ (దరఖాస్తుదారు) / 2. జనగం ఈశ్వరమ్మ (సహ-దరఖాస్తుదారు)/ **LAN No. S158208000001**

**డిమాండ్ నోటీసు తేది మరియు ఎన్‌పిఎ తేదీతో మొత్తం**

**08 ఫిబ్రవరి, 2025/ రూ. 11,10,372.91** (రూపాయలు పదకొండు లక్షల పది వేల మూడు వందల డెబ్బై రెండు మరియు పైసలు తొంభై ఒకటి మాత్రమే) **ఎన్‌పిఎ తేది: 29.01.2025**

**సెక్యూర్డ్ ఆస్తుల వివరణ (స్థిరాస్తి)**

రిజిస్ట్రేషన్ జిల్లా నల్గొండ మరియు రిజిస్ట్రేషన్ ఉప జిల్లా చౌటుప్పల్ క్రింద యాదాద్రి భువనగిరి జిల్లా పరిషత్, చౌటుప్పల్ మండలం పరిషత్, పీపల్‌పహాడ్ గ్రామ పంచాయతీ క్రింద యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం, పీపల్‌పహాడ్ గ్రామం వద్ద 319.00 చ.గ.లు లేదా తత్సమానమైన 266.68 చ.మీ.ల విస్తీర్ణము గల భూమిలో 396.00 చ.అ.ల కట్టుబడి ప్రదేశముతో ఆర్‌సిసి రూఫ్‌తో కవర్‌చేయబడి మొత్తం ఏరియాలో (కట్టుబడి ప్రదేశము మరియు ఖాళీ ప్రదేశముతో కలుపుకొని) గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆర్‌సిసి రూఫ్‌తో పాటు బ్రిక్ వాల్స్‌తో నిర్మించి అసెస్‌మెంట్ నెం. 91, ఓపెన్ హౌస్ నెం. 1-81తో గల గృహము యావదాస్తి. **సరిహద్దులు: తూర్పు:** మాచర్ల మల్లయ్య గృహము, **పడమర:** 12' వెడల్పు రోడ్డు, **దక్షిణం:** ఎల్లమ్మ గుడి, **ఉత్తరం:** జనగం లచ్చయ్య గృహము.

**రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు) మరియు హామీదారు(ల)ల పేరు. రుణ ఖాతా నంబర్**

1. లకావతు హనుమ (దరఖాస్తుదారు) / 2. పద్మ లకావతు (సహ-దరఖాస్తుదారు)/ **LAN No. S169202000020**

**డిమాండ్ నోటీసు తేది మరియు ఎన్‌పిఎ తేదీతో మొత్తం**

**08 ఫిబ్రవరి, 2025/ రూ. 8,24,712.89** (రూపాయలు ఎనిమిది లక్షల ఇరవై నాలుగు వేల ఏడు వందల పన్నెండు మరియు పైసలు ఎనభై తొమ్మిది మాత్రమే) **ఎన్‌పిఎ తేది: 29.01.2025**

**సెక్యూర్డ్ ఆస్తుల వివరణ (స్థిరాస్తి)**

తమ్మారం రెవెన్యూ గ్రామం, సూర్యాపేట జిల్లా, చింతలపాలెం మండలం, పీక్లానాయక్ తండా గ్రామ పంచాయతీ వద్ద విద్యుత్ ఫిట్టింగులు, విద్యుత్ సర్వీస్ కనెక్షన్‌తో పాటు (టాయిలెట్లతో కలుపుకొని) సర్వే నెం.లు 64, 65, 66లలో మొత్తం ఇంటి సైట్ 242 చ.గ.లు లేదా 203.28 చ.మీ.ల విస్తీర్ణము గల ప్లాట్ నెం. 444, బ్లాక్ నెం. 02లో 1056 చ.అ.ల ప్లింత్ ఏరియాతో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆర్‌సిసి రూఫ్ కలిగి (అసెస్‌మెంట్ నెం. 176) ఇ.నెం. 2-41తో గల గృహము యావదాస్తి. **సరిహద్దులు: తూర్పు:** ప్లాట్ నెం. 453లోని భూక్య బాబు గృహము, **పడమర:** 30' గ్రామ పంచాయతీ సిసి రోడ్డు, **దక్షిణం:** ప్లాట్ నెం. 445లోని లకావత్ కమల ప్రదేశము, **ఉత్తరం:** 30' గ్రామ పంచాయతీ సిసి రోడ్డు.

ప్రదేశము: తెలంగాణ — సం/- అధీకృత అధికారి

తేది: 05.03.2025 — అల్టం క్రెడో హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ACHFL)



Protium

**ప్రోటియం ఫైనాన్స్ లిమిటెడ్**

(పూర్వపు గ్రోత్ సోర్స్ ఫైనాన్షియల్ టెక్నాలజీస్ లిమిటెడ్)

నిర్లాన్ నాలెడ్జ్ పార్క్ (ఎన్‌కెపి), బి-2, ఏడవ అంతస్తు, పహాడి గ్రామం,

Off: ది వెస్టర్న్ ఎక్స్‌ప్రెస్ హైవే, కామా ఇండస్ట్రియల్ ఎస్టేట్, గోరెగావ్ (ఈ), ముంబయి, మహారాష్ట్ర-400063.

**బహిరంగ ప్రకటన**

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3(1) క్రింద)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) క్రింద ప్రత్యామ్నాయ సేవల నోటీసు

ఈ నోటీసు ద్వారా క్రింద తెలిపిన రుణగ్రహీతలకు తెలియజేయడమేమనగా ప్రోటియం ఫైనాన్స్ లిమిటెడ్ (పూర్వపు గ్రోత్ సోర్స్ ఫైనాన్షియల్ టెక్నాలజీస్ లిమిటెడ్ మరియు అంతకుముందు గ్రోత్ సోర్స్ ఫైనాన్షియల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్) నుండి వారు పొందిన రుణ సదుపాయములపై బకాయిలు చెల్లించుటలో విఫలమైనందున వారి రుణ ఖాతాలను ఆర్‌బిఐ సూచనల మేరకు ఎన్‌బిఎఫ్‌సి పుస్తకములలో నిరర్థక ఆస్తులుగా వర్గీకరించబడినది. అనంతరం సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002(SARFAESI యాక్ట్) లోని సెక్షన్ 13(2) క్రింద తెలిపిన సంబంధిత రుణగ్రహీతలకు ఆఖరిగా తెలిసిన చిరునామాలకు రుణగ్రహీతల పేరున డిమాండ్ నోటీస్ జారీచేసి క్రింద తెలిపిన వివరముల ప్రకారం సంబంధిత నోటీస్/లు ల తేదీ నుండి 60 రోజులలోగా సంబంధిత డిమాండ్ నోటీస్/లు లలో తెలిపిన బకాయి మొత్తములను, ఒప్పంద రేటు ప్రకారం క్రింద తెలిపిన మొత్తముపై అనుషంగీక ఖర్చులు, ధరలు, చార్జీలు మొ॥గు వాటితో తిరిగి చెల్లించమని డిమాండ్ నోటీస్ జారీ చేసినారు అయినప్పటికీ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 (SARFAESI రూల్స్) లోని రూల్ 3 ప్రకారం ఈ ప్రచురణ ద్వారా ప్రత్యామ్నాయ సేవలను బ్యాంక్ వారు వినియోగించుకున్నారు.

| రుణ ఖాతా నెం. రుణగ్రహీత మరియు సహ-రుణగ్రహీత/ల పేరు మరియు చిరునామా | ఎన్‌పిఎ తేది | డిమాండ్ నోటీస్ తేది | దిగువ తేదీ నాటికి పూర్తి బకాయి మొత్తం (ఐఎన్ఆర్) |
|---|---|---|---|
| రుణ ఖాతా నెం. **GS019EEL712833,** 1. (రుణగ్రహీత), (ఎ) హనుమాన్ డైరీ ఫామ్ దాని యజమాని మామిళ్ల సత్యనారాయణ తండ్రి. మామిళ్ల సాయిలు (సహ-రుణగ్రహీత) 2. (బి) మామిళ్ల సత్యనారాయణ తండ్రి. మామిళ్ల సాయిలు, (సి) మామిళ్ల అంజమ్మ భర్త. మామిళ్ల సత్యనారాయణ, (డి) మామిళ్ల జనార్ధన్ తండ్రి. శ్రీ.మామిళ్ల సత్యనారాయణ. 2. చిరునామాలు క్రింద - ప్లాట్ నెం. 34, గౌరీనందపురం, కాప్రా, మేడ్చల్-మల్కాజ్‌గిరి, హైదరాబాద్ 500062. ఇం.నెం. 1 2 28 ఎల్లారెడ్డిగూడ, కీసర మండలం, కాప్రా, సికింద్రాబాద్, కుషాయిగూడ, హైదరాబాద్ 500062. | 31.01. 2025 | 17 ఫిబ్రవరి, 2025 | తేది: 10 ఫిబ్రవరి, 2025 నాటికి రూ.21,05,049.98/- (రూపాయలు ఇరవై ఒక్క లక్షల ఐదు వేల నలభై తొమ్మిది మరియు పైసలు తొంభై ఎనిమిది మాత్రమే) |
| **సెక్యూర్డ్ ఆస్తుల/తనఖా ఆస్తుల వివరణ :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, కాప్రా మండలం, కాప్రా సర్కిల్, జిహెచ్ఎంసి క్రింద, ఫేజ్-2, గౌరీనందపురం వద్ద సర్వే నెం.57/1లో 200 చ.గ.లు లేదా 167.2 చ.మీ.ల విస్తీర్ణం గల ప్లాట్ నెం.34 యావదాస్తి. (వార్డు నెం.01 & బ్లాక్ నెం.02) **సరిహద్దులు: ఉత్తరం:** ప్లాట్ నెం.35, **దక్షిణం:** ప్లాట్ నెం.33, **తూర్పు:** యజమానికి చెందిన భూమి, **పడమర:** 20' వెడల్పు రోడ్డు (శ్రీ మామిళ్ల సత్యనారాయ) | | | |

పైన తెలిపిన రుణగ్రహీతలు ఈ నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా జారీ చేసిన సంబంధిత డిమాండ్ నోటీస్‌లో మరింత స్పష్టముగా తెలిపినట్లు రావాల్సిన బకాయి మొత్తం, తదుపరి వడ్డీ + ధరలు, చార్జీలు, వ్యయములు మొ॥గు వాటితో చెల్లించమని కోరుతూ, విఫలమైనచో సదరు చట్టము మరియు వర్తించు రూల్స్‌లోని సెక్షన్ 13(4) క్రింద పైన తెలిపిన సెక్యూర్డ్ ఆస్తి(లు)/స్థిరాస్తి (లు)లను పరిమితి లేకుండా స్వాధీనం చేసుకొని స్వేచ్ఛ కలిగియుండి మరియు మీ సొంత బాధ్యత మరియు పర్యావసనములతో, రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు)/ చట్టబద్ధ వారసుడు(లు)/ చట్టబద్ధ ప్రతినిధి(లు)ల బాధ్యతపై సెక్యూర్డ్ ఆస్తులను అమ్ముటకు హక్కు కలిగివున్నారు.

SARFAESI యాక్ట్ లోని సెక్షన్ 13(13) ప్రకారం బ్యాంక్‌వారి ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా పైన తెలిపిన సెక్యూర్డ్ ఆస్తులను అమ్ముట, లీజు లేదా ఇతర విధములైన బదిలీలు చేయుటకు మిమ్ములను నిషేదించినారని గమనించగలరు. ఇందుకు సంబంధించి ఏవైనా ఇతర చట్టబద్ధ నిబంధనలను మరియు/లేదా SARFAESI యాక్ట్‌లోని సెక్షన్ 29 క్రింద ఎవరైనా ఉల్లంఘించినచో సదరు చట్టంలోని అపరాధ నిబంధనలపై శిక్షార్హులు.

సదరు చట్టంలోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ (8) ప్రకారం అమ్మకపు తేదీ కంటే ముందుగా ఏ సమయంలోనైనా ప్రొటియం ఫైనాన్స్ లిమిటెడ్ (పూర్వపు గ్రోత్ సోర్స్ ఫైనాన్షియల్ టెక్నాలజీస్ లిమిటెడ్) దిన బకాయిలు, చార్జీలు, ధరలు మరియు వ్యయములతో ప్రొటియం ఫైనాన్స్ లిమిటెడ్ (పూర్వపు గ్రోత్ సోర్స్ ఫైనాన్షియల్ టెక్నాలజీస్ లిమిటెడ్) వారికి చెల్లించినచో మీ సెక్యూర్డ్ ఆస్తులను ప్రొటియం ఫైనాన్స్ లిమిటెడ్ (పూర్వపు గ్రోత్ సోర్స్ ఫైనాన్షియల్ టెక్నాలజీస్ లిమిటెడ్) ద్వారా అమ్ముట లేదా బదిలీ చేయుట నిలిపివేసి మరియు సెక్యూర్డ్ ఆస్తుల అమ్మకము లేదా బదలీ కొరకు ప్రొటియం ఫైనాన్స్ లిమిటెడ్ ద్వారా తదుపరి చర్యలను నిలిపివేయబడును.

ప్రదేశం: హైదరాబాద్, తెలంగాణ, తేది: 05.03.2025, — సం/- అధీకృత అధికారి, ప్రోటియం ఫైనాన్స్ లిమిటెడ్



**IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE-cum-CHIEF JUDICIAL MAGISTRATE, RANGA REDDY DISTRICT, AT: L.B.NAGAR**

O.S.NO.155 OF 2025

**BETWEEN:**

VASANTHAVADA PRABHAVATHI And another … PLAINTIFFS

**AND**

JONNALAGADDA SIVA VARA PRASAD And another … DEFENDANTS

D-2 ALL CONCERNED

The Plaintiffs had filed the above suit for Declaration to declare the Plaintiffs as Legal Heirs of Late Vasanthavada Ramjee in respect of Suit Schedule-A Property i.e., Open Plot No.179, admeasuring 403 sq.yds or 336.94 sq.mts in Sy.Nos.840 & 843, situated at Koheda Village and Grampanchayath, Hayathnagar Mandal, Ranga Reddy District and bounded on North: Plot No.178, South: 33 Feet Wide Road, East: 33 Feet Wide Road, West: Part of Plot No.177, Suit Schedule-B Property i.e., Flat No.503, Plot Nos.76 & 77, admeasuring 1030 sft along with undivided share of land admeasuring 25 sqyds out of 533.32 sq.yds, in Sy.No.308, situated at Sravanth Residency, Bachupally Village and Grampanchyath, Qutubullahpur Mandal, Ranga Reddy District and bounded on (Entire Land Boundaries) North: Plot No.78, South: Plot No.75, East: Plot Nos.85 & 84, West: 40 Feet Wide Road (Boundaries of Flat) North: Open to Sky, South: Open to Sky & Flat No.504, East: Open to Sky and West: Corridor. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above suit and the matter is posted to 01.04.2025 at 10.30 a.m. Therefore, you may appear before the Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law.

**(BY ORDER OF THE COURT)**

K.AMARNATH REDDY,
Advocate,
Flat No.502, Uma Nivas,
Plot Nos.1 & 2, Indraprastha Colony,
Rock Town, L.B.Nagar,Hyderabad.



**IN THE COURT OF THE HON'BLE V ADDL.DISTRICT JUDGE, R.R.DISTRICT AT: L.B.NAGAR**

I.A.No. 616 OF 2022
IN
O.S.No. 249 OF 2018

Between:
Lenkala Venkat Reddy ...Petitioner/Plaintiff

**AND**

K.Ravi Kumar & 2 others ...Respondents/Defendants

To

1. Smt. Ranga Swetha W/o Ranga Venugopal Goud, Aged about 29 years, Occ: Business, R/o H.No.11-13-152/PH, Sowkariya Nivas, Road No.3, Beside Sai Baba Temple, Alkapuri, Chintalkunta, Ranga Reddy District-500074.

2. Bank of India,
A body Corporate constituted under the banking companies (acquisition and transfer of undertaking) Act 1970 and Having its head office at Mumbai and branch designated as Hyderabad Main Branch at Nampally Station Road, Hyderabad. ...Proposed Respondents/ Defendants No.4 & 5

Please take Notice that, the Petitioner/Plaintiff have filed the above suit seeking recovery of amount, in which also filed I.A. No.616/2022 amendment of plaint and to implead you as Defendants No.4 & 5 in the above suit, the said case is posted on 13-03-2025 for your appearance at 10.30 a.m. on the above said court, as such please make it convenient to attend on the said date i.e., 13-03-2025 either in person or through an Advocate, failing which, the matter will be decided Ex-parte.

**// BY ORDER OF THE COURT //**

(D. VENKAT REDDY)
Advocate.
H.No.11-8-157/A, Road No.9, Kranthi Nagar, Kothapet, Hyderabad
Cell: 99480 97075.



**IN THE COURT OF THE HON'BLE V ADDL.DISTRICT JUDGE, R.R.DISTRICT AT: L.B.NAGAR**

I.A.No. 617 OF 2022
IN
O.S.No. 249 OF 2018

Between:
Lenkala Venkat Reddy ...Petitioner/Plaintiff

**AND**

K.Ravi Kumar & 2 others ...Respondents/Defendants

To

1. Smt. Ranga Swetha W/o Ranga Venugopal Goud, Aged about 29 years, Occ: Business, R/o H.No.11-13-152/PH, Sowkariya Nivas, Road No.3, Beside Sai Baba Temple, Alkapuri, Chintalkunta, Ranga Reddy District-500074.

2. Bank of India,
A body Corporate constituted under the banking companies (acquisition and transfer of undertaking) Act 1970 and Having its head office at Mumbai and branch designated as Hyderabad Main Branch at Nampally Station Road, Hyderabad. ...Proposed Respondents/ Defendants No.4 & 5

Please take Notice that, the Petitioner/Plaintiff have filed the above suit seeking recovery of amount, in which also filed I.A. No.617/2022 amendment of plaint and to implead you as Defendants No.4 & 5 in the above suit, the said case is posted on 13-03-2025 for your appearance at 10.30 a.m. on the above said court, as such please make it convenient to attend on the said date i.e., 13-03-2025 either in person or through an Advocate, failing which, the matter will be decided Ex-parte.

**// BY ORDER OF THE COURT //**

(D. VENKAT REDDY)
Advocate.
H.No.11-8-157/A, Road No.9, Kranthi Nagar, Kothapet, Hyderabad
Cell: 99480 97075.


## కాంగ్రెస్ పై వ్యతిరేకత మొదలైంది : సోమారపు లావణ్య అరుణ్

**గోదావరిఖని మార్చి 05 (నినాదం న్యూస్)**



ఉమ్మడి ఆదిలాబాద్, నిజాంబాద్, కరీంనగర్, మెదక్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎలక్షన్ లో బీజేపీ మల్క కోమురయ్య ఘనవిజయం సాధించిన సందర్భంగా గోదావరిఖని లోని ప్రైవేట్ స్కూల్ స్పెక్ట్రమ్ స్కూల్ లో టీచర్స్ సంక్షమలో రామగుండం బీజేపీ పక్షాన సంబరాలు , కృతుజ్ఞత అభివందనాలు తెలియచేడం జరిగింది, మహిళా మోర్చా నాయకురాలు సోమారపు లావణ్య అరుణ్ మాట్లాడుతూ, మల్కా కొమరయ్య గెలుపు,తెలంగాణా ప్రజలు, విద్యావంతులు,ఉపాధ్యాయులు లో చైతన్యం వచ్చింది అని, కాంగ్రెస్ వెతిరేకత మొదలైంది అని, ప్రజలు బీజేపీ పక్షాన నిలబడి ఉన్నారని, బీజేపీ పై నమ్మకంతో, మల్కా కొమ్మరయ్య కి ఓటు వేసి గెలిపించారన్నారు. అదే విధంగా ఎమ్మెల్సీ బీజేపీ విజయం రేపు రాబోయే ఎన్నికల్లో లో బీజేపీ కి అవకాశం ఉంటుందని సంకేతంగా పేర్కొన్నారు, ప్రజల పక్షాన నిలబడి ప్రజల కోసం కాంగ్రెస్ వైఫల్యాలను నిలదీస్తామని పోరాడుతామని తెలిపారు. టీచర్ ఓటర్ మహాశయులకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యాక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబెర్ సుల్వా లక్ష్మినర్సయ్య ,తిలకనగర్ మండల్ అధ్యక్షులు నవీన్ గౌడ్, సీనియర్ నాయకులు మహావాది రామన్న, మాజీ మండల్ అదేక్ష్యులు దాసరి శ్రీనివాస్, చుక్కలు రాములు, మేకల శివ ,రవి, గోగుల రవీంద్రరెడ్డి, రాజు, పద్మ పాల్గొన్నారు.




# విస్తరణ దిశగా బిజెపి అడుగులు !

మొన్నటి ఢిల్లీ ఎన్నికల్లో ఘనవిజయం తరవాత బిజెపి ఏ మాత్రం తగ్గడంలేదు. ఢిల్లీ గెలుపును ఆకాశమంత చేసి ప్రచారం చేసుకున్నారు. ఢిల్లీ ఎన్నికలకు ముందే జరిగిన వరుస ఎన్నికల ఫలితాలు బిజెపికి అనుకూలంగా రావడంతో ఇక బిజెపి మరింత దూకుడు ప్రదర్శించే అవకాశం ఉంది. జమిలి ఎన్నికలు జరుగుతాయన్న ప్రచారం జరుగుతున్న వేళ బీజేపీ సత్తా చాటి తనకు తిరుగులేదన్న సంకేతాలు ఇచ్చింది. బీహార్‌లోనూ సొంతంగా పాగా వేసేలా ప్రయత్నాలు మొదలు పెట్టారు. బెంగాల్లో మరోమారు తమవంతుగా ప్రయత్నాలు చేపట్టారు.ఈ రెండు రాష్ట్రాల ఎన్నికలు బిజెపికి అత్యంత ముఖ్యం. ఓ రకంగా చెప్పాలంటే బిజెపి ఎత్తుల ముందు కాంగ్రెస్ పెద్దగా ప్రభావం చూపలేక పోతోంది. అంబేడ్కర్, రాజ్యాంగం పేరుతో కాంగ్రెస్ ఎంత రచ్చ చేసినా ప్రజలు పెద్దగా పట్టించుకోరు. అలాగే బిజెపి ఎత్తులన్నీ కాంగ్రెస్‌ను పెద్ద దెబ్బకొట్టేలా ఉంటాయి. ఇవేవీ పెద్దగా ప్రభావం చూపవని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే లాంటి వారు కొట్టి పారేసినా.. ప్రజల్లో నాటుకున్న భావనలను మాత్రం తోసిపుచ్చలేం. బీజేపీ కూటమి వరుస విజయాలు బిజెపిని తిన్నగా కూర్చోనివ్వడం లేదు. అందుకే దక్షిణాదిలో పాగా వేసేందుకు పావులు కదుపుతోంది. తమిళనాడు, కేరళలో త్వరలో ఎన్నికలు రానున్నాయి. అన్నీ అనుకున్నట్టు జరిగితే బీజేపీతో చేతులు కలిపేందుకు ఆయా రాష్ట్రాల్లో చిన్నాచితక పార్టీలు క్యూ కడుతున్నాయి.ఢిల్లీ విజయం బీజేపీకి జాతీయ స్థాయిలో మరింత బలాన్ని ఇచ్చింది. అలాగే రేపు జరగగబోయే వివిధ రాష్ట్రాల ఎన్నికలకు కూడా బూస్ట్ కానుంది. తెలంగాణ లాంటి రాష్ట్రాల్లో మున్ముందు మేలు చేస్తుందనే భావన ఉంది. ఈశాన్య రాష్ట్రాలు దేశ రాజకీయాలను ప్రభావితం చేయలేకపోయినా.. దేశంలో అంతటా బిజెపికి బలం ఉందని చెప్పుకోవడానికి పనికి వస్తుంది. చిన్న రాష్ట్రాలనైనా గుప్పిట పెట్టుకోవాల్సిందే అన్నది బిజెపి రాజకీయం. దేశ రాజకీయాలు ప్రధానంగా ఉత్తర భారతదేశం చుట్టూనే తిరుగుతూ ఉంటాయి. కాబట్టే ఇటు ఈశాన్య రాష్ట్రాలను జాతీయ పార్టీలు పెద్దగా పట్టించుకోలేదు. అక్కడ లోక్‌సభ స్థానాలు కూడా చాలా తక్కువ కావడం అందుకు మరో కారణం. కానీ బిజెపి వచ్చాక ఈ చిన్న రాష్ట్రాల్లో కూడా పాగా వేయాలన్న లక్ష్యంతో పనిచేసింది. ఈ క్రమంలోనే తెలంగాణలో కూడా పాగా వేయాలన్న పట్టుదలతో ఉంది. అందుకే తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించింది. ఎపిలోనూ పాగా వేయకున్నా బలపడాలన్న పట్టుదలతో ఉంది. అందుకే టిడిపితో కలిసి అధికారం పంచుకుంది. పవన్ కళ్యాణ్ ఇప్పుడు దక్షిణాదిలో బిజెపికి తురుపు ముక్క కానున్నారు. ఆయన సనాతన ధర్మం పేరుతో చేస్తున్న యాత్రలకు మంచి స్పందన వచ్చింది. ప్రస్తుత సమీకరణాలను మాత్రం బిజెపి బాగా అధ్యయనం చేయడం ద్వారా రానున్న ఎన్నికల నాటికి బలోపేతం కావాలన్న లక్ష్యంతో పనిచేస్తోంది. వీటన్నింటిపై అమిత్ షా బీజేపీ రాష్ట్ర స్థాయిలో ఉన్న అగ్రనాయకత్వాలతో ఎప్పటికప్పుడు చర్చిస్తున్నారు. ఇలా ప్రతి అంశంపై చర్చించిన బీజేపీ పెద్దలు మార్గనిర్దేశనం చేయబోతున్నట్లు సమాచారం. అమిత్ షా రాష్ట్ర రాజకీయాల్లో తరచూ జోక్యం చేసుకుని ఎలా ముందుకు వెళ్లాలో సూచిస్తున్నారు. విచిత్రమేమంటే ఏడు దశాబ్దాల పాలనలో కాంగ్రెస్ అనుసరించిన సంస్కృతిని ప్రధానమంత్రి నరేంద్రమోద, అమిత్ షాలు అమలు చేస్తున్నారు. దర్యాప్తు సంస్థలను గుప్పిట్లో పెట్టుకోవడం, పార్టీల్లో సీనియర్లను పక్కన పెట్టడం, ముఖ్యమంత్రులను మార్చడం తదితర నిర్ణయాలన్నీ గతంలో కాంగ్రెస్ చేసి చూపింది. బిజెపి రాజకీయాల తీరు కాంగ్రెస్ సంస్కృతికి ఏ మాత్రం భిన్నంగా లేవనడానికి అనేక నిర్ణయాలు ఉదాహరణగా నిలుస్తాయి. ఈ మొత్తం వ్యవహారంలో అధికారమే లక్ష్యంగా మోడీ ద్వయం అడుగులు వేస్తోంది. మన్మోహన్ సింగ్‌ను కీలుబొమ్మ ప్రధానమంత్రిగా అభివర్ణించిన వారే మోడీ హయాంలో ఇప్పుడంతా కీలుబొమ్మలుగా మారారు. మోదీ హయాంలో బిజెపి కూడా కాంగ్రెస్ మాదిరే అధిష్ఠానవర్గాన్ని అత్యంత బలోపేతంగా మార్చి ప్రజలు, వారు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధుల అభిప్రాయానికి విలువలేకుండా నిర్ణయాలు తీసుకుంటున్నది. మోదీ హవా కూడా ఆయన ఆకర్షణ ఓట్లు తేగలిగినంత కాలమే సాగుతుంది. స్థానికంగా బలహీనులైన, కీలుబొమ్మలైన నేతలను ప్రోత్సహిస్తే కేంద్రం బలహీనపడ్డప్పుడు తదనుగుణంగా రాష్ట్రాల స్థాయిలో కూడా బిజెపి కుప్పకూలిపోతుంది. అయితే ఇకముందు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారన్న దానిపైనే భవిష్యత్ రాజకీయం ఆధారపడి ఉంటుంది. ఇప్పుడు బిజెపి అధ్యక్షపదవికి ఎన్నిక జరగాల్సి ఉంది. బలమైన నేతకోసం గాలిస్తున్నారు. పార్టీని వ్యూహాత్మకంగా ముందుకు తీసుకుని వెళ్లగలిగే నేతకావాలి. దక్షిణాదికి చెందిన నేతల్లో ఒకరిని కూడా పరిశీంచే అవకాశం ఉంది. నిజానికి వెంకయ్యనాయుడు లాంటివారు పార్టీలో ఉండివుంటే అధ్యక్షపదవికి అవకాశం ఉండేది. దక్షిణాదిలో అలాంటి నేతలు లేరనే చెప్పాలి. తెలంగాణలో కూడా సమర్థుడైన, బలమైననేతను పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకోవాల్సి ఉంది. నిజానికి బిజెపి ఇప్పుడు మైనార్టీలో ఉంది. ముందుగా మెజార్టీ సాధించే ప్రయత్నాలు చేయడానికి మోడీద్వయం ఆలోచనచేస్తూ ఉంటుంది. ఎన్‌డిఏగా ఉన్నప్పటికీ సొంత బలం కోసమే బిజెపి ప్రయత్నాలు చేస్తుంది. అది కూడా ఈ యేడు మొదలు పెట్టినా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు. పార్టీని బలోపేతం చేయడం, అన్ని రాష్ట్రాల్లో అధికారం దక్కించు కోవడమే బిజెపి ముందున్న ప్రధాన లక్ష్యంగా చూడాలి. బీజేపీకి వ్యతిరేకంగా గళం వినిపిస్తున్న పార్టీలు ఒక్క తాటిపైకి రావడానికి కసరత్తు కూడా పెద్దగా జరగడం లేదు. బిజెపిని వ్యతిరేకిస్తున్న పార్టీలన్నీ కూడా అవకాశం కోసం చూస్తున్నాయి. ఇప్పటికే బిఆర్ఎస్, టీఎంసీ,డీఎంకే,ఎన్సీపీ, శివసేన ,ఎస్పీ, ఆర్జేడీ పార్టీలు బీజేపీకి వ్యతిరేకంగా ప్రకటనలు చేస్తున్నాయి. హిందీ వ్యతిరేకతతో తమిళనాడు సీఎం స్టాలిన్ తన స్థానం పదిలం చేసుకునే పనిలో ఉన్నారు. బిజెపిని నిలువరించాలని అనుకుంటున్న శక్తులను కూడగట్టాలని చూస్తున్నా.. ఎవరికి కాలం కలిసి రావడం లేదు. అన్ని ప్రాంతీయ పార్టీలు జట్టుగా బీజేపీపై రాజకీయ పోరాటం కోసం ఎజెండా సిద్ధం చేసే కసరత్తు చేస్తే తప్ప ఫలితం ఉండదు. బిజెపిని వ్యతిరేకిస్తున్న ప్రాంతీయ పార్టీల లెక్కలు వేస్తున్నాయి. ప్రాంతీయ పార్టీల కూటమి ఏర్పాటుపై మరింత వేగం పెంచే అవకాశం కోసం చూస్తున్నాయి. అయితే అది సాధ్యం కాదని ఇప్పటికే తెలిసింది.

# కాంగ్రెస్‌లో కీచురాళ్ల రొద

## పదవుల కోసం పార్టీనే భ్రష్టు పట్టించే నేతలు గట్టిగానే వార్నింగ్ ఇచ్చేలా మీనాక్షి నటరాజన్ చర్యలు

హైదరాబాద్ :

తెలంగాణ కాంగ్రెస్‌లో సన్వయం లోపించిందా ..అంటే ఔననే సమాధానం వస్తోంది. విమర్శలను గట్టిగా తిప్పికొడ్డంలో విఫలం అవుతున్నారు. అలాగే మీనాక్షి నటరాజన్ వచ్చాక వేగంగా పరిణామాలు మారుతున్నాయి. వీటిని ఆధారం చేసుకుని సిఎం రేవంత్ రెడ్డిని మార్చడం ఖాయమని బిజెపినేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సంచలనం కలిగించాయి. ఇవన్నీ ఎలా ఉన్నా కాంగ్రెస్‌లో మాత్రం ఎవరికి వారే యమునా తీరే అన్నచందంగా ఉన్నారు. అయితే మీనాక్ష నటరాజన్ కొంత కటువుగానే ఉంటానని సంకేతాలు ఇచ్చారు. తీన్మార్ మల్లన్న పార్టీ నుంచి సస్పెండ్ చేయడం,కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ నివాసంలో మున్నూరు కాపు నేతల సమావేశంపైనా ఆమె గట్టిగానే మందలించారు. ఈ క్రమంలో ఆమె కటువుగా ఉంటే కనీసం పార్టీలో కట్టుబాట్లు అయినా కఠినంగా ఉంటాయని పలువురు భావిస్తున్నారు. నిజానికి కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ. ఎవరికి వారు తామే గొప్పఅనుకుంటారు. వాడి పీకుడెంత అన్న ధోరణిలో ఉంటారు. ఇలాంటి సందర్భంలో మీనాక్షి రావడంతో కొంత పార్టీలో ఆందోళన, అలజడి మొదలయ్యిందనే చెప్పాలి. గత కొంత కాలంగా అధికార కాంగ్రెస్ పార్టీ కట్టుబాట్లకు ఆ పార్టీ సీనియర్ నాయకులే తూట్లు పొడిచేలా వ్యవహరిస్తున్నారు. అధికారం దక్కడంతో తమకు తిరుగులేదని భావిస్తున్నారు. నిజానికి కెసిఆర్ కుటుంబ పాలన, అహంకారం, బిజెపి నుంచి బండి సంజయ్‌ను మార్చడం ఇత్యాదికారణాల వల్ల కాంగ్రెస్ అధికారంలోకి రాగలిగింది. అంతేకానీ కాంగ్రెస్‌పై ప్రేమతో ప్రజలు ఓట్లు వేయలేదు. దీనిని విస్మరించిన నేతలు ఇక తమకు తిరుగులేదన్నరీతిలో వ్యాఖ్యలుచేస్తున్నారు. గ్రామస్థాయి లో సమస్యలను విస్మరిస్తున్నారు. అందుకే ఇటీవల హద్దుమీరుతున్న ఈ నాయకుల తీరు పట్ల అధిష్ఠానాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. వీరి వైఖరి వల్ల కాంగ్రెస్ పార్టీ ఎ`పుడూ ఇంతేనని ప్రజల్లో బలంగా నాటుకున్న అభిప్రాయం మరింత బలపడిరది. అందుకే పార్టీ గీత దాటుతున్న వారిని కట్టడి చేయడంలో భాగంగానే రాష్ట్ర పార్టీ ఇంచార్జీగా మీనాక్షి నటరాజన్‌ను నియమించినట్టు చెబుతున్నారు. తన తొలి సమావేశంలోనే పార్టీలో క్రమశిక్షణారాహిత్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని మీనాక్షి నటరాజన్ హెచ్చరించడం ఈ వాదనకు బలం చేకూర్చుతోంది. పార్టీ నేతలను కట్టడి చేయడంలో పూర్వ ఇంచార్జీ దీపాదాసు మున్షీ విఫలం అయిందని అధిష్ఠానం భావించడం వల్లనే కొత్త ఇంచార్జీని నియమించినట్టు పార్టీ వర్గాల సమాచారం. అలాగా మీనాక్షి కూడా కటౌట్లకు, పొగడ్తలకు, సన్మానాలకు దూరంగా ఉంటున్నారు. ఇకపోతే అధికారంలోకి రావడంతో కొందను పదవుల కోసం పట్టుబడుతున్నారు.మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టులు ఆశించే కొందరు సీనియర్లు పార్టీ పెద్దలను బ్లాక్‌మెయిల్ చేయడానికి వెనుకాడటం లేదన్న వాదనా ఉంది. వీటికి తోడుగా తాజాగా ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ పదవుల భర్తీ కూడా తోడైందని చెబుతున్నారు. పార్టీలో పదవులను పొందాలనుకునే నాయకులు నయానో భయానో పార్టీ పెద్దలను బెదిరించడానికి కుల రాజకీయాలకు తెర లేపారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మంత్రివర్గం లో ఎలాగైనా స్థానం సంపాదించే వ్యూహంతో మొదట పార్టీ వైఖరితో సంబంధం లేకుండా సీనియర్ నాయకుడు వివేక్ వెంకటస్వామి పెద్ద ఎత్తునా మాలల సభ నిర్వహించారు. నిజానికి ఆయనింటినుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక ఎంపి ఉన్నా..ఇంకా అసంతృప్తిని ప్రకటిస్తున్నారు. ఎస్సీ వర్గీకరణపై పార్టీ వైఖరిని ప్రశ్నించే విధంగా వివేక్ వెంకటస్వామి తన సామాజిక వర్గాన్ని రెచ్చగొట్టేలా సభలుపెట్టి సవాల్ విసిరారు. మంత్రివర్గ విస్తరణలో స్థానం సంపాదించడానికే ఆయన కొంత బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారన్న ఫిర్యాదులు అధిష్ఠానానికి అందాయి. ఈ నేపథ్యంలో ఆయన ఢల్లీకి వెళ్లి పార్టీ పెద్దలకు వివరణ ఇచ్చుకోక తప్పలేదని అంటున్నారు. అలాగే ఇటీవల మాజీ ఎంపి అంజన్‌కుమార్ యాదవ్ కూడా తన సామాజికవర్గం నేతలతో సమావేశం నిర్వహించి పార్టీ ముఖ్యులపై తీవ్ర ఆరోపణలు చేసారు. సికింద్రాబాద్ బరిలో దానం నాగేందర్‌కు కాకుండా తనకు టికెట్ ఇచ్చి ఉంటే గెలిచేవాడనని అంజన్‌కుమార్ యాదవ్ వ్యాఖ్యనించారు. ఎంపి టికెట్ నిర్ణయం అనేది అధిష్ఠానం తీసుకున్న నిర్ణయమే తప్ప అది రాష్ట్ర నాయకుల నిర్ణయమన్న విషయం కాదన్నది అంజన్‌కుమార్ యాదవ్ వంటి సీనియర్ నాయకుడికి తెలియదనుకోవడానికి లేదు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీని దక్కించుకోవడానికే తన సామాజికవర్గం నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి పార్టీ పెద్దలను పరోక్షంగా దారికి తెచ్చుకునే వ్యూహంతోనే అంజన్‌కుమార్ యాదవ్ ఈ సమావేశం ఏర్పాటు చేసి ఉంటారని రాజకీయ పరిశీలకులు కూడా అంచనా వేస్తున్నారు. అయితే ఇప్పటికే ఆయన తనయుడు రాజ్యసభ ఎంపిగా ఉన్నారు. అయినా తనకు కూడాపదవి కావాలన్నది ఆయన కోరిక.అంజన్‌కుమార్ యాదవ్ బాటలోనే మరో సీనియర్ నాయకుడు వి హనుమంతరావు తన సామాజిక వర్గం నేతలతో సమావేశం ఏర్పాటు చేసి పదవులలో తమ సామాజికవర్గం నేతలకు అన్యాయం జరిగిందనే వాదన గట్టిగా వినిపించారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ పదవి కోసమే విహెచ్ ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టు అధిష్టానం పెద్దలు భావిస్తున్నట్టు తెలిసింది. సొంత పార్టీ నేతలతో కాకుండా ప్రతిపక్ష పార్టీలలో ఉన్న తమ సామాజిక వర్గం నేతలను కూడా ఈ సమావేశానికి విహెచ్ ఆహ్వానించడమే కాకుండా మున్నూరు కాపులకు కాంగ్రెస్ హయాంలో అన్యాయం జరుగుతుందనే విమర్శలు చేయించడాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం కోరేలా ఉంది.ఇవన్నీకూడా మీనాక్షి నటరాజన్ అధ్యయనం చేస్తున్నారు. ఇకపోతే మరో సీనియర్ నాయకుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తనకు కేబినేట్ బెర్త్ కల్పించాలి. పరోక్షంగా అధిష్టానానికి హెచ్చరికలు చేశారు. మల్‌రెడ్డి వర్గీయులు ఓ అడుగు ముందుకేసి కాబోయే మంత్రి మల్‌రెడ్డి రంగారెడ్డి అనే ప్లెక్షీలు ఏర్పాటు చేసిన విషయం అధిష్టానం దృష్టికి వెళ్లినట్టు తెలిసింది. మూసీనది ప్రక్షాళనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రా ఏర్పాటు చేయగా, దానిని ప్రతిపక్ష నాయకుల కంటే ముందుగానే 'హైడ్రా..గిడ్రా జానా నహీ' అంటూ ప్రభుత్వ నిర్ణయాన్ని ఎమ్మెల్యే దానం నాగేందర్ తప్పు పట్టారు. తన వ్యాఖ్యలకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నట్టు పలుమార్లు చెబుతున్నా ఆయన నుంచి పార్టీ వివరణ కోరలేక పోయింది. అలాగే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా మందునుంచీ మంత్రిపదవి కావాలని కోరుకుంటు న్నారు. తనకు హోంమంత్రిపదవి ఇస్తే కెసిఆర్‌ను బొక్కలో వేస్తానని ప్రకటించారు. టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్‌గా ఉన్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి. చిన్నారెడ్డి కూడా వివాదంలో ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో ప్రస్తుత వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి పార్టీలో కొందరు నాయకులకు డబ్బులు ఇచ్చి టికెట్ తెచ్చుకున్నారని చిన్నారెడ్డి స్వయంగా ఆరోపించారు. పైగా మహబూబ్‌నగర్ స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి రూ. 90 కోట్లు తీసుకొని పార్టీని మోసం చేసారని కూడా చిన్నారెడ్డి తీవ్ర ఆరోపణలు చేసారు. పార్టీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ పదవిలో ఉన్న నాయకుడే ఈ విధంగా క్రమశిక్షణ తప్పి మాట్లాడటం ఎంత వరకు సమంజసమని పార్టీలో చర్చగా మారింది. ఇలా ఒకరి తర్వాత ఒకరు పార్టీ సీనియర్ నాయకులే ప్రభుత్వానికి, పార్టీకి తలనొప్పిగా మారడాన్ని అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుందని పార్టీ వర్గాల సమాచారం. వీరందరిని దారిలో పెట్టేందుకే మీనాక్షికి పూర్తి అధికారాలు ఇచ్చారని అంటున్నారు.



## భారత్‌లో టెస్లా పరుగులు ఖాయం

### ముంబైలో తొలి షారూమ్ కోసం ఒప్పందం

ముంబై : ముంబైలో తన మొదటి షోరూమ్ కోసం ఒప్పందాన్ని ఖరారు చేయడంతో టెస్లా భారతదేశంలో ప్రారంభించటానికి దగ్గరగా ఉంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతీయ మార్కెట్‌లోకి ప్రవేశించడానికి సిద్ధమవుతున్న ఈ సమయంలో కంపెనీకి ఇది ఒక ముఖ్యమైన అడుగు. ఇటీవలి మీడియా నివేదికల ప్రకారం, టెస్లా ముంబైలోని ప్రధాన బాంద్రా`కుర్లా కాంప్లెక్స్ లో 4,000 చదరపు అడుగుల వాణిజ్య సముదాయాన్ని బుక్ చేసుకుంది. ఈ ప్లాగ్‌షిప్ షోరూమ్ టెస్లా తాజా ఎలక్ట్రిక్ మోడళ్లను ప్రదర్శిస్తుంది. టెస్లా నెలవారీ అద్దెను దాదాపు రూ.35 లక్షలు అంటే చదరపు అడుగుకు రూ.900 గా నిర్ణయించింది. లీజు ఒప్పందం ఐదు సంవత్సరాలు. టెస్లా ఇప్పటికే ఢల్లీలోని ఏరోసిటీ కాంప్లెక్స్‌లో రెండవ షోరూమ్‌ను ప్రారంభించాలని యోచిస్తోంది. టెస్లా భారతదేశంలో తన ఉనికిని విస్తరించాలని యోచిస్తోంది. అలాగే దీని కోసం కంపెనీ ఢల్లీ, ముంబై, పూణెళి వంటి నగరాల్లో అనేక ప్రాంతాలను ఎంచుకోగా, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్, ప్రధాని నరేంద్ర మోడీ మధ్య జరిగిన సమావేశం తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆ కంపెనీ తన మొదటి షోరూమ్‌ను ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో ప్రారంభించాలని యోచిస్తోంది. ఇది ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ప్రాంతాలలో ఒకటి. దీనితో పాటు టెస్లా ఢల్లీలోని ఏరోసిటీలో తన షోరూమ్‌ను కూడా ప్రారంభించాలని యోచిస్తోంది. భారతదేశంలోకి టెస్లా ప్రవేశం ఎలక్ట్రిక్ర వాహన మార్కెట్‌లో పోటీని పెంచడమే కాకుండా భారతదేశ ఆటోమొబైల్ రంగానికి ఒక కొత్త విప్లవంగా కూడా నిరూపించుకోనుంది.టెస్లా మోడల్స్ భారతదేశంలో ప్రీమియం ఆఫర్‌లుగా ఉండనున్నాయి. ధరలు దాదాపు రూ. 21 లక్షల నుండి ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

## "టనెల్స్, బ్రిడ్జెస్, రోప్‌వేల హబ్"గా జమ్ము-కాశ్మీర్

**నేలపై వెలసిన అద్భుత అందాల స్వర్గం నా కాశ్మీరం. భరతమాత శిరస్సుపై హిమాలయ రత్నాలు పొదిగిన కిరీటం మన కాశ్మీరం. సకల అందాల కాశ్మీరంలో ప్రతికూల వాతావరణాలు, ప్రమాదకర కొండలు లోయలు, కొండచరియలు విరిగిపడడం లాంటి ప్రకృతి ప్రకోపాలు నిత్యకృత్యం కావడంతో ప్రజలు నలిగిపోతున్నారు.**

జమ్ము–కాశ్మీర్‌కు నేడు ప్రపంచవ్యాప్త గుర్తింపుతో పాటు స్థానిక ప్రజల జీవనోపాధులకు, పర్యాటకుల కనువిందులకు, త్రివిధ దళాల సురక్షిత ప్రయాణాలకు మార్గం సుగమం అవుతున్నది. సముద్ర మట్టానికి అత్యంత ఎత్తున ప్రతిష్టాత్మకంగా రూ:42,000 కోట్ల బడ్జెట్‌తో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన రోడ్డు మార్గాలతో పాటు రైలు మార్గాల్లో బ్రిడ్జెస్(వంతెనలు), టనెల్స్(సొరంగ మార్గాలు), రోప్‌వేస్(తాడు ఆధార రవాణా మార్గాలు) నిర్మాణాలతో ఆ ప్రాంత రవాణా అత్యంత సురక్షితం, సులభం కానున్నది. ఇప్పటికే 41,141 కిమీ రోడ్ల నిర్మాణంతో (అందులో 1,735 కిమీ జాతీయ రహదారి) పాటు 410 వంతెనలు కూడా పూర్తి చేయడం జరిగింది. ఇప్పటికే జె & కె ప్రాంతంలో 17,839 కిమీల రోడ్డు నిర్మాణాలతో 2,131 గ్రామాలను కలపడం జరిగింది. "పర్వత్‌మాలా పథకం" కింద 18 రోప్‌వే ప్రాజెక్టులను కూడా చేపట్టడం జరిగింది.

**'దేవుడి గడ్డి మైదానం'గా పిలువబడే సోన్‌మార్గ్ వద్ద జెడ్-మొర్ సొరంగం:**

"ఉద్దంపూర్ – కాశ్మీర్ – బలరాముల్లా రైల్ ప్రాజెక్ట్ (యూఎస్‌బిఆర్‌ఎల్)" కింద 272 కిమీ రైలు మార్గం పూర్తి అయిన సందర్భంగా ఆ అత్యద్భుత ఇంజనీరింగ్ మార్వెల్ గూర్చి తెలుసుకొని భారతీయ పౌర సమాజం గర్వపడుతున్నది. "దేవుడి గడ్డి మైదానం(మెడివ్ ఆఫ్ గాడ్)"గా పేరొందిన సోన్‌మార్గ్ వద్ద నిర్మించిన జెడ్–మొర్ సొరంగ మార్గంతో కాశ్మీర్–లేహ్ కార్గిల్‌ల మధ్య రోడ్డు మార్గం సులభం అవుతున్నది. సముద్ర మట్టానికి 8,650 అడుగుల ఎత్తున 12 కిమీ సోన్‌మార్గ్ టనెల్ ప్రాజెక్టు రూ: 2,700 కోట్ల బడ్జెట్‌తో పూర్తి కావడం, ప్రారంభోత్సవం కూడా జరగడం సంతోషదాయకం. ఈ సందర్భంగా దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ నేడు జరుగుతున్న రవాణా వ్యవస్థ అభివృద్ధితో జె అండ్ కె ప్రాంతం "కాశ్మీర్ టనెల్స్, బ్రిడ్జెస్, రోప్‌వేస్ హబ్"గా మారిందని సగర్వంగా ప్రకటించడం కూడా హర్షదాయకం. కాశ్మీర్‌లో రోడ్డు/రైలు రవాణా మార్గాల విస్తరణకు జోజిలా, చెనానీ–నశ్రీ టనెల్, సోన్‌మార్గ్ టనెల్, యూఎస్‌బిఆర్‌ఎల్ ప్రాజెక్టులు చేపట్టడం జరిగింది. భరతమాతకు కిరీటంగా నిలబడిన కాశ్మీర్ నేటి అత్యాధునిక ప్రాజెక్టులు పూర్తి కావడంతో ఆ కిరీటంలో పొదిన తళతళ మెరిసే వజ్రాల వలె భరత మాత అందాన్ని మరింత ఇనుమడింపజేస్తున్నాయనడంలో అతిశయోక్తి లేదు.

'టనెల్స్, బ్రిడ్జెస్, రోప్‌వేస్ హబ్'గా జమ్ము – కాశ్మీర్ :


ప్రపంచంలోనే అత్యంత ఎత్తున నిర్మించబడిన టనెల్, రైలు బ్రిడ్జ్, రైల్వే లైన్ నిర్మిత ప్రాంతంగా రికార్డు సృష్టించడం విశేషం. సోన్‌మార్గ్ వద్ద నిర్మించిన "జెడ్–మోర్ టనెల్, చెనాబ్ రైలు బ్రిడ్జ్"లు మన ఇంజనీరింగ్ నిపుణుల ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. కాత్రా – బనిహల్ ప్రాంతాలను కలిపే 11 కిమీ రైలు మార్గాన్ని సుగమం చేయడానికి రియసీ జిల్లాలో చెనాబ్ నదిపై వంతెన నిర్మాణం పూర్తి అయ్యింది. 359 మీటర్లు లేదా 1,178 అడుగుల ఎత్తున నిర్మింపబడిన 1.3 కిమీ పొడవైన రైలు వంతెన అత్యంత ఎత్తైనదిగా పేర్కొనబడుతున్నది. 120 ఏండ్ల పాటు సేవలందించే సదుద్దేశంతో పదేళ్లలో అత్యాధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ రైలు వంతెన ఈఫిల్ టవర్ కన్న 35 మీటర్లు అధిక ఎత్తున నిర్మింపబడి రానున్న రేజుల్లో ప్రపంచ పర్యాటకంగా కేంద్రంగా కూడా నిలువనున్నది. ఈ వంతెనలు, సొరంగ మార్గాలు, రోప్‌వేలతో జమ్ము కాశ్మీర్ ప్రాంతం అన్ని సీజన్లలో పర్యాటకుల రాకకు ఆహ్వానాన్ని పలకడంతో పాటు కాశ్మీర్ – లేహ్ కార్గిల్ రవాణా మార్గాల ప్రయాణం తక్కువ సమయంలో సురక్షితంగా పూర్తి చేసుకోవచ్చని తెలుస్తున్నది. రానున్న రోజుల్లో పూర్తి కానున్న 'జోజిలా టనెల్'తో శ్రీనగర్–లేహ్ మధ్య దూరం తగ్గడమే కాకుండా వాహన వేగం గంటకు 30 నుంచి 70 కిమీ వరకు పెరగనుంది.

ఇలాంటి అత్యద్భుత మౌళిక వనరుల కల్పన ద్వారా జె అండ్ కె ప్రాంతం పర్యాటకంగా అనేక రెట్లు పెరగడం, స్థానిక ప్రజల జీవనోపాధులకు ఊపిరిలూదడం, ఆ ప్రాంత ఆర్థికాభివృద్ధి, సామాజిక–సాంస్కృతిక వికాసం జరగడం, సాహసక్రీడలు పెరగడం నిశ్చయంగా జరుగుతుంది. సమీప భవిష్యత్తులో శంకరాచార్య దేవాలయం, శివ్‌కోరి, బల్తాల్–అమర్‌నాథ్, కాత్రా–ఢిల్లీ ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టులు కూడా పూర్తి కానున్నాయి. కాశ్మీర్ నుంచి డిల్లీ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కూడా నడవనుంది. ఇలాంటి అత్యాధునిక శాస్త్రసాంకేతిన పరిజ్ఞానంతో నిర్మించిన ఇంజనీరింగ్ అద్భుత వంతెనలు, సొరంగాలు, రోప్‌వేలతో జమ్ము–కాశ్మీర్, లేహ్ కార్గిల్ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందాలని కోరుకుందాం, లోయ ప్రాంతాల రవాణాకు సరికొత్త నిర్వచనం ఇద్దాం.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# భక్తులకు అండగా పరమాత్ముడు!

భగవంతుడు ఎల్లవేళలా తనయందు భక్తి కలిగిన వారికి ఏదో రూపంలో అండగా ఉంటూనే ఉంటారు. శరణాగతి కోరుకుంటే అభయం ఇస్తుంటాడు. భక్తితో తనను శరణు వేడుకున్న వారికి అండగా ఉంటానని మన పురాణాలు, ఉపనిశత్తులు చెబుతున్నాయి. పురాణాలు, ఇతిహాసాల్లో ప్రహ్లాదాదులంతా ఇలాగే భక్తిని చాటారు. భగవంతుడు వారికి అండగా నిలిచాడు. అంటే భక్తికి భగవంతుడు వశమవుతాడన్నది సత్యం. ప్రతిఫలాపేక్ష లేకుండా తనను కొలువుమని గీతాచార్యుడు చెప్పాడు. ఆధునిక కాలంలోనూ ఇదే పద్ధి కొనసాగుతోంది. గుడికి వెళ్లడం భక్తితో చేయాలని అంటారు. భగవంతుని మీద పరిపూర్ణమ్j్రైన ప్రేమ కలిగి ఉండడమే భక్తి. అది అమృతానంద స్వరూపం. త్యాగరూపమైనది అయి ఏ కోర్కెలూ లేని స్థితిలో ఉండాలి. అదే మోక్ష అని నారద భక్తి సూత్రాలు చెబుతున్నాయి. భగవద్గీతలోని 'భక్తియోగం' భక్తి తత్వాన్నీ, లక్షణాల్నీ విపులంగా తెలిపింది. శ్రీమద్భాగవతం భగవద్భక్తుల లక్షణాలను, భక్తి స్వరూపాన్నీ సవిస్తరంగా ఆవిష్కరించింది. మానవునికి క్రోధం, శోకం లాంటి ఎన్నెన్నో అనుభూతులు ఉన్నా ప్రేమ లాంటి మధురమైన అనుభూతి మరేదీ లేదు! ప్రేమ పొందడం కన్నా ప్రేమించడం ఇంకా మధురం. మానవునికి స్వతహాగా ప్రేమించే లక్షణం ఉన్నా... ఆ ప్రేమ ఒక వ్యక్తికో, ఒక వస్తువుకో మాత్రమే పరిమితమవుతుంది. అప్పుడప్పుడు మాత్రమే కనిపిస్తూ, స్వార్థభావంతో కలుషితమౌతూ, విచ్ఛిన్నమైపోతూ ఉంటుంది. దీనినుంచి బయటపడి ప్రేమతత్వాన్ని అలవర్చుకుంటే భగవంతుడు వశమవుతాడని పురాణాలు చెబుతున్నాయి. నిష్కామంగా ప్రేమించడాన్ని సాధన చెయ్యాలి. ఈ జగత్తులో భగవంతుడు సర్వవ్యాప్తి. సమష్టి రూపమైన భగవంతుని పట్ల... సాధకులు చేసే 'నిష్కామప్రేమ' అనే ఈ ఉపాసనాక్రమానికి కూడా 'భక్తి' అనేదే వ్యవహార నామం. భక్తి సార్వజనీనం, భేదరహితం కావడంవల్ల నిజమైన భక్తిలో లోపాలు ఉండవు. అనంతమైన భగవత్తత్వానికి అనంతమైన కళ్యాణ గుణాలు, రూపాలు, నామాలు ఉన్నాయి! వాటిలో రాముడు, కృష్ణుడు, శివుడు, లలిత తదితర సంపూర్ణ దేవతామూర్తుల్ని ఉపాసనా సౌలభ్యం కోసం వేద, పురాణాలు మనకు అందించాయి. భక్తులు తమకు ఇష్టమైన ఒక దేవతా మూర్తిని స్వీకరించి, సమస్త దేవతలనూ, సమస్త జగత్తునూ ఆ మూర్తిలోనే ఉన్నట్టు భావించి, పరదేవతగా ఉపాసించడం ద్వారా భక్తిని కలిగి ఉండాలి. మనసు మరే ఇతర విషయాల మీద, ఇతర దేవతా రూపాల మీద కాకుండా... ఆ ఇష్టదేవతామూర్తి పైనే నిరంతరం లగ్నం కావాలి. భగవంతుడు అనేక విభూతులలో, అనేక కార్యాలు చేస్తూ, వేర్వేరు పేర్లతో, వేర్వేరు రూపాలతో, వేర్వేరు తత్వాలుగా కనిపిస్తాడు. మనం ఏ రూపంలో భక్తితో కొలిస్తే భగవంతుడు ఆ రూపంలో మనకు సాక్షాత్కరిస్తాడు. మానవుడు తాను కల్పించుకొనే మానవ సంబంధాలనే భగవంతునితో కల్పించు కొని... తద్వారా భగవంతునికి మరింత చేరువ కాగలడు. భగవంతునితో అవిచ్ఛిన్నమైన నిరంతర సాన్నిహిత్యం కలిగిన నాడు మానవుడు నిత్యానంద స్థితిని చేరుకుంటాడు.



## పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా..

# ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఘన విజయం

**గుంటూరు, మార్చి4(నినాదం న్యూస్):**

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజక వర్గంలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఘన విజయం సాధించారు. మొత్తం తొమ్మిది రౌండ్లకు గానూ, మంగళవారం తెల్లవారుజామున 5:50 గంటల సమయంలో చివరి రౌండ్ పూర్తయ్యే సరికి ఆయనకు 82,320 ఓట్ల ఆధిక్యం వచ్చింది. 7వ రౌండ్ ముగిసే సరికి ఆయనకు 1,18,070 ఓట్లు వచ్చాయి. మొత్తం 2,41,873 ఓట్లు పోలవగా, ఏడో రౌండ్ పూర్తయ్యే సరికి 21,577 చెల్లని ఓట్లుగా గుర్తించారు. దీంతో 50 శాతానికి పైగా ఓట్లు సాధించడంతో ఆలపాటిని విజేతగా ప్రకటించారు. ఇక తొమ్మిదో రౌండ్ పూర్తయ్యే సరికి ఆలపాటికి 1,45,057 ఓట్లు వచ్చాయి. సమీప ప్రత్యర్థి లక్ష్మణరావు 62,737 ఓట్లు సాధించారు. ఆలపాటి రాజాకి 82,320



ఓట్ల మెజార్టీ దక్కింది. చెల్లుబాటు అయిన ఓట్లలో 60 శాతం పైగా ఓట్లను ఆలపాటి సాధించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ తరపున పోటీచేసిన గాదె శ్రీనివాసులు నాయుడు విజయం సాధించారు. పోటాపోటీగా సాగిన ఎన్నికలో ఏపీటీఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ మీద ఆయన గెలుపొందారు. ఏయూలో జరిగిన ఓట్ల లెక్కింపు పక్రియ చివరివరకు ఉత్కంఠగా సాగింది. ఈ ఎన్నికల్లో 10 మంది బరిలో ఉన్నా.. పీఆర్‌టీయూ అభ్యర్థి శ్రీనివాసులునాయుడు, పీడీఎఫ్ అభ్యర్థి విజయగౌరి, ఏపీటీఎఫ్ అభ్యర్థి రఘువర్మ మధ్యే పోటీ నెలకొంది. నువ్వానేనా అన్నట్లు పోటీ సాగగా ఆఖరుకు రఘువర్మను ఎలిమినేట్ చేశారు. మొత్తం పోలైన ఓట్లు 20,791 అయితే చెల్లిన ఓట్లు 20,135. ఇందులో 10,068 ఓట్లతో మేజిక్ ఫిగర్ని అందుకోవాల్సి ఉండగా గాదెకు 12,035 ఓట్లు వచ్చాయి. దీంతో ఆయన గెలిచినట్లు ప్రకటించారు.

## జగన్ ప్రభుత్వంపై..

# విషం చిమ్మే యత్నం

- మండలిలో బడ్జెట్ చర్చలో కుంభ రవిబాబు



**అమరావతి, మార్చి4(నినాదం న్యూస్):** టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రతి సందర్భంలోను గత ప్రభుత్వ విధ్వంసం అంటూ ప్రజల మనస్సుల్లో కాలకూట విషం నింపే ప్రయత్నం చేస్తోందని.. ఎవరిది విధ్వంసం అనేది ప్రజలకు తెలుసునని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ కుంభ రవిబాబు నిప్పులు చెరిగారు.బడ్జెట్‌పై మండలిలో చర్చ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న దు?రష్ప్రచారాలను తూర్పారబట్టారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో సాధించిన ప్రగతిని అంకెలు, రుజువులతో సహా వివరించారు. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం అబద్దాలు చెబుతోందని రవిబాబు అన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు, కూటమి నేతలు కలిసి రాష్ట్ర ప్రజలకు సూపర్ సిక్స్‌తోపాటు అనేక హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చాక చంద్రబాబు ఎప్పటిలాగే తన మేనిఫెస్టోను ఏ చెత్తబుట్టలో వేశారో ప్రజలు గమనిస్తున్నారు. విశాల తీర ప్రాంతాన్ని వినియోగించుకుని ఏడు పోర్టులు నిర్మించి రాష్ట్రానికి ఆదాయాన్ని పెంచే ప్రయత్నం చేయడం విధ్వంసమా? ఒకేసారి 17 మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టి రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు విప్లవాత్మక చర్యలు తీసుకోవడమే విధ్వంసమా? ఇక కనీవినీ ఎరుగని రీతిలో ఏకంగా రూ.32వివేల కోట్లు ఖర్చుపెట్టి ప్రాథమిక విద్యలో మౌలిక వసతులు కల్పించడం విధ్వంసమా? నవరత్నాల ద్వారా డీబీటీ పద్ధతిలో రూ.2.70 లక్షల కోట్లకు పైగా ప్రజల ఖాతాలకు నేరుగా జమ చేయడం విధ్వంసమా? ఆర్బీకేల ద్వారా రైతులకు విత్తనం నుంచి ధాన్యం సేకరణ వరకు సేవలు అందించడం విధ్వంసమా? ఏకంగా 31 లక్షలకు పైగా ఇళ్ల స్థలాలిచ్చి, ఇళ్లు నిర్మాణం చేపట్టడం విధ్వంసమా? 2.36 లక్షల మంది వలంటీర్ల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల గడప వద్దకే అందించడం విధ్వంసమా?.. లేక ఇచ్చిన హామీలు అమలు చేయకుండా బ్జడెట్‌లో కోతవిలు పెట్టిన చంద్రబాబు విధ్వంవిసవికారుడా? ఎవవిరు విధ్వంసకారుడు? ఎవరు విధ్వంసం సృష్టిస్తున్నారో అనేది ప్రజలు ఇప్పటికే గుర్తించారు. టీడీపీ విప్ పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ.. 2019 నుంచి 2024 వరకు వైఎస్ జగన్ ఆర్థిక అరాచకాన్ని సృష్టిస్తే.. అందులోంచి బయవటకు రావడానికి చంద్రబాబు అధ్యక్షతన ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర వ్యవస్థను గాడిలో పెట్టేలా రూ.3,22,359 కోట్లతో బడ్జెట్ పెట్టారన్నారు. మూడు రాజధానుల పేరుతో అమరావతిని విధ్వంసం చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వ అరాచకాలను సరిదిద్దడానికి చంద్రబాబు సమీక్షలు పెడితే ఐదేసి గంటలు పడుతోందన్నారు.

## వీసీల రాజీనామాలపై..

# సభలో రగడ

- ఎవ్వరినీ బెదిరించాల్సిన అసవరం లేదు
- మండలిలో చర్చ సందర్భగా లోకేశ్ స్పష్టీకరణ
- ఆధారాలు చూపినా వియరణ లేదన్న బొత్స



**అమరావతి, మార్చి4(నినాదం న్యూస్):** వీసీల రాజీనామా అంశంపై శాసన మండలిలో వాడీవేడీ చర్చ జరిగింది. వైకాపా ఆరోపణలపై నిగ్గుతేల్చేందుకు ప్రివిలేజ్ కమిటీకి పంపాలని మంత్రి లోకేశ్.. స్పీకర్‌ను కోరారు. వీసీల రాజీనామా లేఖల్లో 'బెదిరించినట్లు' అనే పదం ఎక్కడా లేదని లోకేశ్ స్పష్టం చేశారు. వైకాపా నియమించిన వీసీలకు బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్ కూడా రాదని ఎద్దేవా చేశారు. వీసీల రాజీనామా లేఖల్లో బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయా అని ప్రశ్నించారు. 'రాజీనామా చేసిన ఒక వీసీ.. రాజారెడ్డి చెల్లెలి కోడలు. రాజీనామా చేసిన ప్రసాద్‌రెడ్డి.. వైకాపా కార్యకర్త. జగన్ పుట్టినరోజు వేడుకలు వర్సిటీలో చేసిన వ్యక్తి ఈ ప్రసాద్ రెడ్డి అని పేర్కొన్నారు. పార్టీ కోసం సర్వేలు చేయించిన ఘనత ఆనాటి వీసీలదని లోకేశ్ వ్యాఖ్యానించారు. వీసీలను బెదరించిన వ్యవహారంపై ఏపీ శాసనమండలిలో రగడ చోటు చేసుకోవడంతో సభ వాయిదా పడింది. అనంతరం శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. వీసీల రాజనామాలపై దర్యాప్తు జరపమని రెండు రోజుల క్రితం కోరామని.. ఆధారాలు ఇవ్వాలని ప్రభుత్వం కోరిందన్నారు. అన్ని ఆధారాలు నేడు మండలి ముందుకి తీసుకొని వచ్చినట్లు తెలిపారు. గవర్నర్ నియమించిన వీసీలను ఉన్నత విద్యాశాఖ అధికారులు ఏ విధంగా రాజీనామాలు చేయమని చెపుతారని విచారణ చేయమని చెప్పామన్నారు. అయితే ప్రభుత్వం తోక ముడుచుకొని వెళ్ళిందని విమర్శించారు. విచారణ చేయకుండా సవాల్ విసిరారని.. ఈ రోజు ఏమైందని ప్రశ్నించారు. సమాధానం చెప్పలేక దాబాయింపు, బుకాయింపులు, పరుష పదజాలంతో దూషణలు చేశారన్నారు. విచారణ జరగాలని.. వాస్తవాలు బయటకు రావాలని డిమాండ్ చేశారు. వీసీలు తప్పులు చేస్తే చర్యలు తీసుకోవాలన్నారు. బెదిరింపులాతో రాజీనామాలు చేయించడం విద్యా వ్యవస్థకు కళంకమని ఎమ్మెల్సీ అన్నారు. వీసీలుగా క్వాలిఫైడ్ వాళ్ళను మాత్రమే నియమిస్తారని... దానికి ఒక కమిటి ఉందని తెలిపారు. వీసీలుగా క్వాల్గి÷డ్ కానీ వాళ్ళని నియమిస్తే విచారణ జరపాలన్నారు. ఉన్నత విద్యా శాఖ ఆదేశాలతో రాజీనామా చేయాలని ఆదేశించారని.. అన్న దానిపై విచారణ జరపాలని అడుగుతున్నామన్నారు.

## తిరుమలలో మరోమారు చిరుత సంచారం

- అప్రమత్తంగా ఉండాలని భక్తులకు హెచ్చరిక

**తిరుమల, మార్చి4(నినాదం న్యూస్):** తిరుమలలో మరోసారి చిరుత సంచారం కలకలం రేపింది. సోమవారం రాత్రి తిరుపతి జూ పార్కు రోడ్డులో చిరుత సంచరించింది. వేకువజామున ఒంటిగంట సమయంలో గాలిగోపురం సమీపంలోని మెట్ల మార్గంలో సంచరించింది. నడక మార్గంలోకి వచ్చి.. పిల్లిని వేటాడి అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. సీసీ కెమెరా దృశ్యాలను చూసి దుకాణదారులు షాక్ అవుతున్నారు. చిరుత సంచారం సమాచారంపై మెట్ల మార్గం వద్ద దుకాణదారులు ఫారెస్ట్, టీటీడీ విజిలెన్స్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులు తనిఖీ చేయగా.. చిరుత జాడ ఎక్కడా కనిపించలేదు. టీటీడీ అధికారులు నడక మార్గంలో భక్తులను అలెర్ట్ చేశారు. మధ్యాహ్నం 2 గంటల వరకే 12 ఏళ్ల లోపు చిన్న పిల్లలను నడక మార్గంలో తీసుకెళ్లేందుకు అనుమతిని ఇచ్చారు. మధ్యాహ్నం అనంతరం భక్తులు గుంపులు గుంపులుగా వెళ్లాలని టీటీడీ అధికారులు సూచిస్తున్నారు.

## ఎమ్మెల్సీ ఫలితాలపైనా..

# మాట మారిస్తే ఎలా.?

- మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ విమర్శలు



**విశాఖపట్టణం, మార్చి4(నినాదం న్యూస్):** ఏపీలో ఎమ్మెల్సీ ఫలితాల తర్వాత మాట మార్చడానికి కూటమి నేతలకు సిగ్గులేదా అని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఉద్యోగుల కడుపు మంటకు నిన్నటి ఎన్నికల ఫలితాలే నిదర్శనమని తెలిపారు. ఓటమిని హుందాగా ఒప్పుకోండి. ఎవరు గెలిస్తే వారే మా అభ్యర్థి అని చెప్పడం ఎంత దారుణం అంటూ ఘాటు విమర్శలు చేశారు. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ విశాఖలో మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల తరువాత టీడీపీ మంత్రులు, నేతల ప్రకటనలు చూసి ఆశ్చర్యం వేసింది. రఘువర్మ ఓటమి తరువాత మాకు సంబంధం లేదని అచ్చెన్నాయుడు చెబుతున్నారు. కూటమి నేతలకు మాట మార్చడానికి సిగ్గు లేదా?. ప్రభుత్వ పని తీరుకు ఎమ్మెల్సీ ఎన్నిక ఫలితం నిదర్శనం. విద్యాశాఖకు మంత్రిగా సీఎం కుమారుడు లోకేష్ ఉన్నారు. ఉద్యోగులకు పీఆర్సీ ఇస్తామని మోసం చేశారు. ఏనాడు జీతాలు సరిగా ఇవ్వలేదు. ఉద్యోగుల కడుపు మంటకు నిన్నటి ఫలితాలు నిదర్శనం. రిగ్గింగ్‌కు పాల్పడి పట్టభద్రుల ఎన్నికల్లో విజయం సాధించారు. ఓటమిని హుందాగా ఒప్పుకోండి. ఎవరు గెలిస్తే వారే మా అభ్యర్థి అని చెప్పడం ఎంత దారుణం. కూటమి తరపున మా అభ్యర్థి రఘు వర్మ అని అనేక సార్లు కూటమి నేతలు చెప్పారు. ఎన్నికల్లో ఎప్పుడూ శ్రీనివాసుల నాయుడు తమ అభ్యర్థి అని కూటమి నేతలు ప్రకటించలేదు. శ్రీనివాసుల నాయుడు కూడా కూటమి తనకు మద్దతు ప్రకటించలేదని స్పష్టం చేశారు. బాబాయి ఏమో.. శ్రీనివాసుల నాయుడు అంటున్నారు.. అబ్బాయి ఏమో.. రఘువర్మ అంటున్నారు. అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు చెప్పిన దాంట్లో ఎవరి మాట నిజం. ఎవరికో పుట్టిన బిడ్డకు మీరు పేరు పెట్టవద్దంటూఎద్దేవా చేశారు. కూటమి పాలనలో రిషికొండ బీచ్‌కు అన్యాయం జరిగింది. ప్రభుత్వ నిర్వాకం వల్ల బ్లూఫ్లాగ్‌ను బీచ్‌లో నుంచి తొలగించారు. ప్రభుత్వం చేతగాని చర్యలు వలన ఉత్తరాంధ్ర జిల్లాలు నష్టపోతున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ దూరంగా ఉంది అని చెప్పుకొచ్చారు.

## వచ్చే ఎన్నికల్లో..

# చంద్రగిరి నుంచే పోటీచేస్తా..

- టీడీపీ మహిళా నేత సుధారెడ్డి



**చిత్తూరు, మార్చి4(నినాదం న్యూస్):** వచ్చే ఎన్నికల్లో చంద్రగిరి నుంచే తాను పోటి చేస్తా అని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి, టీడీపీ మహిళా నేత సుధారెడ్డి తెలిపారు. వచ్చే ఎన్నికల నాటికి చంద్రగిరి రెండు స్థానాలు అవుతాయిని, ఖచ్చితంగా తాను చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిపై పోటీ చేస్తానన్నారు. అవీనితి చేసిన చెవిరెడ్డి చట్టప్రకారం జైలుకు పోతాడన్నారు. చెవిరెడ్డి, ఆయన సతీమణి ఆస్తుల వివరాలను ఇంటింటికి కరపత్రాలు చేసి పంచుతానని హెచ్చరించారు. చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద చెవిరెడ్డికి సుధారెడ్డి బహిరంగంగా ఫోన్ చేయగా.. ఆయన ఫోన్ లిఫ్ట్ చేయలేదు. మీడియాతో మాట్లాడుతూ తనపై చేసిన ఆరోపణలు నిరూపించాలని సుధారెడ్డి సవాల్ విసిరారు. 'వచ్చే ఎన్నికలలో చంద్రగిరి నుంచే పోటీ చేస్తా. వచ్చే ఎన్నికల నాటికి చంద్రగిరి రెండు స్థానాలు అవుతాయి. ఖచ్చితంగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిపైనే నేను పోటి చేస్తాను. చంద్రబాబు గారు ఖచ్చితంగా మహిళగా నాకు అవకాశం ఇస్తారు. అవీనితి చేసిన చెవిరెడ్డి చట్టప్రకారం జైలుకు పోతారు. గత ఐదేళ్ళుగా ఆడవాళ్ళను అవమానిస్తూ వైసీపీ రాజకీయం చేసింది. ఎమ్మెల్యే నానిని ఎదుర్కొనే ధైర్యం లేక నామీద ఆరోపణలు చేశారు. చెవిరెడ్డి, ఆయన సతీమణి ఆస్తుల వివరాలను ఇంటింటికి కరపత్రాలు చేసి పంచుతాను. వైసీపీ సోషల్ మిడియాలో నామీద పోస్టర్లు వేయించావు. యాభై లక్షలు లంచం తీసుకున్నానని ఆరోపణలు చేయడం కాదు.. ఆధారాలు ఉంటే బయట పెట్టు' అని సవాల్ విసిరారు. ఐదేళ్ళుగా మఠం భూములను చెవిరెడ్డి దోచుకున్నాడు. మగవాళ్లు, మగవాళ్లతో పోరాటం చేయాలి. నాని మీద రాజకీయం చేయలేక.. మహిళలైన నామీద ఆరోపణలు చేస్తున్నాడు. ఎన్నికల అఫిడవిట్లో చెవిరెడ్డి ఆస్తులను తప్పుగా చూపించారు. రేపటి నుండి చెవిరెడ్డి అవినీతి పోరాటం చేస్తాను. ముప్పై సంవత్సరాలుగా చంద్రగిరి గెలవకపోయినా.. నియోజకవర్గ కార్యకర్తల పార్టీ కోసం పనిచేశారు. చంద్రబాబు పెట్టిన బిక్షతో నీకోడుకు బయట తిరుగుతున్నాడు. చెవిరెడ్డి లెక్కల మొత్తం ఆధారాలతో బయటకు తీస్తాం' అని టీడీపీ మహిళా నేత సుధారెడ్డి ఫైర్ అయ్యారు.

# ఏపీ ప్రభుత్వం సంచలన నిర్ణయం..

## ఓట్ల తొలగింపుపై విచారణకు 'సిట్'




**బాపట్ల, మార్చి4(నినాదం న్యూస్):** గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో వైసీపీ ప్రభుత్వం వ్యతిరేఖ ఓట్లను అక్రమంగా తొలగించారన్న ఫిర్యాదుతో ప్రస్తుత కూటమి ప్రభుత్వం విచారణకు సిట్‌ను నియమించింది. ఈ మేరకు ప్రకాశం జిల్లా ఎస్పీ ఆర్. దామోదర్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తూ సీఎస్ కె విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బృందంలో గుంటూరు పశ్చిమ సబ్ డివిజన్ డీఎస్పీ అరవింద్ తోపాటు మరో అధికారి సభ్యులుగా నియమించుకుని వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సిట్‌కు పోలీస్ స్టేషన్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బృందం సీఐడీ డీజీపీ నియంత్రణలో పనిచేయనుంది. అలాగే సిట్ బృందానికి అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందించాలని బాపట్ల జిల్లా ఎస్పీని ప్రభుత్వం ఆదేశించింది. ప్రతి మూడు నెలలకు ఒకసారి సిట్ బృందం దర్యాప్తు పురోగతిని ఈసీకి దర్యాప్తులో భాగంగా సిట్ ఎవరినైనా విచారించి, అరెస్టు చేయవచ్చునని ఉత్తర్వుల్లో పేర్కొంది.

**సిట్ ఏర్పాటు నేపథ్యం...**

అప్పటి పర్చూరు నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జి ఆమంచి కృష్ణమోహన్ తప్పుడు ధ్రువీకరణ పత్రాలు, మోసపూరిత సమాచారంతో ఓట్లను తొలగించేలా కుట్రలు చేశారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమగ్ర సమాచారాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. అక్రమాలకు పాల్పడిన వారిని వదిలే ప్రసక్తే లేదని పట్టుదలతో పోరాటం చేశారు. పర్చూరు నియోజకవర్గంలో ఓట్ల తొలగింపు కోసం గంప గుత్తగా ఫాం-7 దరఖాస్తులు చేశారని, 24 వేల ఓట్లను ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా తొలగించారని ఏలూరి సాంబశివరావు తన ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి అనిత, డీజీపీలను స్వయంగా కలిసి పూర్తి ఆధారాలతో వివరించారు. ఎమ్మెల్యే ఏలూరి ఫిర్యాదు పై స్పందించిన ప్రభుత్వం పర్చూరులో 24 వేల ఫాం-7 దరఖాస్తులు పెట్టడంపై తాజాగా సిట్ బృందాన్ని ఏర్పాటు చేసింది.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా..

# పేరాబత్తుల రాజశేఖరం విజయం



**ఏలూరు, మార్చి4(నినాదం న్యూస్):** ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వచ్చేశాయి. ఉభయగోదావరి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా టీడీపీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయం సాధించారు. పీడీఎఫ్ అభ్యర్థి వీర రాఘవులుపై పేరాబత్తుల గెలుపొందారు. ఇప్పటి వరకు జరిగిన ఏడు రౌండ్లలోనూ రాజశేఖరం ఆధిక్యంలో నిలిచారు. ఆయన మొత్తం లక్షా 12వేల 331 ఓట్లు సాధించారు. అలాగే పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులుకు 41,268 ఓట్లు వచ్చాయి. ఈ క్రమంలో వీర రాఘవులుపై పేరాబత్తుల రాజశేఖరం 71,063 ఓట్ల ఆధిక్యతలో నిలిచారు. విజయానికి కావాల్సిన పోలైన ఓట్లలో 50 శాతం మొదటి ప్రాధాన్యత ఓట్లను కూటమి అభ్యర్థి సాధించారు. మ్యాజిక్ ఫిగర్ దాటడంతో పేరాబత్తుల రాజశేఖరం విజయం ఖాయమైంది.

## బీసీల సంక్షేమంపై..

# వైసీపీ మొసలి కన్నీరు

- ఐదేళ్ల పాలనలో వారిని విస్మరించారు
- మండలిలో చర్చలో మంత్రులు లోకేశ్, సవితల ఆగ్రహం



**అమరావతి, మార్చి4(నినాదం న్యూస్):** ఏపీ శాసనమండలిలో ప్రశ్నోత్తరాలపై చర్చ వాడి వేడిగా జరిగింది. బీసీల సంక్షేమానికి నిధుల కేటాయింపుపై వైసీపీ సభ్యుల ఆరోపణలకు ధీటుగా మంత్రులు నారా లోకేష్, సవిత సమాధానం చెప్పారు. బీసీలకు గత వైసిపి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో విద్యార్థి అమర్నాథ్ గౌడ్‌ను ఎలా హత్య చేశారో చర్చించేందుకు సిద్ధమా? అని లోకేశ్ సవాల్ విసిరారు. బీసీల సంక్షేమానికి నిధుల కేటాయింపుపై శాసన మండలి ప్రశ్నోత్తరాల సమయంలో లోకేశ్ మాట్లాడారు. ఎమ్మెల్సీ అనంతబాబు దళితుడిని చంపి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేయలేదా?చేశారా? అనేది వైకాపా సభ్యుడు త్రిమూర్తులు చెప్పాలి. వైకాపా హయాంలో బీసీలకు రిజర్వేషన్లు ఎందుకు తగ్గించారో ఆ పార్టీ సభ్యులు చెప్పాలని లోకేశ్ డిమాండ్ చేశారు. మంత్రి సవిత మాట్లాడుతూ...నా బీసీలు అంటూ గొప్పలు చెప్పిన జగన్.. గత ఐదేళ్ల పాలనలో బీసీలకు ద్రోహం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 8 నెలల్లోనే రూ. 1,977 కోట్లు స్వయం ఉపాధి పథకాలకే కేటాయించాం. రూ.200 కోట్లతో 1.2 లక్షల మందికి ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇస్తూ కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నాం. బీసీల కోసం కార్పొరేషన్ల ద్వారా రాయితీపై రుణాలు అందిస్తున్నాం. ఆదరణ పథకానికి వెయ్యి కోట్ల నిధులు కేటాయించాం. 26 జిల్లాల్లో బీసీ భవన్‌లను నిర్మించబోతున్నాం అని మంత్రి తెలిపారు. బీసీ హాస్టళ్లు, గురుకులాలు మరమ్మతులు చేస్తున్నామని మంత్రి సవిత వెల్లడించారు.

## ఈ నెలలోనే..

# మెగా డీఎస్సీ విడుదల

- మరోమారు స్పష్టం చేసిన మంత్రి లోకేశ్

**అమరావతి, మార్చి4(నినాదం న్యూస్):** ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చి నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసే భాధ్యత తమదని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్కసారి కూడా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయలేదని, 1.82 లక్షల పోస్టులు గత టీడీపీ హయాంలోనే భర్తీ చేశాం అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో రెండోరోజు ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో డీఎస్సీ నోటిఫికేషన్, నిరుద్యోగ భృతిపై సభ్యుల ప్రశ్నలకు మంత్రి నారా లోకేష్ సమాధానాలు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్కసారి కూడా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. 1.82 లక్షల పోస్టులు గత టీడీపీ హయాంలోనే భర్తీ చేశాం. ఎట్టి పరిస్థితుల్లోను మార్చి నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసే భాధ్యత మాది. వాస్తవాలు తెలుసుకుని వైసీపీ సభ్యులు మాట్లాడాలి' అని అన్నారు. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని త్వరలోనే అమలు చేయనుందని, ఇందుకు సంబంధించిన గైడ్ లైన్స్ త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు. తల్లికి వందనం పథకానికి బ్జడెట్లో రూ.9,407 కోట్లు కేటాయించినట్లు మంత్రి లోకేష్ తెలిపారు. తల్లికి వందనం పథకంపై మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు.

## విద్యుత్ ఛార్జీలను..

# పెంచేది లేదు

- మండలిలో స్పష్టం చేసిన మంత్రి గొట్టిపాటి



**అమరావతి, మార్చి4(నినాదం న్యూస్):** కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచలేదని, పెంచదని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపు పాపం మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిదే అని, వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు 9 సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచారన్నారు. విద్యుత్ ఛార్జీలు వాళ్లే పెంచి, వాళ్లే ధర్నాలు చేసి, వాళ్లే ప్రశ్నలు అడగడం ఒక వింత పరిస్థితి అని మంత్రి గొట్టిపాటి విమర్శించారు.విద్యుత్ ఛార్జీల పెంపు అంశంపై ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో ప్రశ్నోత్తరాలు కొనసాగాయి. సభ్యుల ప్రశ్నలకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి సమాధానం ఇచ్చారు. ఈ ప్రభుత్వం విద్యుత్ సచార్జీలు పెంచబోదు. ప్రభుత్వం దానికి కట్టుబడి ఉంది. గత కౌన్సిల్ సమావేశాల నుంచి పదే పదే సత్యదూరమైన ప్రచారం చేస్తున్నారు. వారు పెంచిన విద్యుత్ చార్జీలకు వారే ధర్నాలకు పిలుపునిస్తున్నారు, వాళ్లే ప్రశ్నలు వేస్తున్నారు. వైసీపీ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. 2023-24 లోనే 15 వేల కోట్ల భారాలు వేశారు. రాష్ట్రానికి రావాల్సిన పెట్టుబడిదారులను తరిమికొట్టారు. కృష్ణపట్నం, వీటీపీఎస్ ఎ÷-లాంట్లను గత టీడీపీ ప్రభుత్వం అభివృద్ధి చేయాలని చూస్తే.. ఆ తర్వాత వచ్చిన వైసీపీ షట్ డౌన్ చేసింది. విద్యుత్ వ్యవస్థలను నిర్వీర్యం చేసిన ఘటన వైసీపీది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సొంతగా తయారీపై దృష్టి పెట్టింది. రైతులకు పగటి పూట కరెంట్ ఇచ్చేందుకే కృషి చేస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచలేదు, పెంచదు' అని మంత్రి గొట్టిపాటి చెప్పారు.

# ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల కోసం పోటీ

- బాబు, లోకేశ్‌లతో ఆశావహుల భేటీ

**అమరావతి, మార్చి4(నినాదం న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత్తం ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ అయ్యింది. ఐదుస్థానాలకు అనేకులు పోటీ పడుతున్నారు. ఇందులో జనసేన నేత నాగబాబుకు ఓ సీటు ఖాయమని ప్రచారం సాగుతోంది. సిఎం చంద్రబాబుతో చర్చల సందర్భంగా పవన్ కళ్యాణ్‌కు బాబు హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.ఈ క్రమంలో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీల కోసం తెలుగు దేశం పార్టీలోని సీనియర్ నేతలంతా తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో.. తెలుగుదేశం పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్‌ను కలిసేందుకు ఎమ్మెల్యే ఆశావహులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అసెంబ్లీ లాబీల్లో చక్కర్లు కొడుతూ హంగామా చేస్తున్నారు. తాజాగా సీఎం చంద్రబాబుతో కొమ్మాలపాటి శ్రీధర్ సమావేశమయ్యారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వీరి భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే ఎమ్మెల్సీ ఇస్తామనీ సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో సీఎంను కొమ్మాలపాటి భేటీ కావడం..చర్చ జరుగుతోంది. మొత్తం 5 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగనుండగా.. జనసేన నుంచి నాగబాబు పేరు ఇప్పటికే ఫిక్స్ అయ్యింది. వంగవీటి మోహనరంగా పేరు కూడా ఎమ్మెల్సీగా ఖరారైనట్లు ప్రచారం జరుగుతోంది. పిఠాపురం టీడీపీ నేత ఎస్ వి ఎస్ వర్మకు కూడా ఎమ్మెల్సీ ఖాయమైనట్లు ప్రచారం జరుగుతోంది. అంటే.. ఇప్పటి వరకు ఉన్న సమాచారం ప్రకారం.. 4 స్థానాలకు అభ్యర్థుల పేర్లు అనధికారికంగా ఖరారయ్యాయి. మాజీమంత్రి ప్రస్తుత ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడుకు మరోమారు ఎమ్మెల్సీ ఇస్తారా అన్నది అనుమానంగా ఉంది. ఆయనకు మంత్రి పదవి కూడా ఇవ్వలేదు. ఏపీలో ఐదు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ ఇప్పటికే విడుదలైంది. నామినేషన్ల స్వీకరణకు మార్చి 10 చివరి తేదీ. మార్చి 11న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. మార్చి 13 వరకు నామినేషన్ల ఉపసంహారణకు అవకాశం కల్పించారు. మార్చి 20న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అదేరోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఉంటుంది.

నినాదం
నిఖార్సైన జర్నలిజం
బుధవారం, తెలంగాణ
05 మార్చి 2025
www.ninadam.co.in

# ఆదర్శవ్యక్తి మాజీ మంత్రి వెంకట్ రెడ్డి

- డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్



**ఖమ్మం, మార్చి 04(నినాదం న్యూస్):** రాజకీయాల కంటే వ్యక్తిత్వ విలువలు ను గౌరవించే వ్యక్తి, నిక్కచ్చితమైన రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనం, నేటి రాజకీయాలకుదివంగత నేత రాం రెడ్డి వెంకట్ రెడ్డి ఆదర్శ వ్యక్తి అని డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పేర్కొన్నారు. ఈరోజు కామేపల్లి మండలం కొత్త లింగాల క్రాస్ రోడ్‌లో దివంగత నేత మాజీ మంత్రివర్యులు రాం రెడ్డి వెంకట్ రెడ్డి 9వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డిసిసిబి డైరెక్టర్ మాజీ జడ్పిటిసి మేకల మల్లిబాబు యాదవ్ తో పాటు పలువురు నేతలు వారి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ ఈనాడు రాజకీయాలు ఎంతో కల్మషం అయినప్పటికీ రాజకీయాలు శాశ్వతం కాదు వ్యక్తిత్వ విలువలే ప్రధానమని నిరూపించడం వలన ఇప్పటికీ ప్రతి తండాలో ప్రతి హరిజనవాడలో, ప్రతి గుండెలో చిరస్థాయిగా రాంరెడ్డి వెంకట్ రెడ్డి నిలిచిపోయారని, తెలిపారు. కన్నతల్లికి కష్టమొచ్చినా ఓర్చుకుంటాను గాని కార్యకర్తలకు కష్టం వస్తే సహించను అనేవారని, మాటలతో కాకుండా చేతలతో, ఎన్ని కష్టాలు ఎదురైనా పార్టీ కార్యకర్తలను, వెన్నంటి కాపాడుకున్న మహా వ్యక్తి అని, తన జీవితకాలంలో ఎన్ని కష్టాలు ఎదురైనా కాంగ్రెస్ పార్టీని వీడిపోని గుండె ధైర్యం గల వ్యక్తి రాంరెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గింజల నర్సిరెడ్డి, డిసిసిబి డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు, నాయకులు తోటకూరి శివయ్య, నల్లమోతు లక్ష్మయ్య గుజ్జర్లపూడి రాంబాబు, రాం రెడ్డి జగన్నాథ్ రెడ్డి, ధరావత్ అనురాధ,కోటి, దొడ్డ వేణు, బట్టు నాగ బానోతు లాల, సిరిపురపు రవి, వీరస్వామి, మాలోత్ ప్రేమ్ కుమార్ పందుల రామ్మూర్తి మరియు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రదర్శన సదస్సు



**ఖమ్మం మార్చి 04 (నినాదం న్యూస్):** ఖమ్మం నగర పరిధిలోని మంచి కంటే మీటింగ్ హాల్ లోని మంగళవారం బోడేపూడి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ మహిళలకు మంగళవారం ఉదయం స్థానిక మంచికంటి హాల్ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ప్రదర్శన మరియు సదస్సు ఏర్పాటు చేసుకోవడం జరిగింది.. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన బివికె ట్రస్ట్ జనరల్ మేనేజర్ వై శ్రీనివాసరావు, ఇన్స్ట్రక్టర్ శ్రీమతి పి ప్రమీల మాట్లాడుతూ నేడు మహిళలు ఉపాధి లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని వారికి ఆసరాగా మా బివికె ట్రస్ట్ నుండి ఉచిత టైలరింగ్ మరియు ఇతర శిక్షణలు ఇప్పించి మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడమే ధ్యేయమని అన్నారు.. అదే విధంగా మహిళలు ఎదుర్కొంటున్న ఆర్థిక రాజకీయ సామాజిక సమస్యలపై గళం ఎత్తి నినదించాలని ప్రతి సమస్యపై ప్రతిఘటన అవసరం వుందని అన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత గోవిందరావు రిటైర్డ్ అధ్యాపకులు వహించారు. ఈ కార్యక్రమంలో పి ఝాన్సీకుమారి, జి శ్రీదేవి, విజయలక్ష్మి, సామినేని నాగేశ్వరరావు, శ్రావణి, మణి, అంజని, షాహిదా,రజని, కవిత , శిరీష ,వెంకట్రావు,మరియు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.. ముందుగానే మహిళలకు గేమ్స్ నిర్వహించారు.


# ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల.. ప్రజలకు విశ్వాసం కల్పించాలి

- వైద్య శాఖ ప్రజలకు సేవా దృక్పథంతో పని చేయాలి
- ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది విధులకు సకాలంలో హాజరుకావాలి
- ఆసుపత్రి ఏర్పాటు చేసిన వైద్య సేవల సూచికలు, హెల్ప్ డెస్క్ పరిశీలన
- ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీచేసిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ఖమ్మం, మార్చి04(నినాదం న్యూస్):** ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజలలో విశ్వాసం కల్పించాలని, ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్య శాఖ సేవా దృక్పథంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని మంగళవారం జిల్లా కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధాన ఆస్పత్రిలోని క్యాజువాలిటి, వెయిటింగ్ హాల్, ల్యాబ్, దయాగ్నొస్టిక్ సెంటర్, ఎంపిహెచ్ డబ్ల్యు. ట్రైనింగ్ సెంటర్, ఎంసిహెచ్, ఓపి, ఇన్ పేషెంట్ వార్డు, అవుట్ పేషేంట్ వార్డు, గుండె సంబంధిత సెంటర్, కళ్ల చిక్సిత కేంద్రం, గర్భిణీ స్త్రీల వార్డ్, మైత్రి ట్రాన్స్ క్లినిక్, మందులు, సరుకులు నిల్వ చేసే స్టోర్ రూమ్ లను కలెక్టర్ పరిశీలించారు. సిబ్బంది వివరాలు, మందులు, ప్రజలకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ అందుబాటులో ఉంటూ, మెరుగైన వైద్య సేవలు అందించాలని, మందుల నిల్వలు సరిపడా ఉండే విధంగా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రిలో రోగులకు అందుబాటులో ఉండాలని తెలుపుతూ, ఆసుపత్రిలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ అధికారులతో కలిసి ఆసుపత్రి మొత్తం తిరిగి నూతనంగా నిర్మిస్తున్న భవనాలను పరిశీలించారు. కావలసిన వసతి ఏర్పాట్లపై, పార్కింగ్, టాయిలెట్స్ నిర్మాణాల కోసం అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. దివ్యాంగులచే నిర్వహిస్తున్న పెయిడ్ పార్కింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. మహిళా శక్తి పథకంలో భాగంగా హాస్పటల్ లో నడుపుతున్న క్యాంటీన్ ను కలెక్టర్ సందర్శించారు. నిర్వాహకులతో ముచ్చటించారు. వైద్య కోసం వచ్చే వారికి, వారి సహాయకులకు మంచి రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. ప్లాస్టిక్ వస్తువులను ఉపయోగించవద్దని సూచించారు. ఆనతరం హాస్పటల్ లో రోగులకు, వారి సహాయకులకు సత్యసాయి సేవా అన్నదానం కార్యక్రమంలో కలెక్టర్ భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ,లి ఆసుపత్రికి వచ్చే రోగులతో సిబ్బంది మర్యాదగా ప్రవర్తించడం, సేవా దృక్పథంతో పని చేయడం వైద్య శాఖలో చాలా అవసరమని అన్నారు. ఆసుపత్రిలో రోగులకు అందించే పౌష్టికాహారం, భోజనం రుచికరంగా, పౌష్టికాహారంతో కూడుకున్నదై ఉండాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ఎల్. కిరణ్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ బి. కిరణ్, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యువత వ్యాపార రంగాలలో రాణించాలి



**జిన్నారం/ పటాన్ చెరు, మార్చి 4 (నినాదం న్యూస్):** యువత వ్యాపార రంగాలలో రాణించేందుకు శ్రమించాలని మాదారం మాజీ సర్పంచ్ సరిత సురేందర్ గౌడ్ తెలిపారు. గడ్డపోతారం మున్సిపాలిటీ లోని మాదారం గ్రామంలో నిర్వాహకులు గడ్డమీది రాజు డ్రై క్లీనింగ్ ను ఏర్పాటు చేశారు. ఆదివారం ఆయన ప్రారంభించి, శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువకులు ఉద్యోగాల కోసం నిరీక్షిస్తూ సమయాన్ని వృధా చేయకుండా స్వయం ఉపాధి రంగంల్లో రాణించాలని సూచించారు. ఉపాధి పొందడంతో పాటు మరో నలుగురికి ఉపాధి చూపించిన వారు అవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో చాకలి అశోక్, మధు, సాయి పాల్గొన్నారు.

# కాంగ్రెస్.. రైతు పక్షపాత ప్రభుత్వం

- సీతారామతో గోదావరి కృష్ణా జలాలు అనుసంధానం
- వైరా ప్రాజెక్టులోకి గోదావరి జలాలు
- సస్యశ్యామలం కానున్న సాగర్ ఆయకట్టు ప్రాంతాలు
- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దుర్గా ప్రసాద్

**ఖమ్మం, మార్చి04(నినాదం న్యూస్):**



సీతారామ ప్రాజెక్ట్ పూర్తిచేసి కాంగ్రెస్ రైతు పక్షపాత ప్రభుత్వమని నిరూపించుకుందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో జరిగిన సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మరియు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు లు మాట్లాడుతూ.... బడుగు, బలహీన వర్గాల ప్రజలకు, రైతులకు మరియు అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అందించడమే కాక అభివృద్ధి చేయటం కాంగ్రెస్ తోనే సాధ్యమవుతుందని అన్నారు. సీతారామ ప్రాజెక్టు నుండి గోదావరి జలాలను రాజీవ్ కెనాల్ ద్వారా వైరా రిజర్వాయర్ కు నీటిని విడుదల చేయడం జరిగిందని దీంతో సాగర్ ఆయకట్టు పరిధిలో రైతులు కళ్ళల్లో ఆనందం వెల్లి విరుస్తుందని అన్నారు. గోదావరి నది కృష్ణా నదీ జలాల అనుసందానం కోసం ఎంతో మంది రైతులు తమ విలువైన భూములను వదులుకొని ప్రభుత్వానికి సహకరించినందుకు ఆ కాలువలో నీరు రావటం, అదే రోజు భూముల రైతుల ఖాతాల్లోకి డబ్బులు రావడం శుభసూచికమని, ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పార్టీ తరపున ధన్యవాదాలు తెలిపారు. అంతేకాకుండా ఎంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం చాకచక్యంగా ప్రాజెక్టు పనులు పూర్తి చేసి అతి తొందరగా రైతాంగానికి సాగునీరు అందించడంలో, అదే రోజు భూనిర్వాసితులకు డబ్బులు వారి ఖాతాలలో జమ చేసేందకు కృషిచేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి,జిల్లా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు, రెవెన్యూ మంత్రి శ్రీనివాస్ రెడ్డికి, వైరా నియోజకవర్గ శాసనసభ సభ్యులు మాలోత్ రాందాసు నాయక్ కి ఖమ్మం జిల్లా రైతాంగం తరపున, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ తరపున ధన్యవాదాలు తెలియజేశారు. దాదాపు మూడు నియోజక వర్గాల రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా జిల్లా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దగ్గరుండి పనులను పర్యవేక్షించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు టీపీసీసీ సభ్యులు , జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, జిల్లా కిసాన్, S C సెల్, మైనారిటీ సెల్ అధ్యక్షులు మొక్కా శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య,సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు షేక్ రషీద్,రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు జెరిపోతుల అంజనీ కుమార్, జిల్లా ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు గజ్జి సూర్యనారాయణ, బోయిన వేణు,పాలేరు నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షులు బచ్చలికూరి నాగరాజు, గుడిపూడి వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# రైతు కోసం చివరిశ్వాస వరకు పనిచేస్తా..

**భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ అధ్యక్షుడు కొండెల సాయి రెడ్డి**



**నిజామాబాద్ ప్రతినిధి, మార్చి 4 (నినాదం న్యూస్) :** ఊహ తెలిసిన నాటి నుంచి రైతుల శ్రేయస్సు కోసమే పనిచేస్తున్నానని, నా చివరి శ్వాస వరకు రైతు సంక్షేమం కోసమే పని చేస్తానని భారతీయ కిసాన్ సంఘ్ నూతన జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన కొండల సాయిరెడ్డి వ్యాఖ్యానించారు. భారతీయ కిసాన్ సంఘ్ 46వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మారుతీ నగర్ లోని గణేష్ భవన్ లో నూతన జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన కొండల సాయి రెడ్డి ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సాయి రెడ్డి మాట్లాడుతూ కిసాన్ సంఘ్ లో సాధారణ కార్యకర్త స్థాయి నుంచి జాతీయ అధ్యక్షుడి స్థాయికి ఎదిగిన ఈ మొత్తం ప్రయాణం కేవలం వ్యవసాయం,రైతు మరియు వ్యవసాయ అనుబంధ వ్యవస్థలతోనే ముడి పడిపోయిందని తన జీవితం మొత్తంలో రైతు సంక్షేమ తప్ప వేరే లక్ష్యము ఏదీ లేదని తెలిపారు. జాతీయ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని కానీ అదే సమయంలో దేశంలోనే అత్యంత శక్తివంతమైన రైతు సంస్థగా కిసాన్ సంఘ్ ను నిలబెట్టాల్సిన బాధ్యత తన మీద ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా విచ్చేసిన ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ నర్రా వెంకట శివకుమార్ మాట్లాడుతూ రైతు ద్వారానే సమాజంలో పరివర్తన సాధ్యమవుతుందని భూమిని తల్లిగా భావించి పోషించేది రైతు మాత్రమే అని అందుకే రైతును భగవంతుడితో పోలుస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు కె.నారయణ రెడ్డి , డి. వాసుదేవరావు, రైతు ఉత్పత్తిదారుల సంఘం స్టేట్ జనరల్ సెక్రటరీ గడ్డం దశరథ్ రెడ్డి , నగర అధ్యక్షులు, భారతీయ కిసాన్ సంఘ్, వ్యవసాయ శాఖ అధికారులు, భారతీయ కిసాన్ సంఘ నాయకులు కార్యకర్తలు వివిధ వ్యవసాయ అనుబంధ సంఘాలు,సహకార సంఘాల సభ్యులు ఆత్మీయులు శ్రేయోభిలాషులు, తదితరులు పాల్గొన్నారు.

# నేటినుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు

- జిల్లా వ్యాప్తంగా పరీక్షలు రాయనున్న 36,222 మంది విద్యార్థులు
- 57 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- ఐదు నిమిషాల వరకు సడలింపు




**నిజామాబాద్ ప్రతినిధి, మార్చి 4 (నినాదం న్యూస్) :** ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 36,222 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, వీరి కోసం మొత్తం 57 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 5వ తేదీ నుండి ప్రారంభమయ్యే పరీక్షలు 25వ తేదీ వరకు కొనసాగుతాయని , ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. అయితే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల సందర్భంగా ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను అనుమతించని విషయంలో బోర్డు ఐదు నిమిషాల వరకు సడలింపు ఇచ్చింది. జిల్లాలో మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 15,053కాగా, ఒకేషనల్ విద్యార్థులు 2736 మొదటి సంవత్సరం మొత్తం 17,789విద్యార్థులు హాజరు కానున్నారు. రెండవ సంవత్సరం జనరల్ రెగ్యులర్ 13,944 మంది విద్యార్థులు, ప్రైవేటు(సప్లిమెంటరీ) 2128 మంది విద్యార్థులు, ఒకేషనల్ రెండవ సంవత్సరం రెగ్యులర్ 2042 మంది విద్యార్థులు, ప్రైవేటు 319మంది విద్యార్థులు హాజరుకానున్నారు. జిల్లాలో 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో,రెండు ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు, రెండు సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు, 7 మోడల్ జూనియర్ కళాశాలలు, రెండు మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు, ఒక బీసీ వెల్ఫేర్ జూనియర్ కళాశాల, 26 ప్రైవేటు జూనియర్ కళాశాలలు, ఒక ప్రభుత్వ హై స్కూల్ ను పరీక్ష కేంద్రాలుగా కేటాయించినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి తిరుమలపుడి రవికుమార్ తెలిపారు.

**సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు**

జిల్లాలోని 57 పరీక్ష కేంద్రాలను ఎప్పటికప్పుడు పరీక్ష కేంద్రాలలో మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 8 మంది సిటింగ్ స్కాడ్ లు, ఒక హైపవర్ కమిటీ, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు ముగ్గురు తనిఖీలు చేస్తూ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఎలాంటి చీటీలు తీసుకొచ్చిన మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు అవుతాయని స్పష్టం చేశారు. విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని బాగా చదువుకొని పరీక్షలకు హాజరుకావాలని డిఐఈవో తిరుమలపూడి రవికుమార్ సూచించారు. జిల్లా పోలీసు యంతాంగం, రెవెన్యూ యంత్రాంగం, పోస్ట్ ఆఫీస్, విద్యుత్ శాఖ , వైద్య ఆరోగ్య శాఖ, ఆర్టీసీ అధికారుల సమన్వయంతో ఈ పరీక్షల నిర్వహణను సజావుగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని తెలియజేశారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకునే విధంగా ఆర్టీసీ బస్సులను నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని ఇంటర్ విద్య అధికారి తెలియజేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ అధికారులు కృషి చేస్తున్నారని తెలియజేశారు. అలాగే వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రతి పరీక్షా కేంద్రంలో ఆశా వర్కర్ లు, ఏఎన్ఎం ల ఆధ్వర్యంలో ఆరోగ్య సేవలు అందించడానికి ఏర్పాట్లు పూర్తి చేస్తారని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తెలియజేశారు. మున్సిపల్, గ్రామ పంచాయతీ అధికారులు పరీక్షా కేంద్రాలను శుభ్రం చేయించడంతో పాటు మంచినీటి వసతులు కల్పించేందుకు ఏర్పాటు చేశారని అన్నారు. జిల్లా పోస్ట్ విభాగం, విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో అవసరమైన సేవలను వినియోగించుకుంటున్నామన్నారు.

# మిర్చి కొనుగోళ్లలో.. రైతులను మోసం చేస్తే కఠినచర్యలు

- మార్కెట్‌లో జరుగుతున్న కొనుగోళ్ల జాప్యంపై ఆగ్రహం
- మిర్చిని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని అధికారులకు అదేశాలు
- ఖమ్మం మిర్చి యార్డును ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ఖమ్మం, మార్చి 04 నినాదం న్యూస్):** నాణ్యమైన మిర్చికి ధర తగ్గించి, మిర్చి కొనుగోలు విషయమై రైతులను ట్రేడర్లు మోసం చేస్తే ఏమాత్రం ఉపేక్షించకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ హెచ్చరించారు. నాణ్యత మేరకు మిర్చికి ధర రావడం లేదని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో మిర్చి మార్కెట్ ను మంగళవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిర్చి యార్డును కలియతిరిగి కొనుగోళ్ళను పరిశీలించారు. గిట్టుబాటు ధరకే మిర్చి కొనుగోలు చేయాలని వ్యాపారులకు కలెక్టర్ సూచించారు. తేమశాతం కోసం మిరపకాయలు పట్టుకుని నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, సరుకు బాగానే ఉన్నా తక్కువ ధర చెల్లిస్తున్నందుకు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యతను వ్యాపారులు ఎలా నిర్ధారిస్తారని అధికారులను ప్రశ్నించారు. మార్కెట్?కు వచ్చిన కలెక్టర్ తో మిర్చి రైతులు, మిర్చి ధరలు గణనీయంగా తగ్గిస్తున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. జెండా పాటకు వేలం వ్యత్యాసంతో వ్యాపారులు మిర్చి కొనుగోళ్లు చేస్తున్నారు. దీంతో చాలా నష్టాలు వస్తున్నాయని రైతులు తెలిపారు. రైతులతో మాట్లాడిన కలెక్టర్ వారికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ మాట్లాడుతూలి మిర్చి కొనుగోళ్లలో జాప్యం చేయకూడదని, అన్నదాతలకు వెంటనే చెల్లింపులు చేయాలని వ్యాపారులకు అన్నారు. మిర్చి పంట కొనుగోళ్లు సాగుతున్న తీరుపై, జెండా పాటకు, రైతుకు దక్కే ధరకు పొంతన లేదని, రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదంటూ అధికారులను హెచ్చరించారు. నాణ్యత పేరుతో రైతులను ఖరీదుదారులు నష్ట పరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వారి లైసెన్సలను కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రతి బస్తా కొనుగోలు అయ్యే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ విషయంలో రైతులెవరూ ఆందోళన చెందవద్దని ధైర్యపరిచారు. రైతులకు ఇబ్బంది కలిగించే చర్యలు ఏవరు చేసిన ఉపేక్షించబోమని అన్నారు. అన్నదాతలకు న్యాయం జరిగేలా అధికారులు వారికి అండగా ఉండాలని ఆదేశించారు. ఖమ్మం మార్కెట్ లో రైతులకు గిట్టుబాటు ధర అందేలా నిరంతరం పర్యవేక్షిస్తామని అన్నారు. వ్యాపార లావాదేవీలను, సరుకు నాణ్యతను మార్కెట్ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. ఇతర శాఖలను సమన్వయం చేసుకుని, రైతుకు సరైన ధర లభించేలా చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ. అలీమ్, మార్కెట్ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, అధికారులు, తదితరులు ఉన్నారు.


# ఘనంగా మాజీ మంత్రి వెంకటరెడ్డి వర్ధంతి



**వైరా, మార్చి 04 (నినాదం న్యూస్):** వంగత మాజీ మంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డి 09 వ వర్ధంతి సందర్భంగా వైరా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ.. రాంరెడ్డి వెంకటరెడ్డి జిల్లాలో మంత్రిగా వుండి ప్రజల మన్ననలు పొందిన గొప్పనాయకుడన్నారు. అదే విధంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ. స్వర్గీయ రాంరెడ్డి వెంకటరెడ్డి పాత లింగాల గ్రామ సర్పంచ్ స్థాయి నుంచి ఎల్ ఎం బి డైరెక్టర్ డిసిసి ఉపాధ్యక్షులుగా మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి మన్ననలు పొందిన గొప్ప నాయకుడని ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మొక్క శేఖర్ గౌడ్ మాజీ మార్క్ ఫైడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ కట్ల రంగారావు సూరంపల్లి రామారావు మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ వైరా నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు పమ్మి అశోక్ పాలేటి నరసింహారావు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ ధర్నా రాజశేఖర్ ఆది ఆనందరావు జవ్వాజి నాగరాజు కోటేష్ నాయక్ తోటకూర గోపి షేక్ జాన్ పాషా (గన్ను)ధరావత్ శంకర్ నాయక్ తెళ్ళురి వీరయ్య ఐఏఎస్ నాగేశ్వరరావు మెరుగు వెంకటి వాంకుడోత్ బిక్య రామ్ లాల్ నారపోగు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశ్నించే గొంతుక అవుతారని.. కొమురయ్యను గెలిపించారు

- ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



**నిజామాబాద్ ప్రతినిధి, మార్చి 4 (నినాదం న్యూస్) :** తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో ఉపాధ్యాయ వందన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం నగరంలోని ప్రగతి నగర్ పాటిదార్ భావన్ లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇందూర్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధన్ పాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పట్ల శాసనస మండలిలో ప్రశ్నించే గొంతుకగా మొదటి ప్రాధాన్యతతో కొమురయ్య ను గెలిపించిన ఘనత ప్రతి ఒక్క ఉపాధ్యాయునికి దక్కుతుందన్నారు. మేధావులైన ఉపాధ్యాయులు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక చెంప పెట్టు లాంటిది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలు, హామీలు తుంగలో తొక్కి మాటలతో పూట గడుపుతున్న రేవంత్ సర్కార్ కు తగిన గుణపాఠం జరిగిందన్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల గెలుపే రేపు తెలంగాణలో బిజెపి ప్రభుత్వం ఏర్పడటానికి పునాది అవుతుందన్నారు. ఈ విజయంలో కష్టపడ్డా టీపీయూఎస్ సంఘ నాయకులకు, బిజెపి కాషాయ కార్యకర్తలకు, ఉపాధ్యాయులకు మేధావులందరికి పాదాభివందనం తెలియజేసారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో కష్టపడి పని చేసి బిజెపిని గెలుపు దిశగా నడిపించిన ఉపాధ్యాయులను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, తపస్ జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, కొండా ఆశన్న, రెంజర్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కులగణన సర్వే రెమ్యూనరేషన్ చెల్లించాలి

- టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జోగ రాంబాబు



**ఆళ్లపల్లి, మార్చి 4 (నినాదం న్యూస్):** కులగణన సర్వే నిర్వహించిన, ఎన్యుమ రేటర్లకు సూపర్‌వైజర్లకు, రెమ్యూనరేషన్ నేటివరకు అందలేదని టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జోగ రాంబాబు ఓ ప్రకటనలో మంగళవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వివిధ జిల్లాలకు నిధులు మంజూరు చేసినప్పటికి రెమ్యూనరేషన్ అందక పోవటం వలన సర్వే నిర్వహించిన ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు మానసికంగా ఇబ్బంది పడుతున్నారని, తక్షణమే అధికారులు స్పందించి రెమ్యూనరేషన్ చెల్లింపులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## శ్రీపాల్‌రెడ్డి విజయంతో సంబరాలు



**మహాముత్తారం, మార్చి 03(నినాదం న్యూస్):** నల్లగొండ-వరంగల్-ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పింగిలి శ్రీపాల్ రెడ్డి విజయం సాధించడం పట్ల జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం ములుగుపల్లి ఉన్నత పాఠశాలలో పిఆర్టియు మండల కమిటీ ఆధ్వ ర్యంలో సంబరాలు జరుపకు న్నారు. ఉపాధ్యాయులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కామిడీ సతీష్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి రాజేంద్రప్రసాద్ లు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో పీఆర్టియు ముందంజలో ఉంటుందని, ఈ క్రమంలో ఉపాధ్యాయ లోకం అధిక మెజార్టీతో శ్రీపాల్ రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించి శాసనమండలికి పంపించారన్నారు. త్వరలోనే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని పిఆర్టియు మండల ప్రధాన కార్యదర్శి అజ్మీర రవీందర్ అన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాశం సంజీవరెడ్డి, మండల శాఖ కార్యదర్శి కొంకల గీతారెడ్డి హనుమంతు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే మహాముత్తారం కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో కూడా స్వీట్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రామ్ సింగ్, జయ మధుకర్ రావు, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

## మండల అధ్యక్షుడు అంబేద్కర్‌కు సన్మానం



**నర్సంపేట, మార్చి 4 (నినాదం న్యూస్):** బీజేపీ నర్సంపేట రూరల్ మండల అధ్యక్షులు తనుగుల అంబేద్కర్ పుట్టినరోజు సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి శాలువాతో బుధవారం సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో పార్లమెంట్ కో కన్వీనర్ కట్ల రాంచేందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ గంగిడి మహేందర్ రెడ్డి,నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్, ఖానాపూర్ అధ్యక్షులు రాధారపు అశోక్,సీనియర్ నాయకులు అన్న లింగయ్య,నూతనకంటి శ్రీనివాస్, తాళ్లపెల్లి రాము, బీజేవైఎం మాజీ నియోజకవర్గ కన్వీనర్ జూలూరి మనీష్ గౌడ్, జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యాదర్శి అచ్చ దయాకర్,బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు పల్లకొండ శ్రీను,బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఎర్ర రాజు, బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ సామల ప్రవీణ్ కుమార్,బత్తుల నాగరాజుతదితరులు పాల్గొన్నారు

## ఇసుక క్వారీల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

### -ఆదివాసీ సేన డిమాండ్



**మంగపేట, మార్చి 04 ( నినాదం న్యూస్ ) :** మండలంలోని చుంచుపల్లి గ్రామంలోని చెంచు లక్ష్మి ఎస్టి ఇసుక క్వారీ సొసైటీ, నరసింహ స్వామి ఎస్టీ ఇసుక క్వారీ సొసైటీలకు సంబందించిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఆదివాసీ సేన మండలం అధ్యక్షులు పోలేబోయిన ఆదినారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని చుంచుపల్లిలో స్థానిక విలేకరులతో పోలేబోయిన ఆదినారాయణ మాట్లాడుతూ చుంచుపల్లి గ్రామంలోని ఒకటవ నెంబర్ ఇసుక రీచ్ కు సంబంధించి 2022 సంవత్సరంలో ఒక లక్ష క్యూ మీటర్లకు గాను ఒక్క క్యూబిక్ మీటర్ కు 220 రూపాయలు అందులో గిరిజన సొసైటీకి ఒక్క క్యూబిక్ మీటర్ కు 40 రూపాయలు, రైజింగ్ కాంట్రాక్టు కు ఒక్క క్యూబిక్ మీటర్ కు 180 రూపాయలు చొప్పున టీజీఎండీసీ చెల్లించాలని మొత్తం ఒక లక్ష క్యూబిక్ మీటర్లకు గిరిజన సొసైటీకి 40 లక్షల రూపాయలు రావాల్సి ఉందని అన్నారు. అదే విధంగా 2023 %-% 2024 సంవత్సరంకు సంబంధించి మూడు, నాలుగు నెంబర్లకు సంబంధించి ఒక్కో క్వారీకి 40 లక్షల చొప్పున రెండు క్వారీలకు మొత్తం 80 లక్షల రూపాయలు రావాల్సి ఉందని అన్నారు. అదే విధంగా ఐదవ నెంబర్ ఇసుక రీచ్ కు సంబంధించి నరసింహ స్వామి ఎస్టీ సొసైటీకి 40 లక్షల రూపాయలు రావాల్సి ఉందన్నారు. మొత్తంగా నాలుగు ఇసుక క్వారీలకు సంబందించి సుమారుగా ఒక కోటి 60 లక్షలు రావాల్సి ఉందన్నారు. ఇట్టి బిల్లులను టీజీఎండీసీ హైదరాబాద్, స్థానిక ఏటూరునాగారం టీజీఎండీసీ పిఓ పర్యవేక్షణలో నాలుగు ఇసుక క్వారీలకు సంబందించిన వే బిల్లులు, సంబందిత పత్రాలను పరిశీలించి గిరిజన సొసైటీలకు, రైజింగ్ కాంట్రాక్టర్లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని పోలేబోయిన ఆదినారాయణ కోరారు. ఇసుక క్వారీలకు సంబంధించి ఈసీ పర్మిషన్లు గడువు దాటి సంవత్సరం అయిందని, నూతనంగా ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వం చొరవ తీసుకొని చుంచుపల్లి గ్రామంలోని గిరిజన సొసైటీలకు రావలసిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఆదినారాయణ కోరారు. పెండింగ్ బిల్లులు అందితే గిరిజనులు ఆర్థికంగా ఎదుగుతారని ఈ విషయంపై స్థానిక మంత్రి , ఏటూరునాగారం టీజీఎండీసీ పిఓ, సంబంధిత అధికారులు స్పందించి వెంటనే పెండింగ్ బిల్లులు వచ్చేలా చూడాలని ఆదినారాయణ కోరారు.

## ఒక్క హామీని నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం



**నర్సంపేట, మార్చి 4(నినాదం న్యూస్):** రైతులకు ఇచ్చిన ఒక్క హామీ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు.నర్సంపేట బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.గత రెండు నెలలుగా రైతులకు చెల్లించవలసిన 438 కోట్ల వడ్ల బోనస్ ఎగవేతకు కుట్ర చేస్తున్నదన్నారు.రైతులు బోనస్ పైసలు అడుగుతున్నారని వడ్ల కొనుగోలు కేంద్రాలను బ్లాక్ మెయిల్ చేస్తూ , కౌలు రైతుల విచారణ పేరు మీద కాలయాపన చేస్తున్నారన్నారు.నర్సంపేట నియోజకవర్గానికి మంజూరైన రెండో విడత పంట నష్టపరిహారం 2630 మందిరైతులకు డబ్బుల చెల్లింపు జరగలేదని ఆరోపించారు.రెండు లక్షల లోపు రైతుల రుణమాఫీ ఇంకా అసంపూర్తిగానే మిగిలి ఉందన్నారు.లి రూ.750 కోట్లకు పైగా బకాయిలు పెండింగ్లో పెట్టిందన్నారు రేవంత్ రెడ్డి అసమర్థ పాలన వల్ల ఇప్పటికే 476 మంది రైతులు మరణించారని , మరణించిన రైతులకు రైతు బీమా కూడా ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు.రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక రూ.750 కోట్ల బకాయిలు పెండింగ్ పెట్టాడన్నారు.

## సూర్యని కలిసిన రచయిత సురేష్



**నర్సంపేట, మార్చి 4(నినాదం న్యూస్):** హైదరాబాద్ లోని ప్రజా భవన్ లో పంచాయతీ రాజ్ రాష్ట్ర మంత్రి సీతక్క కుమారుడు సూర్య ని యువ సాహిత్య రత్న, ప్రముఖ సామాజిక రచయిత కడియాల సురేష్ కుమార్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం సూర్య మాట్లాడుతూ మంత్రి సీతక్క జీవిత చరిత్ర పై సురేష్ కుమార్ రాసిన ఆదివాసుల ఆత్మ బంధువు సీతక్క పుస్తకం చాలా బాగుంది అని ఆనందం వ్యక్తం చేసారు.సీతక్క ఉద్యమాలు, పోరాటాలు ప్రజా జీవితం పై సురేష్ కుమార్ రాసిన పుస్తకం చరిత్ర లో ఓ మైలు రాయిలా నిలిచి పోతుంది అని అన్నారు అనంతరం సురేష్ కుమార్ ని ప్రశంశించారు. పుస్తకం లో సీతక్క కుమారుడు సూర్య గురించి కూడా ప్రస్థావించడం చాలా గర్వంగా ఉంది అని అన్నారు. చిన్న వయసులో మంచి రచనలు చేస్తున్న సురేష్ కుమార్ భవిష్యత్తులో మరిన్ని రచనలు చేయాలని ప్రోత్స హించారు రచయిత లకి కళాకారులకి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది అని తెలిపారు.

## ధార్మిక పరిషత్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



**సూర్యాపేట ప్రతినిధి మార్చి 4 (నినాదం న్యూస్) :** దేవాలయాల అభివృద్ధికి అర్చకుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ధార్మిక పరిషత్ ఏర్పాటు చేయాలని తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేందర్ శర్మ డిమాండ్ చేశారు .మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ అన్నపూర్ణ సహిత విశ్వనాథ స్వామి దేవాలయంలో సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అర్చక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి 70 కోట్ల నిధులు కేటాయించాలని గుర్తు చేశారు. పదేళ్లలో సేకరించిన 210 కోట్ల రూపాయలకు 14 కోట్లు వడ్డీ వస్తున్న అందులో 7 కోట్లు కూడా అర్చకుల సంక్షేమానికి ఖర్చు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి అర్చకుడికి ఐదు లక్షల వరకు ఇన్సూరెన్స్ కేటాయించాలని అన్నారు.

## 9 నుంచి కొడవటంచలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

- భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి, మార్చి 4 (నినాదం న్యూస్):** శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం, కొడవటంచలో ఈ నెల 9 నుండి 26వ తేది వరకు జరుగనున్న బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పై రెవెన్యూ, పంచాయతి రాజ్, విద్యుత్, వైద్య, ఆర్టీసీ, ఆర్ డబ్ల్యుఎస్, సింగరేణి, ఆర్ అండ్ బి, సమాచార, దేవాదాయ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సమయములో ప్రత్యేక విధులు నిర్వహణకు గ్రామ సిబ్బందిని డిప్యూట్ చేసి, పారిశుద్యం, పరిశుభ్రత పనులు చేపట్టాలని ఆదేశించారు. దేవాలయాన్ని విద్యుద్దీకరణ చేయడంతో పాటు పూలతో అందంగా ముస్తాబు చేయాలని సూచించారు. దేవాలయ ఆవరణలో సెంట్రల్ లైటింగ్ లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బ్రహ్మోత్సవాల రోజుల్లో దుమ్ము లేవకుండా భక్తుల సౌకర్యార్థం వాటర్ ట్యాంకర్లు ఏర్పాటు ద్వారా నీళ్లు చల్లే పనులు చేపట్టాకని తెలిపారు. బ్రహ్మోత్సవ రోజుల్లో భక్తుల సౌకర్యార్థం గ్రామంలోని అన్ని రహాదారుల్లో వీధి లైట్లు ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే చెరువు వైపు, పార్కింగ్ స్థలాలు, భక్తుల వుండే జాతర స్థలాలలో తాత్కాలిక లైట్లు ఏర్పాటు చేయాలన్నారు.జాతరకు వచ్చే కొడవటంచ బైపాస్, రేపాక కొడవటంచ రోడ్, గూడప్పల్లి-కొడవటంచ దారులలో అడ్డంగా ఉన్న పొదలు ముళ్ళ పొదలు తొలగించి, మొరం పోసి గుంతలు పూడ్చు పనులు పూర్తి చేయాలని సూచించారు. తాత్కాలిక బస్టాండ్, భక్తుల వాహన పార్కింగ్ స్థలాలను గుర్తించి భక్తులకు అందుబాటులోకి తేవాలని తెలిపారు. బ్రహ్మోత్సవాల సమయంలో భక్తుల సౌకర్యార్థం త్రాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. జాతర రోజులలో మిషన్ భగీరథ మంచినీరు సరఫరా చేయాలని, నీళ్ల ట్యాంకుల దగ్గర భక్తుల వాడిన నీరు భూమిలో ఇంకిపోయేందుకు ఇంకుడుగుంతలు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మహిళలు సౌకర్యార్థం స్నాన ఘట్టాలు వద్ద బట్టలు మార్చుకొనే గదులు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పా టు చేయాలని తెలిపారు. భక్తుల రద్దీని అనుసరించి తగు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాల న్నారు. స్వామివారి దర్శనం నిమిత్తం క్యూలైన్ వద్ద వీఐపీ లు వచ్చినప్పుడు ప్రోటోకాల్ ప్రకారం దర్శనం కల్పించుట, కళ్యాణం జరుగు రోజు తేది: 10-03-2025, బండ్లు తిరుగు రోజు 14-03-2025 (బోనములు, పెద్ద రథం, ఎడ్ల బండ్లు, ప్రభ బండ్లు, ఇతర వాహనాలు తిరుగు) సమ యంలో,మ గజవాహనముల సమయంలో ప్రశాంతంగా జరుగుటకు తగు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. జాతర సమయం లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా శాంతి భద్రతలకు భంగం కలుగకుండా పర్యవేక్షించుటకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. శ్రీ స్వామివారి బ్రహ్మోత్సవముల సందర్భంగా ఎటువంటి ఆటంకం కలగకుండా 24 గంటలు నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. భక్తులు అధిక సంఖ్యలో ఉండు ప్రదే శాలలో లైటింగ్ కొరకు అవసరం ఉన్నచోట క్రొత్త పోల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. బ్రహ్మో త్సవాల రోజులలో భక్తుల సౌకర్యార్థం అత్యవసర వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అత్యవసర మందులు, వైద్య సిబ్బంది 24 గంటలు భక్తులకు అందుబా టులో ఉండే విధముగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వాటర్ ట్యాంకులు, త్రాగునీటి వనరులను క్లోరినేషన్ చేయాలని తెలిపారు.

## 108సేవల వినియోగంపై అవగాహన పెంచాలే

### - పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా. వినయ్



**మల్హర్, మార్చి 04, (నినాదం న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలో నూతనంగా ఏర్పాటైన 108 అంబులెన్స్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వినయ్ సూచించారు. మంగళవారం మండలంలోని తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 108 అంబులెన్స్‌లో అత్యాధునిక వైద్య పరికాలు, టెక్నాలజీ గురించి పూర్తిగా తెలుసుకోవాలన్నారు. అలాగే 108 , 102 సేవలతో పాటు, నియో నటల్ సేవలు ఎఫ్ హెచ్ సి (పార్థివ వాహనం) సర్వీస్ లను ఉపయోగించుకునేలా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 108 ఉమ్మడి జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ పాటి శివకుమార్, భూపాలపల్లి జిల్లా మేనేజర్ మెరుగు నరేష్ యాదవ్, పీఎస్‌సీ హెల్త్ అసిస్టెంట్ నాగరాజు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, 108 సిబ్బంది, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, మహేష్ ,పైలట్ సంపత్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లలో అవకతవకలు జరిగితే చర్యలు తప్పవు

- పైసలు వసూలు చేస్తే సహించేది లేదు.
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- ఇదిరమ్మ కమిటీ సభ్యులతో సమీక్ష



**వరంగల్ బ్యూరో, (నినాదం న్యూస్ ):** ప్రభుత్వ పథకాల అమలులో లీడర్ అయినా క్యాడర్ అయినా పైసా వసూలు చేస్తే ఉపేక్షించేది లేదని, ఇందిరమ్మ ఇళ్లలో అవకతవకలు జరిగితే చర్యలు తప్పవని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇందిరమ్మ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల నియమావళి ముగుస్తున్న క్రమంలో నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు అయ్యాయని, మంజూరు కొరకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఎమ్మెల్యే నాయిని తెలిపారు. ప్రతి డివిజన్ పరిధిలో ఉన్న నిజమైన అర్హులను ఎంపిక చేసి, ఇందిరమ్మ ఇళ్లు పథకంలో ఉండేలా ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి నాయకులు వార్డులలో ప్రతిరోజూ పర్యటించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజలకు,నాకు నాయకులు వారధిగా ఉంటూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఎక్కడైనా నిర్లక్ష్యం చేసినా, పైసలు వాసులు చేసినా సహించేది లేదు.. అని అన్నారు. గడిచిన 14 నెలల కాలంలో జరిగిన అభివృద్ధి,రాబోయే రోజుల్లో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ నేతలు అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. సమస్యాత్మక గొడవలు, భూ పంచాయితీ సమస్యలపై నాయకులు ఆసక్తి చూపుతున్నారని మండిపడ్డారు. తన దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు పోతుల శ్రీమన్, మామిండ్ల రాజు, సయ్యద్ విజయ శ్రీ రాజాలి, మానస రాంప్రసాద్, నెక్కొండ కవిత కిషన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నాయిని లక్ష్మా రెడ్డి, అంబేద్కర్ రాజు, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు జనార్దన్, జిల్లా ఆర్టీఏ సభ్యులు పల్లకొండ సతీష్, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళా నేతలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నిందితులను పట్టుకోవడంలో పోలీస్ జాగిలం కీలకం

### వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ



**వరంగల్ బ్యూరో, (నినాదం న్యూస్ ):** నేరాలకు పాల్పడిన నిందితులను పట్టుకోవడం పోలీసు జాగిలాలు కీలకంగా నిలుస్తున్నాయని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు నూతనంగా వచ్చిన పోలీస్ జాగిలాలను వరంగల్ పోలీస్ కమిషనర్ మంగళవారం పరిశీలించారు. గత నెల 28న మొయినాబాద్‌లోని పోలీస్ జాగిలాల శిక్షణా కేంద్రంలో ఎనిమిది నెలల శిక్షణను పూర్తి చేసుకొని వచ్చిన ఐదు పోలీస్ జాగిలాలు వరంగల్ కమిషనరేట్ పోలీస్ డాగ్ స్క్వాడ్‌లో చేరి విధులు నిర్వహించేందుకు సిద్ధమయ్యాయి. ప్రేలుడు పదార్థాలను పసిగట్టే ఈ ఐదు జాగిలాల్లో మూడు బెల్జియన్ మాలినోస్, రెండు గొల్డెన్ రీట్రీవర్ జాతులకు చెందిన జాగిలాలు, వీటికి రానా, జానీ, దయానా, మాక్స్, కైరోగా నామకరణం చేశారు. నూతనంగా వచ్చిన ఈ జాగిలాలను సంబంధించిన పూర్తి వివరాలను వరంగల్ పోలీస్ కమిషనర్‌కు హ్యాండ్లర్లు వివరించారు. గతంలోని జాగిలాలు ఎన్నో ప్రేలుడు పదార్థాలను పసిగట్టడంలో విజయం సాధించాయని ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గుర్తు చేసారు. నూతనంగా వచ్చిన జాగిలాలకు మెరుగైన వసతిని ఏర్పాటు చేయాల్సిందిగా సిపి సంబంధిత అధికారులను అదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు డిసిపి సురేష్‌కుమార్, ఆర్.ఐ శ్రీనివాస్, డాగ్ స్క్వాడ్ ఇంచార్జ్ హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్‌తో పాటు హ్యాండ్లర్లు రాజేష్ కుమార్, వెంకన్న, సురేష్, దిలిప్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ హయాంలోనే మైనారిటీలకు పెద్దపీట

- జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్



**వరంగల్ బ్యూరో, (నినాదం న్యూస్ ):** బీఆర్ఎస్ హయాంలోనే కేసీఆర్ మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారని మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా సిటిజెన్ ఫంక్షన్ హాల్‌లో ముస్లిం మహిళలకు మంగళవారం నిత్యావసర సరుకులను ఆయన అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు అబ్బు ఆధ్వర్యంలో ఉచితంగా వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ... తెలంగాణలో సర్వమత సౌభ్రాతృత్వం విలసిల్లుతుందని అన్నారు. మత సామరస్యానికి, పరమత సహనానికి తెలంగాణ నెలవని తెలిపారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో మైనార్టీల కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం జరిగిందని వివరించారు. అల్లా కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించారు. అల్లా బోధించిన ప్రేమ, శాంతి మార్గాల్లో పయనిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నల్లా సుధాకర్ రెడ్డి స్వరూప రాణి, మైనార్టీ నాయకులు ఖుద్దూస్, మహమ్మూద్ బ్రూహాన్, తదితరులు పాల్గొన్నారు.

## 31 నాటికి 25 శాతం రాయితీతో ఎల్ఆర్ఎస్ చేయించుకోండి

### -జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి విజ్ఞప్తి



**వనపర్తి ప్రతినిధి, మార్చి 4 (నినాదం న్యూస్) :** మార్చి 31నాటికి కచ్చా లే అవుట్ లు, ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం కల్పించిన ఎల్.ఆర్.ఎస్ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి విజ్ఞప్తి చేశారు. ఎల్.ఆర్.ఎస్ పై అవగాహన కల్పించేందుకు మంగళవారం వనపర్తి మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్లు, టౌన్ ప్లానర్ లు, లే అవుట్ రైటర్ లు, బిల్డర్లతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. 2020 తర్వాత కచ్చా లేఔట్ చేసిన వారు..వాటిలో ప్లాట్ లు తీసుకున్నవారు..జిల్లాలో 29 వేల మంది ఎల్.ఆర్.ఎస్ కొరకు దరఖాస్తు చేసుకున్నారని, కానీ ఇప్పుడు క్రమబద్ధీకరణ చేసుకునేందుకు కేవలం 38 మంది మాత్రమే ముందుకు వచ్చి డబ్బులు చెల్లించడం జరిగిందన్నారు. ఇప్పటికే జిల్లాలోని అయిదు మున్సిపాలిటీల ద్వారా దాదాపు 25 వేల మందికి నోటీస్ లు జారీ చేసినప్పటికీ ఫోన్ నెంబర్లలో తేడాలు, చిరునామాల్లో తేడాలు ఉండటం వల్ల అవి ఇదివరకే దరఖాస్తు చేసుకున్న వారికి చేరడం లేదన్నారు.లే అవుట్ లు చేసిన వారు, ఓనర్లు, రైటర్ లు, బిల్డర్లు ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి సమాచారం, అవగాహన కల్పించి సకాలంలో ఎల్.ఆర్.ఎస్. చేయించుకునే విధంగా బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అవగాహన లేకపోవడం లేదా సమాచారం లేకపోవడం వల్ల సద్వినియోగం చేసుకోకుంటే రేపటినాడు ఎప్పుడైనా ఎల్.ఆర్.ఎస్ ఆమోదం లేని ప్లాటుపై ఇల్లు కట్టుకోవాలంటే అప్పటి ప్లాట్ వాల్యూ పై ప్రో రేటా ఫీజు తోపాటు14 శాతం పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని తెలియజేశారు. నిషేధిత స్థలం లేదా చెరువు, కుంట కింద లేకుంటే ప్లాట్ యజమాని ఫోన్ కు నేరుగా ఎంత డబ్బులు కట్టాలో సమాచారం వెళుతుందన్నారు. ఏదేని కారణం చేత ఎల్.ఆర్.ఎస్.తిరస్కరణకు గురి అయితే చెల్లించిన డబ్బుల నుంచి 10 శాతం ప్రాసెసింగ్ ఫీజు కింద మినహాయించుకొని మిగిలిన 90 శాతం డబ్బులు తిరిగి ప్లాటు యజమాని ఖాతాలో జమ చేయడం జరుగుతుందని వివరించారు. ఎల్.ఆర్.ఎస్ ఉంటే ప్లాటుకు రక్షణ ఉంటుందని, ఎవరు అక్రమించుకోడానికి అవకాశం ఉండదన్నారు.


## మేదరులకు హస్తకళలపై శిక్షణ




**ములుగు ప్రతినిధి, (నినాదం న్యూస్):** ములుగు జిల్లా అటవీశాఖ కార్యాలయంలో ఎస్ అండ్ టి సిరి వాలంటరి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని మేదరి కులస్తులకు అటవీ శాఖ ఆధ్వర్యంలో చేతి వృత్తులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హార్నమెంటల్ (బాంబో) సామాగ్రి ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం లభించే విధంగా వస్తువులు తయారు చేయడంపై మధ్యప్రదేశ్ కి చెందిన ఇద్దరు శిక్షకుల ద్వారా 30 మంది ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ములుగు డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ పాల్గొని చేతివృత్తుల ద్వారా చేసే వస్తువులకు సమాజంలో విపరీతమైన ఆదరణ పెరిగిందని దీనిని మేదర కులస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీనికోసం ప్రభుత్వం ద్వారా సహాయం చేయడం జరుగుతుందని, దీంతో చేతి వృత్తుల వారికి సమాజంలో గౌరవ మర్యాదలతో పాటు ఆదాయ వనరులు కూడా పెరుగుతాయని ఆయన తెలిపారు. నెలరోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఇవ్వడంతో పాటు ఇక్కడ తయారు చేసిన వస్తువులను స్టాళ్ళ రూపంలో మార్కెట్లో అమ్మడం కోసం ప్రభుత్వం ద్వారా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ డోలి శంకర్, ఎఫ్బిఓ శ్యామ్ సుందర్, శివ కృష్ణ తో పాటు ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి నిరంతర కృషి

### -ప్రణవ గ్రూప్ చైర్మన్, బూరుగు రవికుమార్




**చింతపల్లి, మార్చి 4 ( నినాదం న్యూస్) :** గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయడమే తమ ట్రస్టు లక్ష్యమని ప్రణవ గ్రూప్ చైర్మన్ బూరుగు రవికుమార్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు, పాఠశాలలలో చదువుతున్న 589 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు సిద్ధమవ్వడానికి సైకాలజిస్ట్ ల చేత మెలకువలను నేర్పించడానికి మండల కేంద్రంలోని సాయి సుమంగళి గార్డెన్స్ లో మండల విద్యాధికారి నీరుడు అంజయ్య అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను ఉన్నత శిఖరాలను చేర్చడానికి తమ చారిటీ ట్రస్టు నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. రానున్న పదవ తరగతి పరీక్షలలో జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, స్థానాలు పొందిన విద్యార్థులకు 5 లక్షల రూపాయలను అందజేస్తామని హర్షధ్వానాల మధ్య ఆయన ప్రకటించారు. పరీక్షలకు విద్యార్థులు భయపడరాదని ఇష్టంగా చదివి ఉన్నత స్థాయికి ఎదగడానికి కష్టపడాలన్నారు. ప్రధానంగా మంచి మిత్రులతో కలిసి, మంచి అలవాట్లతో, క్రమశిక్షణతో, శ్రద్ధగా చదివినట్లయితే ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగగలడని ఆయన అన్నారు. అనంతరం ఆయన 589 మంది విద్యార్థులకు పరీక్షలకు సంబంధించిన ప్యాడ్, పెన్నులు, పెన్సిల్లు, తదితర సామాగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సైకాలజిస్ట్ ట్రైనర్లు పుట్నం రామ్కమల్ ,సంధ్యారాం, శరత్ చంద్ర, శేషులు పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలో సమగ్రంగా హాస్యోక్తులతో వివరించారు. అనంతరం విద్యార్థులకు భోజన వసతిని కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ ముచ్చర్ల యాదగిరి, మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రామావత్ లక్ష్మి, పద్మా చారి, నాగేశ్వరరావు, అనంత్ రెడ్డి, కృష్ణవేణి, సురేందర్ లతో పాటు ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అంజన్ గౌడ్, శ్రీనివాస్ ,వీరేశం తదితరులు పాల్గొనగా ఉపాధ్యాయుడు నరసింహ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

# కార్యకర్తలే పార్టీకి ఆయువుపట్టు

- కార్యకర్తలను గౌరవించుకుందాం
- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళండి
- ఏఐసీసీ తెలంగాణ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్
- గాంధీభవన్‌లో మెదక్ పార్లమెంట్ సమీక్ష సమావేశంలో మంత్రులు, ముఖ్యనేతలతో కలిసి పాల్గొన్న నీలంమధు ముదిరాజ్



**జిన్నారం /పటాన్‌చెరు, మార్చి 4 (నినాదం న్యూస్):** కార్యకర్తలే పార్టీ కి ఆయువు పట్టని, కార్యకర్తల శ్రమతోనే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఏఐసీసీ తెలంగాణ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ అన్నారు. మంగళవారం గాంధీ భవన్ లో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొని కాంగ్రెస్ నాయకులకు శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సెక్రటరీ విష్ణునాథ్ మంత్రులు దామోదర్ రాజ నరసింహ,కొండ సురేఖ మరియు ముఖ్య నేతలతో కలిసి మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ... కార్యకర్తల కష్టంతోనే అధికారంలోకి వచ్చామన్న విషయాన్ని నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. ప్రతి నాయకుడు కార్యకర్తకు అండగా నిలబడుతూ సంపూర్ణ సహకారం అందించాలని సూచించారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను అభివృద్ధి కార్యక్రమాలను విరివిగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు తీసుకోవాలన్నారు.నాయకులు హైదరాబాద్ నుంచి కదిలి క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ పని చేయాలని ఆదేశించారు. ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.నాయకులంతా విబేధాలు పక్కన పెట్టి కలిసికట్టుగా పని చేసి స్థానిక ఎన్నికలలో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ... మెదక్ పార్లమెంట్ సమీక్ష సమావేశంలో పార్టీ పెద్దలు సూచనలకనుగుణంగా ముందు కు వెళ్తామన్నారు. కార్యకర్తలను గౌరవిస్తూ వారి ప్రతి కష్టసుఖాల్లో అండగా నిలబడి కడుపులో పెట్టి చూసుకుంటానని భరోసా ఇచ్చారు. ఇప్పటికప్పుడు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు చరవేస్తూ ప్రణాళిక బద్ధంగా పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సహకారంతో మెదక్ పార్లమెంట్ పరిధిలో సత్తా చాటుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య నాయకులు నియోజకవర్గ ఇంచార్జిలు, డీసీసీ ప్రెసిడెంట్లు,ఆఫీస్ బేరర్లు తదితరులు పాల్గొన్నారు.

## యువత స్వయంకృషితో ఎదగాలి

- డ్రైక్లీనింగ్ షాప్ ప్రారంభించిన కాటా శ్రీనివాస్ గౌడ్



**జిన్నారం/ పటాన్‌చెరు, మార్చి 4 (నినాదం న్యూస్):** గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారం గ్రామంలో గడ్డమీది రాజు నూతనంగా ఏర్పాటు చేసిన డ్రై క్లీనింగ్ షాప్‌ను పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించి , శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత స్వయం ఉపాధి, అవకాశాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. తాము ఉపాధి పొందడంతోపాటు మరో 10 మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. నాణ్యమైన సేవలతో వినియోగ దారుల మన్ననలను పొందాలన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మాదారం గ్రామంలో అన్ని రకాల వ్యాపారాలకు అనువుగా ఉంటుందన్నారు.స్వయం ఉపాధి మార్గాలు ఎంచుకోవడం ద్వారా కుటుంబానికి ఆసరాగా నిలవ వచ్చని తెలిపారు. ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న గ్రామం, పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మరింత అభివృద్ధి చెందుతుందనిన్నారు.యువత నైపుణ్యాలు పెంపొందించుకొని ఉత్తమ మానవ వనరులుగా తయారుకావాలని సూచించారు. ఎంచుకున్న రంగంలో అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలని సూచించారు. స్వయం ఉపాధి ద్వారా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో కొత్త వ్యాపారాలను ప్రారంభించడం సంతోషకరమనిన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్డే కృష్ణ, ఉపాధ్యక్షులు కాలాల్ రాజు గౌడ్, సుధాకర్ గౌడ్, మాజీ కౌన్సిలర్ శశిధర్ రెడ్డి, సుధాకర్ యాదవ్, సీతారాం సింగ్, సీతారాం యాదవ్, రాజేందర్ సింగ్, కుమార్, లింగం, నరసింహ, రామకృష్ణ,లక్ష్మణ్, కిషోర్, రాజు, నర్సింగరావు,గణేష్, వెంకటేష్ గౌడ్, కృష్ణ, చందు, సంతోష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



**జిన్నారం/ పటాన్‌చెరు, మార్చి 4 (నినాదం న్యూస్):** జిన్నారం మండలం చెట్ల పోతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి పలువురిని ఆకట్టుకున్నారు. పాఠాలు బోధించడంతో పాటు డీఈవోగా, ఎంఈఓగా పాఠశాలను సందర్శించి,పరిశీలించి తనిఖీ నిర్వహించటం అందరిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాకీర్ హుస్సేన్ మాట్లాడుతు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులుగా పాత్ర వహించి పాఠశాలలోని మిగతా విద్యార్థులకు పాటలు బోధించడం అభినందనీయమని అన్నారు. డిఈఓ లోహిత్,ఎంఈఓ నవీన్ కుమార్,ప్రధానోపాధ్యాయులుగా యశ్వంత్ మిగతా విద్యార్థులు సబ్జెక్టుల వారీగా వారి వారి పాత్ర నిర్వహించారు. దీని వల్ల నిజ జీవితంలో కూడా సమాజంలో ఏ విధంగా ఉండాలనే విషయంలో స్వీయ అనుభవం ద్వారా విద్యార్థులకు స్వయంగా తెలుస్తుందని తెలిపారు. విద్యార్థులు అందరూ వారి జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని అది నెరవేర్చుకునే విధంగా కృషి చేయాలని తెలియజేశారు. ముఖ్యంగా పదవ తరగతి చదివే విద్యార్థులకు వారి పై చదువులకు తొలిమెట్టుగా భావించి కష్టపడి చదివి పాఠశాలకు మరియు వారి తల్లిదండ్రులకు పేరు తీసుకొచ్చే విధంగా అందరు ఉత్తీర్ణులు కావాలని పాఠశాల పేరు చిరస్థాయిగా నిలపాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుభాస్కర్, వేణు, జగదీష్, కాశీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఆల్ ది బెస్ట్



**కొడంగల్,మార్చి 05 (నినాదం న్యూస్):** నేటితో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్న సందర్భంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు అంబేద్కర్ యువజన సంఘాల నియోజకవర్గ అధ్యక్షుడు యు.రమేష్ బాబు ఆల్ ది బెస్ట్ చెప్పారు. పరీక్ష సమయానికి ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఎలాంటి అపోహలు, భయభ్రాంతులకు గురికాకుండా పరీక్షలు రాయాలని ఆకాంక్షించారు. ఏడాది పాటు చదువుకున్న జ్ఞానాన్ని,శ్రమను పరీక్షల రూపంలో సత్తాచాటాలనీ, అత్యధిక మార్కులు సాధించి, గురువులకు, తల్లిదండ్రులకు, ప్రాంతానికి మంచిపేరు తేవాలని అన్నారు.

## శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్‌ని కలిసిన సురేష్



**కొడంగల్, మార్చి 05 (నినాదం న్యూస్):** శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ డా"బండ ప్రకాశ్ ను దుద్యాల మండల బిఆర్‌పార్టీ యూత్ కమిటీ అధ్యక్షుడు సురేష్ ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల లగచర్ల ఘటనలో ప్రధాననిందితుడుగా జైలుకు వెళ్ళిన సంఘటనను సురేష్ ముదిరాజ్ బండ ప్రకాష్ కు వివరించారు. తనకు అండగా నిలవాలని,ఈఘటనలో జైలు పాలై జైలు నుంచి విడదలై వారం వారం పోలీసు స్టేషన్ కు హాజరవుతున్న అనేకమంది జీవన విధానాన్ని, వారు పడుతున్న ఇబ్బందులను బండ ప్రకాష్ తో చర్చించారు. అనంతరం బండ ప్రకాష్ మాట్లాడుతూ, లగచర్ల ఘటనలో జైలుపాలైన అందరికీ బెయిల్ మంజూరు చేయడంలో బిఆర్ పార్టీ క్రియాశీలకంగా పనిచేసిందనీ అన్నారు. మీ అందరికీ ఎల్లప్పుడూ పార్టీ పరంగా అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చినట్లు సురేష్ తెలిపారు. పోలీసులు ప్రధాన నిందితుడిగా గుర్తించిన సురేష్ కు యావత్ ముదిరాజ్ లందరూ అండగా ఉంటారని, సురేష్ ఒంటరి కాదని మాలో ఒకడివిగా కాపాడుకుంటామని, అధైర్యపడవద్దనీ భరోసా ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

## పోలీసుల వేధింపుల నుండి..
# రక్షణ కల్పించాలి



**అల్వాల్, మార్చి 4 నినాదం న్యూస్)** అల్వాల్ జిహెచ్‌ఎంసి పరిధిలోని విజయ గణపతి లారీ అసోసియేషన్ అధ్యక్షుడు నల్ల బలవంత రెడ్డి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కలిసి వారి ఆవేదనను విన్నవించుకున్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ ఎస్ఓటి పోలీసు ఆగడాల నుండి రక్షణ కల్పించాలని కోరారు.

## వధూవరులకు ఆశీర్వాదం



**అల్వాల్, మార్చి4 (నినాదం న్యూస్):** ప్రముఖ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సర్వేశ్ యాదవ్ కుమారుడు కోడలు విందు సందర్భంగా నవ దంపతులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, కార్పొరేటర్ రాజ్ జితేంద్ర నాథ్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, నల్ల బలవంత రెడ్డి, కృష్ణ, రఘు, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో.. భారీగా అభివృద్ధి నిధులు





- ఎమ్మెల్యే శ్రీగణేష్

**మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి, (నినాదం న్యూస్):** కంటోన్మెంట్ నియోజకవర్గం ఈస్ట్ మారేడ్‌పల్లి హనుమాన్ టెంపుల్ లైన్, నర్సరీ పార్క్ ఎదరుగా దాదాపు 60 లక్షల రూపాయలతో సిసి రోడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. ఎమ్మెల్యే శ్రీగణేష్ ఎంపి ఈటెల రాజేందర్, నగర మేయర్. గద్వాల విజయలక్ష్మి , డిప్యూటి మేయర్ మేతె శ్రీలతా శోభన్ రెడ్డి శంఖుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ సరైన రోడ్డు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కంటోన్మెంట్ అభివృద్ధికి కట్టుబడి ఉందని ఈ సదర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. కంటోన్మెంట్ ప్రాంతంలో ఎమ్మెల్యే శ ఆహ్వానం మేరకు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనడం సంతోషంగా ఉందని, నగర అభివృద్ధి కి తెలంగాణ ప్రభుత్వం ప్రతి నెలా 300 కోట్ల రూపాయలు కేటాయిస్తుందని మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు డిసి సమ్మయ్య, ఈఈ సుబ్రమణ్యం, ఏఈ చంద్రశేఖర్ తో పాటు, స్థానిక కార్పోటర్, 150 డివిజన్ కు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## జన్ ఔషది కేంద్రంలో మాతృశక్తీకరణ






- గోపు రమణారెడ్డి ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్య భద్రత అవగాహన కార్యక్రమం

**మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి, మార్చి04(నినాదం న్యూస్):** గోపు రమణ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మహిళల శక్తివంతీకరణ, స్వస్థత ఆరోగ్యసేవల, ఆరోగ్యశుభ్రత గురించి అవగాహన కల్పించడం లక్ష్యంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ శిల్ప రెడ్డి బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ మీనాక్షి హాజరైనారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హ్యాండికాప్డ్ నుంచి మహిళా నాయకులు వాలంటీర్లు కూడా పాల్గొన్నారు. మహిళల శక్తివంతీకరణ ఆరోగ్య అవగాహన పరంగా జన్ ఔషధి సువిధా శానిటరీ నాప్కిన్స్, జన్ ఔషధి కప్పులు ఇతర ఆరోగ్య సంబంధిత ఉత్పత్తులు పంపిణీ చేయబడ్డాయి. ఈ కార్యక్రమం మహిళల ఆరోగ్యం సంక్షేమం ప్రాముఖ్యతను గుర్తించి తీసుకున్న ఒక గొప్ప చర్యగా నిలిచింది. ఈ కార్యక్రమం మహిళల ఆరోగ్య సేవలపై చర్చలు, ఉదాత్తమైన చర్చలు భారీ స్పందనతో కూడిన గొప్ప విజయంగా నిలిచింది. గోపు రమణ రెడ్డి సామాజిక సంక్షేమానికి అంకితభావంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి, సమాజానికి సేవ చేయడంలో తన నిబద్ధతను మరోసారి చాటిచూపించారని పలువురు వక్తలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం మహిళల శక్తివంతీకరణ ఆరోగ్య సేవలు అందించే దిశగా పాజిటివ్ మార్పుల సృష్టికి సహకరించే సమూహ సంబంధాల శక్తిని ప్రదర్శిస్తుంది.

## భూగర్భ జలాలను పొదుపుగా వాడుకోవాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**కొల్చారం, మార్చి 4 (నినాదం న్యూస్):** సాగునీటి నిర్వహణ సమర్థవంతంగా అమలు చేయడంలో పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మంగళవారం కూల్చారం మండల వరిగుంతం గ్రామంలో రైతులతో వరి పంటను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి నీటిపారుదలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వేసవికాలంలో వరి పంటకు నీటిపారుదల శాఖ ద్వారా నిర్దేశించబడిన ఆయకట్టుకు సాగునీరు చివరి ఆయకట్టు వరకు అందుతుందని తెలిపారు.. ప్రస్తుతం అయితే వరి పంటకు నీటి కొరత లేదని పేర్కొన్నారు. రైతులకు సాగునీరు సరఫరా పై అవసరమైన సహాయాన్ని అందిస్తున్నట్లు ముఖ్యంగా నీటి నిర్వహణ, మోటార్లకు నిరంతర విద్యుత్ సరఫరా వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరం ఉన్న మేరకు మాత్రమే భూగర్భ జలాలు ఉపయోగించాలని అందుకు వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకుని భూగర్భ జలాలను పొదుపుగా ఉపయోగించాలని చెప్పారు. ఎండకాలంలో పంటలను రక్షించేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటుందని దానికనుగుణంగా పని చేయాల్సిన అవసరం ఉన్నదని కలెక్టర్ వ్యవసాయ అధికారులకు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హాల్‌టికెట్ ఇవ్వకుండ వేధింపులు.. చట్ట విరుద్ధం

- అరవిందో జూనియర్ కాలేజీ యాజమాన్యంపై కోర్టు సీరియస్




**మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి, మార్చి4(నినాదం న్యూస్):** టికెట్ ఇవ్వకుండా విద్యార్థిని వేధిస్తున్న సైనిక్ పురి భవన్స్ అరబిందో జూనియర్ కాలేజీ పై మంగళవారం హైకోర్టు కన్నెర్ర చేసింది. బదిలీ ధ్రువీకరణ పత్రం లేదనే సాకుతో హాల్ టికెట్ ఇవ్వక పోవడం చట్ట విరుద్ధమని కోర్టు వ్యాఖ్యానించింది. తక్షణం హాల్ టిక్కెట్ ఇవ్వాల్సిందిగా కాలేజ్ ప్రిన్సిపాల్ ను ఆదేశించింది. విద్యార్థిని పరీక్షా ఫలితాలు వెలువరించకుండా సీల్డ్ కవర్ లో కోర్టుకు ఇవ్వాలని ఇంటర్మీడియట్ బోర్డును కోర్టు ఆదేశించింది. విద్యార్థి తరుపున హైకోర్టులో ఉచితంగా వాదనలు వినిపించిన న్యాయవాది సుంకర నరేష్ కు విద్యార్థిని కృతజ్ఞతలు తెలిపింది. వివరాల్లోకి వెళితే కాప్రా కమలానగర్ కు చెందిన మైసగోని శ్రీనిధి ఈసిఐఎల్ లోని ఎస్ ఆర్ డిజి స్కూల్ లో గత సంవత్సరం పదవ తరగతి చదివింది. సదరు యాజమాన్యం ఫీజు చెల్లించలేదనే నెపంతో సదరు విద్యార్థినికి ట్రాన్స్ ఫర్ సర్టిఫికెట్ ఇవ్వకుండా వేధించారు. ఈ విషయమై న్యాయవాది సుంకర నరేష్ ను ఆశ్రయించగా హైకోర్టులో కేసు వేసారు. హైకోర్టు పరిధిలోని ఈ అంశంపై ట్రాన్స్ ఫర్ సర్టిఫికెట్ తో సంబంధం లేకుండా సైనిక్ పురి లోని భవన్స్ శ్రీ అరబిందో జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ లో విద్యార్థిని జాయిన్ అయ్యింది. బుధవారం నుండి పరీక్షలు ప్రారంభమవుతుండగా కాలేజీ ప్రిన్సిపాల్ ట్రాన్స్ ఫర్ సర్టిఫికెట్ ఇవ్వలేదన్న కారణం తో హాల్ టికెట్ నిరాకరించింది .విద్యార్థిని జీవితాన్ని దృష్టిలో పెట్టుకుని న్యాయవాది సుంకర నరేష్ మంగళవారం ఈ విషయాన్ని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి దృష్టికి లంచ్ మోషన్ రూపంలో తీసుకెళ్లి వాదనలు వినిపించారు. హైకోర్టు తక్షణమే విద్యార్థినికి హాల్ టికెట్ ఇచ్చి పరీక్షలకు సజావుగా హాజరయ్యాయేలా చూడాలని కాలేజీ ప్రిన్సిపాల్ ను ఆదేశించింది. ఆ విద్యార్థిని యొక్క పరీక్షా ఫలితాలు సీల్డ్ కవర్ లో కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది. ఈ కేసును ప్రత్యేకంగా చూడాలని తీర్పునిచ్చింది. తదుపరి విచారణకు కాలేజీ యాజమాన్యం హాజరవ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థిని కుటుంబం సుంకర నరేష్ కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## అంగన్వాడీలు జీతాలు అడిగితే అరెస్టులా.?

- ఇదేం ప్రజాపాలన..
- అరెస్టు అయిన అంగన్‌వాడీలను వెంటనే విడుదల చేయాలి
- సీఐటీయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణన్



**మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి, మార్చి04(నినాదం న్యూస్):** సంవత్సర కాలంగా పెండింగ్ లో ఉన్న అంగన్వాడిల వేతనాలను విడుదల చేయాలని పెరిగిన వేతనాలను వెంటనే అమలు చేయాలని ప్రజా దర్బార్ హైదరాబాద్ ప్రజావాణిలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అద్వర్యంలో ప్రజా పాలనలో తమ గోడును విన్నవించుకోవడానికి తమ సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రం ఇవ్వడానికి బయలుదేరుతున్న మినీ అంగన్వాడి లను ప్రభుత్వం పోలీసుల చేత అక్రమ అరెస్టు పాల్పడుతోందని, మినీ అంగన్వాడీ ల తో పాటు మేయిన్ అంగన్వాడి లను కూడా అరెస్టు చేసి పోలీస్ స్టేషనులకు తరలించడం హౌస్ అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్ తరలిస్తున్నారని అంగన్వాడీల పైన నిర్బంధ కాండను ఆపాలని సిఐటియు జిల్లా కోశాధికారి కె .ఉన్ని కృష్ణ డిమాండ్ చేశారు. సంవత్సర కాలంగా జీతాలు లేకుండా ముఖ్యమంత్రి, మంత్రులు ఎమ్మెల్యేలు పనిచేస్తరా.? అని ఆయన ప్రశ్నించారు. అంగన్వాడి యూనియన్ జిల్లా కార్యదర్శి బి.శోభారాణి మాట్లాడుతూ కానీ అంగన్వాడీ కార్యకర్తలు సంవత్సర కాలంగా వేతనాలు లేకుండా పనిచేశారు. అయినప్పటికీ వాళ్ల వేతనం కోసం అడగటానికి వెళ్లిన వారిని అరెస్టులు చేయించడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనం అన్నారు. ప్రజాపాలన పేరుతో ప్రజల సమస్యలను తీరుస్తామంటూ చెబుతున్న ప్రభుత్వం అంగన్వాడీ టీచర్లు ప్రజలు కాదా వాళ్ల సమస్యలు ప్రభుత్వానికి పట్టదా ఇదేనా ప్రజా పాలన అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ నిర్బంధ పాలనకు తెరతీస్తోందన్నారు. ప్రజా పాలన అంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగన్వాడీలను అరెస్టులు చేయడం ఏంటని ప్రశ్నించారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలి తప్పుడు చేసి పోలీస్ స్టేషన్లలో పెట్టడం, నిర్బంధాన్ని ప్రయోగించడం చేయడం వల్ల సమస్య పరిష్కారం కాదన్నా సంగతి ప్రభుత్వము గ్రహించాలని కోరారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మల్కాజిగిరి మేడ్చల్ జవహర్ నగర్ కీసర షామీర్ పేట్ నేరేడు మెట్టు మేడిపల్లి అల్వాల్ తదితర మండలాల్లో అరెస్ట్ చేసిన అంగన్వాడీలను వెంటనే భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అల్వాల్ ప్రాజెక్టులో డ్యూటీలో అటెండ్ అయిన అంగన్వాడిని అరెస్టు చేయడం అత్యంత శోచనీయం ప్రజాస్వామ్యంలో ఇదేనా గౌరవ వేతనం తోటి అర కొర సుఖాలతోటి పనిచేస్తూ ప్రజలకు సేవలు అందించే మహిళా కార్యకర్తలపై ఇలాంటి ఘటనలు చేయడమనేది ప్రభుత్వం సిగ్గుపడే విషయంగా పరిగణించాలి.

## బస్తీల్లో సమస్యలు పరిష్కరిస్తా..

- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్



**మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి, మార్చి04(నినాదం న్యూస్):** కంటోన్మెంట్ నియోజకవర్గం సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన బస్తీ పర్యటనలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే శ్రీగణేష్ మారేడ్‌పల్లి లో పర్యటించారు. ముఖ్యంగా ఈస్ట్ మారేడ్‌పల్లి మెయిన్ రోడ్ లోని సుమన్ కాలనీ వాసులు తాము ఎంతో కాలంగా ఎదుర్కొంటున్న డ్రేనేజీ సమస్యను స్థానికులు ఎమ్మెల్యే దృష్టి కి తీసుకువచ్చారు. దీనిపై ఎమ్మెల్యే జిహెచ్‌ఎంసీ వాటర్‌వర్క్స్ డిజిఎం విద్యాసాగర్, కంటోన్మెంట్ హెల్త్ సూపరింటెండెంట్ దేవేందర్ లతో కలిసి సమస్యను పరిశీలించారు. సమస్యను పరిష్కరిస్తానని హామి ఇచ్చారు. ఈ బస్తీ పర్యటనలో కాలనీ నాయకులు, కాలనీ వాసులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలతో మర్యాదగా ప్రవర్తించాలి



**అల్వాల్, మార్చి 4(నినాదం న్యూస్):** ఓల్డ్ ఆల్వాల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఆశా వర్కర్స్ ,సిస్టర్స్ , సిబ్బంది లతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించిన డాక్టర్ యాకేందర్ రెడ్డి .ప్రతినెల మొదటి మంగళవారం అందరితో కలిసి సమావేశం ఉంటుందని "ముక్తభారత్ అనీమియా" లో భాగంగా చిన్నపిల్లల నుండి పెద్దల వరకు రక్తహీనతనం తగ్గించే దానిపై అవగాహన కల్పించారు.ఎవరి విధులు వారు సక్రమంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మరియ, రాణి, ఎస్ అరుణ, ,జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సీఏ ఫలితాల్లో ఆల్ ఇండియా 35వ ర్యాంకు

- ఇంటర్మీడియట్ ఫలితాల్లోనూ స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన సిరి
- అభినందనలు తెలుపుతున్న కుటుంబ సభ్యులు, స్నేహితులు



**జమ్మికుంట, మార్చి 3 (నినాదం న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన చేరాల సిరి ఇవాళ వెలుబడిన సిఏ ఫలితాల్లో ఆల్ ఇండియా లెవెల్లో 35వ ర్యాంకు సాధించింది. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్ ఆఫ్ ఇండియా ఈ ఏడాది జనవరిలో సీఏ ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించగా కమలాపూర్ కు చెందిన చేరాల రాజ్ కుమార్ - సరస్వతి దంపతుల కుమార్తె చేరాల సిరి సహస్ర పరీక్షలకు హాజరై సీఏ ఇంటర్మీడియట్ బోత్ పరీక్షల్లో ఆల్ ఇండియా స్థాయిలో 35వ ర్యాంకు సాధించి ఔరా అనిపించింది..అంతే కాకుండా గతములో రాసిన ఇంటర్మీడియట్ పరీక్షల్లోనూ సిరి రాష్ట్ర స్థాయిలో మెదటి ర్యాంక్ సాధించింది. సిరికి ఆలిండియా 35వ ర్యాంకు రావడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలుపి కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.కాగా బంధువులు స్నేహితులు సిరికి శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

## నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- జమ్మికుంట పట్టణ సిఐ వరగంటి రవి



**జమ్మికుంట, మార్చి 4 (నినాదం న్యూస్):** జమ్మికుంట మండల కేంద్రంలో నేటి నుండి జరగనున్న ఇంటర్ పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నేటి నుండి జరగనున్న ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్టు కస్టోడియం ఆఫీసర్ విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతాయని పరీక్ష రాసే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి అరగంట ముందే రావాలని సూచించారు. నేటి నుండి ప్రారంభమయ్యే ఈ పరీక్షలు 25 తారీకు వరకు జరుగుతాయని పరీక్షల నిర్వహణ కోసం సర్వం సిద్ధం చేశామని ఆయన పేర్కొన్నారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 257 మంది విద్యార్థులు, కాకతీయ జూనియర్ కళాశాలలో 303 మంది, స్రవంతి జూనియర్ కళాశాలలో201 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని వెల్లడించారు. ఈ సందర్భంగా జమ్మికుంట సిఐ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని విద్యార్థులు 8:30 గంటల వరకు పరీక్ష కేంద్రానికి రావాలని ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం కస్టోడియం ఆఫీసర్ విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ మూడు సెంటర్లలో పరీక్ష నిర్వహణ కోసం దాదాపు 28 మందిని ఏర్పాటు చేయడం జరిగిందని ప్రతి కళాశాలలో అధ్యాపకులు అందుబాటులో ఉండి పరీక్ష నిర్వహణ సరిగా జరిగేలా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

## ఉపాధ్యాయులకు “గురు వందనం”

- టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపులో మీ పాత్ర మరువలేనిది
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



**జమ్మికుంట, మార్చి 4 (నినాదం న్యూస్) :** హుజురాబాద్ నియోజకవర్గం ప్రజాప్రతినిధుల ఎంపిక అభి వృద్ధి పై నాదే బాధ్యత నాదే అని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సోమవారం హుజురా బాద్ అసెంబ్లీ పరిధిలోని ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రమశిక్షణతో నిబద్ధతతో పనిచేసిన కార్యకర్తలకు పట్టం కట్టిస్తానని, హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం లోని అభివృద్ధి పైన, ప్రజా ప్రతినిధుల ఎంపిక పైన పూర్తిగా బాధ్యత వహిస్తానని కరీంనగర్ పార్లమెంటు సభ్యులు కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గారు కార్యకర్తలకు అభయమించారు.కార్యకర్తలు సమిష్టిగా పనిచేస్తూ టీచర్ ఎమ్మెల్సీ ఓటు వేసిన ప్రతి ఉపాధ్యాయుడు (గురువును) గురు వందనం పేరుతో నమస్కరించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, బిజెపి జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు కోరి రవీందర్, పోలింగ్ బూత్ అధ్యక్షులు పొన్నగంటి రవికుమార్ (పీజేఆర్), ఉడుగుల మహేందర్ హామీ ఇచ్చారు.

## వీధి దీపాల నిర్వహణపై వివరాల సేకరణ

**-సిబ్బంది పని తీరు పై ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషనర్ చాహాత్ బాజ్ పాయ్**



**కరీంనగర్, మర్చి 4(నినాదం న్యూస్ ):** నగర వ్యాప్తంగా వీది దిపాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ అధికారులు, సిబ్బంది ని ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయం లో మంగళవారం రోజు వీది దీపాల నిర్వహణ విభాగం అధికారులు, సిబ్బంది, ఈ ఎస్ ఎల్ సంస్థ సిబ్బంది తో సమీక్షా సమావేశం నిర్వహించారు. నగరంలోని వీది దీపాల నిర్వహణ తీరు పై డివిజన్ వారిగా అధికారులు, సిబ్బంది ని వివరాలు అడిగి తెలుసుకొని వారి పని తీరు పై అసంతృప్తిని వ్యక్తం చేశారు. సీసీఎంఎస్ బాక్స్ లు, పోల్ నెంబర్ లిస్ట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వీది దీపాల నిర్వహణ లో సిబ్బంది తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటి నిర్వహణ సక్రమంగా చేపట్టాలని అధికారులు, సిబ్బంది కి ఆదేశాలు జారీ చేశారు. ఈ సంధర్బంగా కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ, నగర వీది దీపాల నిర్వహణ పై ప్రజల నుండి చాలా ఫిర్యాదులు వస్తున్నాయని...పలు డివిజన్లలో చాలా వరకు లైట్లు వెలగడం లేదని అన్నారు. ప్రతి రోజు సిబ్బంది సాయంత్రం డివిజన్ లలో పర్యటించి ఎక్కడెక్కడ లైట్లు వెలగడం లేదో గుర్తించి... వాటిని రీ ప్లేస్ చేయాలన్నారు. స్టాక్ రిజిస్టర్ పాటించి వెలగని వీది దీపాల స్థానంలో కొత్త బల్బులను అమర్చాలన్నారు. సీసీఎంఎస్ బాక్స్ లు, పోల్ నెంబర్ వారిగా వివరాలు నమోదు చేయాలన్నారు. నగరంలోని వెలగని లైట్ల వివరాల రిపోర్ట్ అందించాలని అన్నారు. ఇన్ని రోజుగా లెట్లు వెలగకుండ ఉంటే సిబ్బంది ఏం విధులు నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. .వీది దీపాల నిర్వహణ పై ప్రజల నుండి ఎలాంటి ఫిర్యాదు లు రాకుండ చర్యలు తీస్కోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఈఈ యాదగిరి, డీఈ అయూబ్ ఖాన్, ఏఈ ఘఫూర్, ఈఎస్-ఎల్ సిబ్బంది, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు



**కరీంనగర్, మర్చి 4 (నినాదం న్యూస్ ):** తాళం వేసి ఉన్న ఇండ్లే లక్ష్యంగా రాత్రి కన్నపు నేరాలకు పాల్పడిన అంతర్ రాష్ట దొంగను కరీంనగర్ జిల్లా కొత్తపల్లి పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ మేరకు కొత్తపల్లి పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్ కుమార్ వివరాలు వెల్లడించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని దార్ జిల్లా తండా పోలీస్ స్టేషన్ పరిధిలోని గోర్ గ్రామానికి చెందిన ప్రదీప్ ను కొత్తపల్లి పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. ప్రదీప్ తోపాటు మరో 8 మంది ముఠా సభ్యులు గత సంవత్సర కాలం నుండి కరీంనగర్ జిల్లాలో తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని పగలు రెక్కి నిర్వహించి..అర్ధరాత్రి వేళల్లో తాళాలు పగలగొట్టి చోరీలకు పాల్పడుతుండేవారని తెలిపారు. కరీంనగర్ రూరల్ ఏసిపి సీసీస్, కొత్తపల్లి పోలీసులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి మధ్యప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లి దొంగలను గుర్తించినట్లు తెలిపారు. ముఠాలోని ప్రధాన నిందితుడు ప్రదీప్ ను అదుపులోకి తీసుకుని విచారించగ.. ఈ ముఠా సభ్యులు కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుంటూరుపల్లి, కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కాపూర్, చింతకుంట ప్రాంతంలో జరిగిన 4 దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించాడు. నిందితుడి వద్ద నుండి ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

# మల్క కొమురయ్యది చారిత్రక విజయం

- టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి చరిత్రను సృష్టించింది..
- కిషన్ రెడ్డి నాయకత్వంలో , దిశ నిర్దేశంలో మూడో విజయం
- బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి , కేంద్ర మంత్రి బండి సంజయ్



**కరీంనగర్, మార్చి 4(నినాదం న్యూస్ ):** ఉమ్మడి కరీంనగర్ , నిజామాబాద్, మెదక్ , అదిలాబాద్ శాసనమండలి ఉపాధ్యాయ ఎన్నికల్లో బిజెపి చరిత్ర సృష్టించిందని , టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమురయ్య ది చారిత్రక విజయమని , ఎన్నికల్లో బిజెపికి అండగా నిలిచిన ఉపాధ్యాయు లకు సెల్యూట్ చేస్తున్నామని, రేయింబవళ్లు కష్టప డిన బిజెపి కార్యకర్తలందరికీ శిరస్సు వంచి వంద నాలు తెలియజేస్తున్నట్లు బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి , కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ తెలిపారు. బిజెపి టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపు విజయోత్సవ ర్యాలీ మంగళవారం రోజున కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయం నుండి కోర్టు చౌరస్తా వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ జరిగిన టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి మల్క కొమరయ్య విజయం కోసం తపస్ ప్రధాన భూమిక పోషించిందన్నారు. తపస్ నాయకత్వం ఈ ఎన్నికల్లో కష్టపడిన తీరును, దూకుడు చూసి ప్రస్తుతం ఉపాధ్యాయ సంఘాల్లో అలజడి మొదలైందని , ప్రస్తుతం ఎంతోమంది ఉపాధ్యాయులు తపస్ వైపు చూస్తున్నారన్నారు. ప్రధానంగా ప్రధాని నరేంద్ర మోడీ పాలను నమ్మి ఓటు వేస్తామని, 12 లక్షల 70 వేల టాక్స్ ఎగ్జామ్షన్ మరిచిపోమని ఎంతోమంది ఉపాధ్యాయులు ప్రచార సందర్భంగా తెలియజేశారని , శక్తివంతమైన దేశంగా భారతదేశాన్ని తీర్చిదిద్దు తున్న మహనీయుడు మోడీ పట్ల ఉన్న అభిమానాన్ని ఉపాధ్యాయులు ఎన్నికల్లో చూపించారని, వారంద రికీ బిజెపి పక్షాన వందనాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. అభ్యర్థిని నిలబెట్టలేని కాంగ్రెస్ , బి ఆర్ఎస్ లు బిజెపిని ఒడగొట్టడానికి అనేక కుట్రలు చేశాయని, ఆ రెండు పార్టీలు ఎన్నికల్లో ఒకటయ్యా యని , లోపాయి కారి ఒప్పందాలతో కోట్ల రూపాయలను పుట్నాలు పంచినట్టు పంచిన వాళ్లకు వ్యతిరేక తీర్పునిచ్చారన్నారు.

317 జీవో కోసం వ్యతిరేకంగా ఆనాడు కరీంనగర్ లో కొట్లాడిన బిజెపి కార్యకర్తలను ఉపాధ్యాయులు మర్చిపోలేదన్నారు. ఆరోజున కెసిఆర్ కు భయపడి ఏ ఉపాధ్యాయ సంఘం కూడా కొట్లాడడానికి ముందుకు రాలేదని , కేవలం తపస్ ఒక్కటే ఉపాధ్యాయులకు అండగా నిలి చిందన్నారు. ఉపాధ్యాయులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై ఉన్న వ్యతిరేకతను రాష్ట్ర ప్రభుత్వం గ్రహించాలి. రిటైర్మెంట్ బెనిఫిట్స్ , పిఆర్సి , 5 డి ఎ , గ్రాటివిటీ, పెన్షన్ లాంటి అనేక విషయాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వివరిస్తున్న తీరుపై బండి సంజయ్‌కుమార్ మండిపడ్డారు. ఉద్యోగ, ఉపాధ్యా యులను కాంగ్రెస్ ప్రభుత్వం గోసపెడుతుందన్నారు. ఉద్యోగులకు రావాల్సిన ప్రమోషన్లను తప్పకుండా ఇవ్వాలన్నారు. పైసలు ఆపడానికి గత కెసిఆర్ లాంటి మూరు?డు 58 సంవత్సరాల నుండి 61 సంవత్సరాల వరకు వయో పరిమితిని పెంచారని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే విధానాన్ని అవలంబిస్తే ఆ ప్రభుత్వానికి పట్టిన గతే కాంగ్రెస్ కు పడుతుంద న్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు ఇవ్వకపోవడంతో కళాశాల యాజమాన్యాలు ఎంతో ఇబ్బంది పడుతున్నారాన్నారు. విద్యార్థులకు సర్టిఫి కెట్స్ ఇవ్వకుండా కళాశాల యాజమాన్యాలు ఇబ్బంది పెడుతున్నాయని, దీనికి ప్రధాన కారణం ఫీజు రియంబర్స్మెంట్ బకాయి లేనన్నారు. దాదాపు 7,000 కోట్ల రూపాయలు ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించాల్సి ఉందన్నారు.

## ప్రభుత్వ హాస్పిటల్ సుపరింటెండెంట్ ఆర్ఎంఓల పైన చర్యలేవి ?

- సామాజిక కార్యకర్త అమ్మ వెంకటేష్ యాదవ్



**జమ్మికుంట, నినాదం న్యూస్ :** హుజురాబాద్ పట్టణంలోని ఏరియా సివిల్ ఆస్పత్రి లో వారం రోజుల క్రితం దాదాపు 17 మంది వ్యక్తులను ఎమ్ న్ ఓ లను సెక్యూరిటీ ఎక్స్ రే విభాగానికి చెందిన వ్యక్తును జిల్లా అదనపు కలెక్టర్ విధుల నుండి తొలగించడం జరిగింది.కాగా విచారణలో భాగంగా చిన్న స్థాయి సిబ్బంది తప్పే గాని పెద్ద స్థాయి అధికారుల తప్పు లేదా అని సామాజిక కార్యకర్త అమ్మ వెంకటేష్ యాదవ్అన్నారు. హుజురాబాద్ పట్టణంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.అనంతరంఆయన మాట్లాడుతూ...ప్రభుత్వ ఆసుపత్రి కి వస్తున్న నిరుపేద కుటుంబానికి చెందిన ప్రజలు వస్తే ఈ ఆసుపత్రి లో వైద్యం చేయకపోవడం కాగా వచ్చిన వారిని ప్రైవేట్ ఆసుపత్రికి అక్రమంగా తరలిస్తున్న నేపథ్యంలో ఆ వ్యక్తులపై చర్యలు తీసుకొని సస్పెండ్ చేశారు. కానీ ఆ వ్యక్తులు తప్పు చేశారు, అని ఏ నిర్ధారణతో వారిపై చర్యలు తీసుకున్నారో అర్థం కావడం లేదు అని ఆయన అన్నారు. వాటికి కారకులు ఐన సూపర్డెంట్ ,ఆర్ ఎమ్ ఓ ల పైన ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రభుత్వ ఆసుపత్రి కి వచ్చిన వ్యక్తులను ఏ ఆసుపత్రికి తరలించారో విచారణలో తెలియలేదా లేక బాడా అధికారులు కాబట్టి వీరి పైన చర్యలు తీసుకోకుండా వదిలేసి అమాయకమైన చిన్న ఉద్యోగం చేసుకునే వ్యక్తులను సస్పెండ్ చేయడం సమం జసం కాదని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. తప్పు చేసిన వారిని గుర్తించి వారిని శిక్షించాలని అభం శుభం తెలియని చిరు ఉద్యోగులను కాపాడాలని సోమవారం కరీంనగర్ ప్రజావాణిలో కలెక్టర్ కు ఫిర్యాదు చేసినట్లు అని తెలిపారు. జిల్లా కలెక్టర్ కి ఈ ఏరియా ఆస్పత్రి వ్యవహారం పైన మళ్ళీ విచారణ జరిపి సంబంధిత అధికారుల పైన చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్ ని కోరడం జరిగిందని తెలిపారు.ఇట్టి విషయాన్ని కాలయాపన చేసి సద్దుమణిగించే ప్రయత్నం చేస్తే విషయాన్ని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ ను కలిసి దీని వెనుక ఉన్న పెద్దపెద్ద నాయకులు అధికారులు ఆడుతున్న నాటకాల పై చర్యలు తీసుకునేలా చేస్తామని అన్నారు. ఈ హుజురాబాద్ సమస్యను రాష్ట్ర సమస్యగా చేసి పేద ప్రజలకు న్యాయం జరిగే వరకూ ఎక్కడికైనా ఎంతవరకైనా పోరాడుతానని అమ్మ వెంకటేష్ యాదవ్ అన్నారు.

## బేతిగల్‌లో రెండో రోజు కొనసాగుతున్న భూ లక్ష్మి మహాలక్ష్మి వేడుకలు





**జమ్మికుంట, మార్చి 4 (నినాదం న్యూస్):** వీణవంక మండలంలోని బేతిగల్ గ్రామంలో రెండవ రోజు కొనసాగుతున్న భూ లక్ష్మి మహాలక్ష్మి బొడ్రాయి వేడుకలు. మంగళ వారం రోజున భూలక్ష్మి, మహాలక్ష్మి,బొడ్రాయి, జాతర యాగశాల ప్రవేశం, శాంతి పాఠం, కుంభ ఆవాహన, ఆరాధన, అహహిత దేవత వాహనం, విగ్రహాలకు పంచామృతాభిషేకం చేసుకున్న సంద ర్భంగా గ్రామ దేవతల ప్రతిష్ట ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగగా, గ్రామ ప్రజల సమక్షంలో ఆడబిడ్డలు మంగళహారతుల గ్రామదేవ తలైన భూలక్ష్మి, మహాలక్ష్మి, బొడ్రాయి దేవతల అనుగ్ర హంతో,అష్టదిక్పాలకులు దద్దరిల్లిలా, గ్రామ దేవతలకు అర్చనలు, అభిషేకాలు గ్రామం పేరు చెప్పు, సంకల్ప బలంతో హిందూ సంప్ర దాయబద్ధంగా, హైందవ ధర్మంతో కూడిన మంత్ర, శాస్త్ర యుక్తంగా బ్రాహ్మణులు పూజలు జరిపిస్తూ, సకల దేవతల అనుగ్రహం గ్రామానికి ఉండాలని, సకల దోషాలు పోయి, సకల శుభాలు కలిగి, గ్రామంలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వ ర్యాలతో, పాడిపంటలతో, సిరిసంపదలతో, కలిగి ఉండాలని. అనంతరం గ్రామ ప్రజలు మొక్కులు చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమం లో అర్చ కలు నరసింహ చార్యులు గ్రామ ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలి

**మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**



**కరీంనగర్, మర్చి 4(నినాదం న్యూస్ ):** తిమ్మాపూర్ మండలం నల్లగొండ శ్రీ సీతారామ లక్ష్మీ నృసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా నిర్వహించాలని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.మంగళవారం ఆయన నల్లగొండ దేవస్థానాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆయన ఆలయ పరిసర ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు వీలుగా చర్యలు చేపట్టాలన్నారు. భక్తుల కొంగుబంగారమైన శ్రీ సీతారామ లక్ష్మీ నృసింహస్వామి వారి జాతరకు కరీంనగర్ జిల్లా నుంచే కాకుండా ఇతర ప్రాంతాలను నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వస్తుంటారని, ఇక్కడికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.ముఖ్యంగా రథోత్సవం, బండ్లు తిరిగే రోజు ఎలాంటి అపశృతులు దొర్లకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.వాటర్ ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే నల్లగొండ దేవస్థానంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. తిమ్మాపూర్ మండలం రామకష్ణ కాలనీకి చెందిన గొరిటాల సతీష్ వాటర్ ప్లాంట్ ను దేవస్థానానికి బహూకరించారని, భక్తుల దాహార్తిని తీర్చేందుకు వాటర్ ప్లాంట్ అందజేయడం మహత్కార్యమంటూ ధాత సతీష్ ను ఆయన అభినందించారు. నల్లగొండ దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ బండారు లక్ష్మణ్, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మినారాయణ గౌడ్, పార్టీ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాస్ రావు, కొత్త తిరుపతిరెడ్డి,గంద్ర శ్రీనివాస్, దేవస్థానం డైరెక్టర్లు గాజుల అంజయ్య, బూత్కూరి శ్రీనివాస్, కందుకూరి లక్ష్మిరాజం, జినుక శ్రీనివాస్, మార్క మొండయ్య, రొడ్డ సాగర్, పూజారి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విద్యోదయ విద్యాసంస్థల 32వ వార్షికోత్సవ వేడుకలు

- తల్లిదండ్రులకు పాఠశాలకు గొప్ప పేరు తేవాలి
- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



**జమ్మికుంట, మార్చి 4 (నినాదం న్యూస్):** విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకొని కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి తల్లిదండ్రులకు పాఠశాలకు గొప్ప పేరు తేవాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలోని విద్యోదయ విద్యాసంస్థల 32 వ వార్షికోత్సవ వేడుకలు, పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ విద్యోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకులు ఏబూసి రామస్వామి మన మధ్య లేకపోవడం బాధాకరమని ఆయనకు తనకు ఉన్న స్నేహపూర్వక సంబంధాన్ని గుర్తు చేశారు. పాఠశాల అభివృద్ధికి రామస్వామి చేసిన కృషిని కష్టాన్ని సేవలను పాఠశాల నిర్వహణ గూర్చి వివరించారు. ఎంతోమంది విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగడానికి విద్యోదయ విద్యాసంస్థలు ఎంతగానో దోహదపడ్డాయని ఆయన తెలిపారు. పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించి వారి జీవితాలలో వెలుగులు నింపి వారి ఉన్నతికి కృషి చేశారని వివరించారు. విద్యుదయ పాఠశాల డైరెక్టర్ తన తండ్రి ఏబూసి రామస్వామి 45 మంది విద్యార్థులతో పాఠశాలను ప్రారంభించి 3,500 మంది విద్యార్థులుగా అభివృద్ధి చెందుతూ ఎంతోమంది పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించి విద్యార్థుల జీవితాలలో వెలు గులు నింపారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల సహాయ సహకా రాలు విద్యాభిమానుల శ్రేయోభిలాషుల ఆశీస్సులు తనకుంటే తండ్రి రామస్వామి ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో అహర్నిశలు శ్రమిస్తానన్నారు. పాటల పోటీలు క్విజ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.

## టీచర్స్ ఎమ్మెల్సీ గెలుపొందడంపై బీజేపీ నాయకుల సంబరాలు



**మల్యాల మార్చి 4( నినాదం న్యూస్):** కరీంనగర్ టీచర్స్ ఎమ్మెల్సీ గా బిజెపి పార్టీ అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపొందడంపై మల్యాల మండల బిజెపి నాయకులు మంగళవారం స్థానిక అంగడి బజార్లో ఘనంగా సంబరాలు జరుపుకొని బాణ సంచాలు కాలుస్తూ బిజెపి పార్టీకి అనుకూలంగా ఉందా లేదా అనే నినాదాలు చేశారు .ఈ సందర్భంగా మల్యాల మండల స్థాయి యాదవ సంఘ భవన నిర్మాణం కోసం ఎంపీ నిధుల కింద మంజూరైన రూ 5 లక్షల విలువైన పత్రాన్ని యాదవ సంఘం నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు గాజుల మల్లేశం , ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి వెంకటస్వామి, బోట్ల ప్రసాద్, సంగాని రవి ,యాదవ సంఘం మండల అధ్యక్షుడు సంఘ శ్రీను ,తాడుక హనుమంతు, మల్లేష్ యాదవ్, కటకం లత ,అవుదుర్తి రమ మహిపాల్ ఉన్నారు.

## తిమ్మాపూర్‌లో బీజేపీ శ్రేణుల సంబరాలు



**కరీంనగర్, మర్చి 4(నినాదం న్యూస్ ):** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గా మల్క కొమురయ్య గెలుపొందిన సందర్భంగా మంగళవారం తిమ్మాపూర్ బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. తిమ్మాపూర్ కేంద్రం నుండి సుమారు 100 బైక్ లతో ర్యాలీ బయలుదేరిన బీజేపీ కార్యకర్తలు అల్గునూర్ లో టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు.మండలం అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాడేది బీజేపీ యే అని గుర్తించిన ఉపాధ్యాయులు తపస్ బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య ను మొదటి ప్రాదాన్యత ఓటుతో గెలిపించి ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజలకు తెలిసేలా చేశారని అన్నారు. 317 జివో రద్దు కోసం బీజేపీ అధ్యక్షునిగా ఉన్న సమయంలో బండి సంజయ్ చేసిన నిరసన దీక్ష తో నాటి బిఆర్ఎస్ ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందని పేర్కొన్నారు.నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అలాగే చేస్తుందని త్వరలో మూల్యం చెల్లించుకుంటుందన్నారు. బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్యను భారీ మెజారిటీతో గెలిపించిన ఉపాధ్యాయులం దరికీ బిజెపి తిమ్మాపూర్ మండల శాఖ పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.అలాగే మల్కా కొమురయ్య గెలుపు కొరకు అహర్నిశలు కృషిచేసిన బిజెపి నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ అనుబంద విభాగాలకు, ముఖ్యంగా తపస్ బాధ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర,జిల్లా కార్యవర్గ సభ్యులు బూట్ల శ్రీనివాస్,చింతం శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల తిరుపతి రెడ్డి,బిజేవైఎం అధ్యక్షులు గడ్డం అరుణ్ పాల్గొన్నారు.

## వృద్ధా ఆశ్రమంలో అల్పాహార వితరణ



**కరీంనగర్, మర్చి 4(నినాదం న్యూస్ ):** లయన్స్ ఇంటర్నేషనల్ డిస్టిక్ 320జి లయన్స్ క్లబ్ ఆఫ్ బొమ్మకల్ ఆధ్వర్యంలో చింతల శివాని పుట్టినరోజు సంద ర్భంగా వీరబ్రహ్మేంద్ర అనాధ వృద్ధాశ్రమం హౌసింగ్ బోర్డ్ కాలనీ వద్ద అల్పాహార వితరణ కార్యక్రమం చేపట్టడం జరిగినది ఇట్టి కార్యక్రమంలో జోన్ చైర్ పర్సన్ లయన్ చింతల కిషన్ పటేల్ క్లబ్ అధ్యక్షులు కామిరెడ్డి నరసింహారెడ్డి క్లబ్ సెక్రటరీ బట్టు రాజేందర్ క్యాబినెట్ మెంబర్ మాసినేని చక్రధర్ క్లబ్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నినాదం అవని 10
బుధవారం, మార్చి 05, 2025



# హిమోగ్లోబిన్ తక్కువగా ఉందా..?

**హిమోగ్లోబిన్ తగ్గితే..**

బాడీలో హిమోగ్లోబిన్ స్థాయిలు తగ్గితే రక్తహీనత ఏర్పడుతుంది. దీంతో నీరసం, బలహీనమవ్వడం, ఇతర సమస్యలకి కారణమవుతుంది. ఇలాంటప్పుడు హిమోగ్లోబిన్ స్థాయిలు పెరిగేందుకు డాక్టర్‌ని సంప్రదించడం చాలా ముఖ్యం. మీ ఆహారంలో ఐరన్ రిచ్ ఫుడ్స్ తీసుకుంటే మీ హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుకోవచ్చు.



మన శరీరంలో హిమోగ్లోబిన్ ఎర్ర రక్త కణాల్లో ఉంటుంది. ఇది ఒక ప్రోటీన్. ఐరన్ సహాయంతో హిమోగ్లోబిన్ ఊపిరితిత్తుల్లో ఉండే ఆక్సిజన్‌ను గ్రహించి శరీర భాగాలకు చేరవేస్తుంది. మళ్లీ శరీర భాగాల్లో ఉండే కార్బన్ డయాక్సైడ్‌ను తీసుకుని ఊపిరితిత్తులకు చేరవేస్తుంది. అంతేకాకుండా రక్తంలో ఉండే పోషకాలను కూడా కణాలకు అందిస్తుంది. ఇలా హిమోగ్లోబిన్ మన శరీరంలో విధులను నిర్వహిస్తుంది. అయితే శరీరంలో తగినంత ఐరన్ లేకపోతే హిమోగ్లోబిన్ ఉత్పత్తి కాదు. దీంతో శరీర భాగాలకు ఆక్సిజన్ సరిగ్గా లభించదు. ఫలితంగా శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది. అలాగే రక్తహీనత సమస్య కూడా వస్తుంది. కనుక శరీరంలో హిమోగ్లోబిన్ తగిన మోతాదులో ఉండేలా చూసుకోవాలి. అయితే పలు రకాల ఆహారాలను తినడం వల్ల హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుకోవచ్చు.



**యాపిల్, దానిమ్మ పండ్లు..**

యాపిల్ పండ్లలో విటమిన్ సి, ఐరన్ అధికంగా ఉంటాయి. అందుకని రోజుకు ఒక యాపిల్ ను తింటే కావల్సినంత ఐరన్ లభిస్తుంది. మన శరీరం ఈ ఐరన్‌ను శోషించుకుంటుంది. దీంతో హిమోగ్లోబిన్ స్థాయిలు పెరుగుతాయి. అలాగే దానిమ్మ పండ్లనుకూడా తినవచ్చు. ఈ పండ్లలోనూ ఐరన్, విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఎర్ర రక్త కణాల ఉత్పత్తిని పెంచుతాయి. దీంతో హిమోగ్లోబిన్ స్థాయిలు పెరుగుతాయి. అరటి పండ్లలోనూ ఐరన్ ఎక్కువగానే ఉంటుంది. అలాగే ఈ పండ్లలో విటమిన్ బి6 ఎక్కువగా ఉంటుంది. ఇవి హిమోగ్లోబిన్ తయారీకి దోహదం చేస్తాయి. దీని వల్ల శరీరంలో హిమోగ్లోబిన్ లెవల్స్ పెరుగుతాయి.

**నారింజ పండ్లు..**

నారింజ పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది మనం తిన్న ఆహారాల్లో ఉండే ఐరన్‌ను శరీరం శోషించుకునేలా చేస్తుంది. దీంతో హిమోగ్లోబిన్ ఉత్పత్తి పెరుగుతుంది. జామ పండ్లలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. ఐరన్ కూడా వీటి ద్వారా సమృద్ధిగానే లభిస్తుంది. ఇవి ఎర్ర రక్త కణాల తయారీకి దోహదం చేస్తాయి. దీని వల్ల హిమోగ్లోబిన్ లెవల్స్ పెరుగుతాయి. స్ట్రాబెర్రీలలో విటమిన్ సి, ఐరన్



అధికంగా ఉంటాయి. వీటిని తింటే శరీరం ఐరన్‌ను ఎక్కువగా శోషించుకుంటుంది. ఇది హిమోగ్లోబిన్ తయారీకి ఉపయోగపడుతుంది.

**పుచ్చకాయలు..**

పుచ్చకాయలను తినడం వల్ల శరీరంలోని వేడి తగ్గడమే కాదు, ఇంకా అనేక ప్రయోజనాలు కలుగుతాయి. పుచ్చకాయల్లో నీటి శాతం అధికంగా ఉంటుంది. అలాగే ఐరన్, విటమిన్ సి కూడా ఎక్కువగానే ఉంటాయి. పుచ్చకాయలను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే హిమోగ్లోబిన్ ఉత్పత్తిని పెంచవచ్చు. దీంతో ఎర్ర రక్త కణాల ఉత్పత్తి కూడా పెరుగుతుంది. కివి పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది మనం తిన్న ఆహారంలో ఉండే ఐరన్‌ను శరీరం శోషించుకునేలా చేస్తుంది. దీని వల్ల హిమోగ్లోబిన్ స్థాయిలు పెరుగుతాయి. ఇలా పలు రకాల ఆహారాలను తినడం వల్ల హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుకోవచ్చు. దీంతో జీవక్రియలు సక్రమంగా నిర్వహించబడతాయి. ఆరోగ్యంగా ఉంటారు.





# దివ్య ఔషధం చెరుకు రసం

## పుష్కలంగా పోషకాలు

కల్తీ లేకుండా స్వచ్ఛమైన పానీయాల్లో కొబ్బరిబోండం ఒకటిగా, రెండోది చెరుకు రసం దీనిని అన్ని కాలాల్లో తయారుచేసి విక్రయిస్తుంటారు. ప్రధానంగా వేసవిలో విక్రయాలు జోరుగా సాగుతుంటాయి.

*ప్రస్తుతం పల్లె, పట్టణం అని తేడా లేకుండా చెరుకు రసాన్ని విక్రయిస్తున్నారు. ధర కూడా అందుబాటులో ఉండి ఆరోగ్యానికి చెరుకు రసంలో పోషకాలు పుష్కలంగా ఉన్నాయని, మండు టెండల నుంచి ఉపశమనం పొందేందుకు ఎంతో ఉపయోగపడుతుందని వైద్యాధికారులు సూచిస్తున్నారు. చెరుకు రసం తీసుకోవడం ద్వారా జీర్ణక్రియ పెరగడంతోపాటు ఎలాంటి వ్యాధులు దరి చేరవని, ప్రతి ఒక్కరు క్రమంగా చెరుకు రసాన్ని తీసుకోవాలని సూచిస్తున్నారు.*

**చెరుకు రసం వల్ల ఉపయోగాలు..**

- ★ చెరుకు రసంతో అలసట తీరడమే కాకుండా సమస్యలు నివారిస్తుంది.
- ★ రక్తంలో చక్కర శాతం తగ్గి కళ్ళు తిరుగుతున్నట్లు అనిపించినప్పుడు చెరుకు రసం తాగుతే ఉపశమనం పొందవచ్చు.
- ★ ప్రతినిత్యం గ్లాసు రసం తాగితే ఆరోగ్యానికి చాలా మంచిది.
- ★ కొద్దిగా నిమ్మరసం కలిపి తాగితే జీర్ణశక్తి సులువుగా అవుతుంది.
- ★ చెరుకు రసంలో ఉత్తమ రకం లోహం లభ్యమవుతుంది.
- ★ చెరుకు రసంలో అల్లం కలిపి తాగితే గొంతు గరగర నుంచి ఉపశమనం పొందవచ్చు.
- ★ పచ్చకామెర్ల వ్యాధిగ్రస్తులు రసం తాగితే ఎంతో మేలు కామెర్లను చాలా వరకు కంట్రోల్ చేస్తుంది.
- ★ విటమిన్ బి ఉన్నందున దీన్ని సర్వ శ్రేష్ఠమైన సరువు టానిక్ అని అంటారు.
- ★ వాంతులు జరిగినప్పుడు దీని తాగితే సమస్యలు నివారిస్తుంది.





మార్కెట్

# ప్రపంచంలోనే అత్యంత ధనిక నగరం ఏదో తెలుసా?

## ఇక్కడ లక్షలాది మంది మిలియనీర్లు!

ప్రపంచంలోని అత్యంత ధనవంతుల జాబితాలో అమెరికా ఆధిపత్యం చెలాయించింది. మనం టాప్ 10 జాబితాను పరిశీలిస్తే, వారిలో తొమ్మిది మంది అమెరికాకు చెందినవారు. కానీ ప్రపంచంలోని అత్యంత ధనవంతులు ఏ నగరంలో నివసిస్తున్నారో మీకు తెలుసా? ఆ నగరమే న్యూయార్క్. ఈ అమెరికన్ నగరం 2024 హెన్లీ అండ్ పార్టనర్స్ జాబితాలో ప్రపంచంలోనే అత్యంత ధనిక నగరం అనే బిరుదును మరోసారి పొందింది. ఈ నగరంలో 349,500 మంది మిలియనీర్లు, 675 మంది సెంట్-మిలియనీర్లు (కనీసం $100 మిలియన్ల సంపద ఉన్న వ్యక్తులు), 60 మంది బిలియనీర్లు ఉన్నారు. అందుకే దీనిని ప్రపంచంలోనే అత్యంత ధనిక నగరం అని పిలుస్తారు. ప్రపంచంలోని 50 ధనిక నగరాల జాబితాలో 11 నగరాలు అమెరికా నుండి ఉన్నాయి. 2023 సంవత్సరంలో, న్యూయార్క్ ఆర్థిక వ్యవస్థ దాదాపు $1 ట్రిలియన్లు. అమెరికన్ స్టాక్ మార్కెట్ వాల్ స్ట్రీట్ ఈ నగరంలో ఉండటం వల్ల దీనిని అమెరికా ఆర్థిక రాజధాని అని కూడా పిలుస్తారు. న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్ మరియు NASDAQ ప్రపంచంలోనే అతిపెద్ద స్టాక్ మార్కెట్లు. సెక్యూరిటీల పరిశ్రమ ఒక్కటే 181,000 మందికి పైగా ఉద్యోగులను కలిగి ఉంది మరియు బిలియన్ల డాలర్ల పన్నులను చెల్లిస్తుంది. ప్రపంచంలోని అనేక ప్రముఖ ఆర్థిక సంస్థల ప్రధాన కార్యాలయాలు కూడా ఇక్కడే ఉన్నాయి. వీటిలో జేపీ మోర్గాన్ చేజ్, సిటీ గ్రూప్, మోర్గాన్ స్టాన్లీ, గోల్డ్‌మన్ సాచ్స్ ఉన్నాయి.

**రియల్ ఎస్టేట్‌లో కూడా ముందంజలో..**

ఈ నగరం మీడియా, టెక్నాలజీ, ఫ్యాషన్, హెల్త్‌కేర్, రియల్ ఎస్టేట్‌లలో కూడా ప్రపంచ అగ్రగామిగా ఉంది. ఇక్కడ సాంకేతిక పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతోంది. గూగుల్, అమెజాన్, ఫేస్‌బుక్ వంటి పెద్ద టెక్ కంపెనీలు ఈ నగరంలో తమ వ్యాపారాన్ని విస్తరిస్తున్నాయి. ఫ్యాషన్ పరిశ్రమలో దాదాపు 180,000 మంది పనిచేస్తున్నారు. ది న్యూయార్క్ టైమ్స్, NBC, కొండే నాస్ట్ వంటి ప్రధాన మీడియా సంస్థలు కూడా ఇక్కడి నుండి పనిచేస్తాయి. న్యూయార్క్‌లో ఇల్లు కొనడం అంత సులభం కాదు. ఇక్కడి స్థిరాస్తి ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనది. నగరంలోని ఫిఫ్త్ అవెన్యూ ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన షాపింగ్ వీధిగా పరిగణిస్తారు. ఇక్కడ ఇంటి అద్దె కూడా అమెరికాలోనే అత్యధికం. ఇంత ద్రవ్యోల్బణం ఉన్నప్పటికీ ప్రపంచంలోని అత్యంత ధనవంతులు ఇక్కడ నివసించడానికి ఇష్టపడతారు. న్యూయార్క్‌ను వివిధ సంస్కృతుల సంగమం అని కూడా అంటారు. దీని జనాభా దాదాపు 82 లక్షలు. 800 భాషలు మాట్లాడే ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారు. అందుకే ఈ నగరం ప్రపంచం నలుమూలల నుండి ప్రతిభావంతులైన వ్యక్తులను ఆకర్షిస్తుంది. దీనిని అవకాశాల నగరం అని కూడా పిలుస్తారు.

# అమల్లోకి ట్రంప్ టారిఫ్‌లు.. మార్కెట్‌లు విలవిల..

## రిలయన్స్ సహా బ్లూ చిప్ కంపెనీలకు నష్టాలు..!



కెనడా, మెక్సికో, చైనాల నుంచి దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెంచిన టారిఫ్ అమల్లోకి రావడంతో అంతర్జాతీయ మార్కెట్లతోపాటు దేశీయ స్టాక్ మార్కెట్లు కూడా మంగళవారం భారీగా పతనం అయ్యాయి. విదేశీ మదుపర్లు నిర్విరామంగా పెట్టుబడులు ఉపసంహరిస్తుండటంతో వరుసగా మూడోసెషన్‌లోనూ నష్టాల పాలైన బీఎస్ఈ -50 ఇండెక్స్ సెన్సెక్స్ మంగళవారం 96 పాయింట్ల పతనంతో 73 వేల పాయింట్ల దిగువన స్థిర పడింది. బీఎస్ఈ సెన్సెక్స్ 96.01 పాయింట్లు నష్టపోయి 72,989.93 పాయింట్ల వద్ద స్థిర పడింది. బీఎస్ఈ-30లో 18 స్టాక్స్ నష్టాలతో ముగిస్తే, 12 స్టాక్స్ లాభాలతో స్థిర పడ్డాయి. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 452. 4 పాయింట్ల నష్టంతో 72,633.54 పాయింట్ల కనిష్టానికి పతనమైనా ట్రేడింగ్ ముగిసే సమయానికి రికవరీ సాధించింది. మరోవైపు ఎన్ఎస్ఈ-50 సూచీ నిఫ్టీ వరుసగా పదో సెషన్‌లో నష్టాలతో ముగిసింది. 36.65 పాయింట్లు పతనమై 22,082.65 పాయింట్ల వద్ద స్థిర పడింది. ట్రేడింగ్ ప్రారంభంలోనే 22 వేల దిగువన 21,974.45 పాయింట్ల వద్ద ట్రేడయింది. అంతర్గత ట్రేడింగ్‌లో నష్టాల నుంచి రికవరీ సాధించింది. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్‌లో బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, నెస్లే ఇండియా, ఏషియన్ పెయింట్స్, భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా, ఇన్ఫోసిస్, మారుతి సుజుకి ఇండియా, టైటాన్, హిందూస్థాన్ యూనీ లివర్, రిలయన్స్ ఇండస్ట్రీస్ నష్టాలతో ముగిశాయి. మరోవైపు, భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ), జొమాటో, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), అదానీ పోర్ట్స్, పవర్ గ్రిడ్, టాటా స్టీల్, హెచ్డీఎఫ్‌సీ బ్యాంకు లాభ పడ్డాయి. ఆసియా మార్కెట్లలో టోక్యో, హాంకాంగ్, సియోల్ నష్టాలతో ముగిస్తే, షాంఘై లాభాలతో స్థిర పడింది. యూరోపియన్ మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. సోమవారం అమెరికా మార్కెట్‌లు నష్టపోయాయి. గ్లోబల్ ఆయిల్ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 1.37శాతం పతనమై 70.64 డాలర్లు పలుకుతోంది. సోమవారం నాడు దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.4,788.29 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.



# భారత్‌లో టెస్లా మొదటి షోరూమ్

## ఎలాన్ మస్క్ కీలక ఒప్పందం! అద్దె ఎంతో తెలుసా?

ముంబైలో తన మొదటి షోరూమ్ కోసం ఒప్పందాన్ని ఖరారు చేయడంతో టెస్లా భారతదేశంలో ప్రారంభించటానికి దగ్గరగా ఉంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతీయ మార్కెట్‌లోకి ప్రవేశించడానికి సిద్ధమవుతున్న ఈ సమయంలో కంపెనీకి ఇది ఒక ముఖ్యమైన అడుగు. ఇటీవలి మీడియా నివేదికల ప్రకారం, టెస్లా ముంబైలోని ప్రధాన బాంద్రా-కుర్లా కాంప్లెక్స్ లో 4,000 చదరపు అడుగుల వాణిజ్య సముదాయాన్ని బుక్ చేసుకుంది.

**రూ.35 లక్షల అద్దె:** ఈ ఫ్లాగ్‌షిప్ షోరూమ్ టెస్లా తాజా ఎలక్ట్రిక్ మోడళ్లను ప్రదర్శిస్తుంది. టెస్లా నెలవారీ అద్దెను దాదాపు రూ.35 లక్షలు (చదరపు అడుగుకు రూ.900)గా నిర్ణయించింది. లీజు ఒప్పందం ఐదు సంవత్సరాలు. టెస్లా ఇప్పటికే ఢిల్లీలోని ఏరోసిటీ కాంప్లెక్స్‌లో రెండవ షోరూమ్‌ను ప్రారంభించాలని యోచిస్తోంది. టెస్లా భారతదేశంలో తన ఉనికిని విస్తరించాలని యోచిస్తోంది. అలాగే దీని కోసం కంపెనీ ఢిల్లీ, ముంబై, పూణే వంటి నగరాల్లో అనేక ప్రాంతాలను ఎంచుకోగా, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్, ప్రధాని నరేంద్ర మోడీ మధ్య జరిగిన సమావేశం తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆ కంపెనీ తన మొదటి షోరూమ్‌ను ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో ప్రారంభించాలని యోచిస్తోంది. ఇది ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ప్రాంతాలలో ఒకటి. దీనితో పాటు టెస్లా ఢిల్లీలోని ఏరోసిటీలో తన షోరూమ్‌ను కూడా ప్రారంభించాలని యోచిస్తోంది. భారతదేశంలోకి టెస్లా ప్రవేశం ఎలక్ట్రిక్ వాహన (EV) మార్కెట్‌లో పోటీని పెంచడమే కాకుండా భారతదేశ ఆటోమొబైల్ రంగానికి ఒక కొత్త విప్లవంగా కూడా నిరూపించుకోనుంది.

**ధర ఎంత ఉంటుంది?..** టెస్లా మోడల్స్ భారతదేశంలో ప్రీమియం ఆఫర్‌లుగా ఉండనున్నాయి. ధరలు దాదాపు రూ. 21 లక్షల ($25,000) నుండి ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

# బీఎస్ఎన్ఎల్ హోలీ ధమాకా

## ఈ ప్లాన్‌పై 30 రోజులు అదనపు

మీరు భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ కస్టమర్ అయితే మీకో శుభవార్త. మొబైల్ వరల్డ్ కాంగ్రెస్‌లో బీఎస్ఎన్ఎల్ తన 9 కోట్లకు పైగా వినియోగదారుల కోసం హోలీ ధమాకా ఆఫర్‌ను ప్రవేశపెట్టింది. ఈ ఆఫర్ కింద రీఛార్జ్ ప్లాన్ చెల్లుబాటును ఒక నెల పెంచుతున్నట్లు కంపెనీ ప్రకటించింది. అంటే కంపెనీ ఈ ప్లాన్‌లో 30 రోజుల చెల్లుబాటును ఉచితంగా అందిస్తోంది. ఈ నిర్ణయం వల్ల తన కస్టమర్ల సంఖ్య పెరుగుతుందని బీఎస్ఎన్ఎల్ ఆశిస్తోంది. బిఎస్ఎన్ఎల్ ఇప్పుడు తన రూ. 2,399 రీఛార్జ్ ప్లాన్‌తో 30 రోజుల అదనపు చెల్లుబాటును ఇస్తోంది. గతంలో ఈ ప్లాన్ 395 రోజుల చెల్లుబాటును అందించేది. కానీ ఇప్పుడు దీని మొత్తం చెల్లుబాటు 425 రోజులు. బిఎస్ఎన్ఎల్ ప్రీపెయిడ్ ప్లాన్‌లో భారతదేశం అంతటా అపరిమిత కాలింగ్, ఉచిత రోమింగ్, ఢిల్లీ – ముంబైలోని ఎంటిఎన్ఎల్ నెట్‌వర్క్‌లో కాంప్లిమెంటరీ కాలింగ్ ఉన్నాయి. దీనితో పాటు ఈ బీఎస్ఎన్ఎల్ ప్లాన్‌లో 60GB డేటా కూడా పూర్తిగా ఉచితంగా లభిస్తుంది.

100 SMSలు ఉచితంగా:

చిన్నగా ఉంది కదా అని తీసిపారేయకండి.. ACకి మించి కూలింగ్..!

ఈ ప్లాన్ వినియోగదారులు రోజుకు 2GB హై-స్పీడ్ డేటా, 100 ఉచిత SMSలను పొందుతారు. ఇది మొత్తం 850GB డేటాకు సమానం. ఇది కాకుండా అన్ని బీఎస్ఎన్ఎల్ మొబైల్ వినియోగదారులకు BiTV ఉచిత సభ్యత్వాన్ని అందిస్తోంది. ఇది అనేక OTT అప్లికేషన్లకు ఉచిత యాక్సెస్‌ను కూడా అందిస్తోంది.

దేశవ్యాప్తంగా 100,000 4G టవర్లను ఏర్పాటు:

తన సేవలను మరింత మెరుగుపరచడానికి బీఎస్ఎన్ఎల్ తన నెట్‌వర్క్ మౌలిక సదుపాయాలపై కూడా పనిచేస్తోంది. ఈ సంవత్సరం ప్రథమార్థం నాటికి దేశవ్యాప్తంగా 100,000 కొత్త 4G టవర్లను ఏర్పాటు చేయాలని కంపెనీ యోచిస్తోంది. గత ఒక సంవత్సరం కాలంగా బీఎస్ఎన్ఎల్ అన్ని టెలికాం సర్కిల్‌లలో తన నెట్‌వర్క్‌ను చురుకుగా అప్‌గ్రేడ్ చేస్తోంది. ఇప్పటికే 65,000 కంటే ఎక్కువ 4G మొబైల్ టవర్లు పనిచేస్తున్నాయి. మిగిలిన టవర్లు రాబోయే నెలల్లో ఆన్‌లైన్‌లోకి వస్తాయని, వినియోగదారులకు మరింత మెరుగైన కనెక్టివిటీని హామీ ఇస్తున్నాయని భావిస్తున్నారు.

# సెబీ మాజీ చీఫ్‌కు ఊరట..

## ప్రత్యేక కోర్టు ఉత్తర్వులపై స్టే విధించిన హైకోర్టు



స్టాక్ మార్కెట్ మోసాల కేసులో సెబీ (సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా) మాజీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ కు భారీ ఊరట లభించింది. మాధవి, మరో ఐదుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న ముంబై ప్రత్యేక కోర్టు ఆదేశాలపై బాంబే హైకోర్టు స్టే విధించింది. స్టాక్ మార్కెట్ మోసాలు, నియంత్రణ సంబంధిత ఉల్లంఘనల ఆరోపణలపై మాధవి పురి బుచ్, మరో ఐదుగురిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలని ఏసీబీని ముంబై ప్రత్యేక కోర్టు శనివారం ఆదేశించించిన విషయం తెలిసిందే. దీనిపై మాధవి, హోల్ టైమ్ సభ్యులు అశ్వని భాటియా, అనంత్ నారాయణ్ జి, కమలేష్ చంద్ర వర్ష్నీ, బీఎస్ఈ చైర్మన్ ప్రమోద్ అగర్వాల్, సీఈవో సుందరరామన్ రామమూర్తిలు హైకోర్టులో వ్యక్తిగతంగా పిటిషన్లు దాఖలు చేశారు. వీరు దాఖలు చేసిన పిటిషన్లను బాంబే హైకోర్టు అత్యవసర విచారణకు స్వీకరించింది. ఈ పిటిషన్లపై ఇవాళ విచారణ జరిపింది. ఈ నేపథ్యంలో ప్రత్యేక కోర్టు ఉత్తర్వులను బాంబే హైకోర్టు నిలిపివేసింది.

సెబీ మాజీ చీఫ్‌పై ఎఫ్ఐఆర్.... స్టాక్ మార్కెట్ మోసాలు, నియంత్రణ సంబంధిత ఉల్లంఘనల ఆరోపణలపై సెబీ (సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా) మాజీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్, మరో ఐదుగురిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలని ఏసీబీని ప్రత్యేక కోర్టు శనివారం ఆదేశించింది. నియంత్రణకు సంబంధించిన లోపాలు జరిగినట్లు, కుమ్మక్కు అయినట్లు ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉన్నాయని, వీటిపై న్యాయమైన, నిష్పాక్షిక దర్యాప్తు అవసరమని తెలిపింది. దర్యాప్తును తాను పర్యవేక్షిస్తానని జడ్జి తెలిపారు. ఓ మీడియా రిపోర్టర్ దాఖలు చేసిన ఫిర్యాదుపై ఈ ఆదేశాలను ఇచ్చారు. ఓ కంపెనీని స్టాక్ ఎక్స్చేంజ్‌లో మోసపూరితంగా లిస్టింగ్ చేశారని, ఇదంతా రెగ్యులేటరీ అథారిటీస్ చూసీ చూడనట్లు వ్యవహరించడం వల్ల జరిగిందని తెలిపారు. అదానీ విదేశీ ఫండ్లలో స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ 'సెబీ' చైర్ పర్సన్ మాధాబీ పురీ బుచ్ , ఆమె భర్తకు వాటాలున్నాయని షార్ట్ సెల్లింగ్ సంస్థ, మార్కెట్ రీసెర్చ్ కంపెనీ హిండెన్‌బర్గ్ నివేదిక దేశవ్యాప్తంగా పెను దుమారం రేపుతున్న విషయం తెలిసిందే. ఈ నివేదిక దేశవ్యాప్తంగా పెను దుమారం రేపింది. ఈ నేపథ్యంలో సెబీ చీఫ్‌కు పార్లమెంట్ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమన్లు కూడా జారీ చేసింది. అయితే, ఆ తర్వాత విచారణ అనంతరం ఆమెకు క్లీన్ చిట్ ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి.

# నేరస్తులకు దరువు... విద్యార్థులకు గురువు

- ఖాకీ కర్తవ్యంలో సామాజిక బాధ్యత
- ప్రజల మన్ననలు పొందేలా సేవలు
- యువతకు మార్గదర్శిగా ఎస్ఐ ఏ.రాజేందర్





చెన్నూర్,మార్చి 04(నినాదం న్యూస్): ఆ పోలీసు అధికారి అనగానే నేరస్తులకు వీపు దరువు గుర్తొస్తుంది.ఇదే క్రమంలో విద్యార్థులకు మాత్రం గురువు గుర్తొస్తాడు.ఉద్యోగరిత్యా బాధ్యతల సమయంలో చేసిన ప్రమాణానికి ఏమాత్రం మినహాయింపివ్వని అధికారి.శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా, అన్ని వర్గాల ప్రజలకు పిలిస్తే పలికే పోలీసుగా, ఆపన్నులకు శ్రేయోభిలాషిగా మారారు. ఆయనే మంచిర్యాల జిల్లా కోటపల్లి ఠాణా ఎస్సై ఏ రాజేందర్. అక్రమార్కులకు విక్రమార్కునిలా, బాధి తులకు అండగా నిలుస్తున్న ఆయనపై నినాదం ఓ చిరు ప్రోత్సాహక కథనం....

**రాజీలేని కర్తవ్యం, సామాజిక వ్యక్తిత్వం ....**

మంచిర్యాల జిల్లా కోటపల్లి ఠాణా ఎస్ ఐ గా విధులు నిర్వర్తిస్తున్న ఏ రాజేందర్ వృత్తిరిత్యా ఫ్రెండ్లీగా ఉంటూ నిత్యం ప్రజల మన్ననలను పొందుతున్నారు.ఓవైపు అక్రమార్కుల గుండెల్లో రైలు పరుగెట్టిస్తూనే యువతకు ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు. మఫ్టీలో వెళ్లి కోటపల్లి మండలంలో అప్పటివరకూ సాగు తున్న అక్రమ మద్యం, పిడిఫ్ రైస్, పేకాట రాయుళ్ల భరతం పట్టారు. ఈ క్రమంలో తన పేరు తెబితే మండలంలో అభినందించ నివారుండరంటే అతిశయోక్తి కాదు. నేరనియంత్రణలో రాత్రీ పగలు తేడాలేకుండా నిరంత రం ప్రజల రక్షణకై గస్తీ కాస్తూ గ్రామస్థులకు భరోసా ఇస్తున్నారని అక్కడి ప్రజల బాహాటపు మాట. అంతేకాకుండా వారికి కావలిసిన సౌకర్యాలు, చిన్న చిన్న అవసరాలు సైతం తీరుస్తూ వారి కుటుంబంలో ఒకరిగా ఉండటమే ఆయన ప్రత్యేకత. ప్రజల ఆరోగ్యం పట్ల ఆరాటీసి



కావలసిన హెల్త్‌క్యాంపులు సైతం నిర్వహిస్తారు. విద్యా దానం మహదానంగా భావించి ఎస్సై రాజేందర్ పూలే సావిత్రి బాయి బాటలో హాస్టల్ విద్యార్థులకు రాత్రి వేళ ట్యూసన్ చెబుతూ వారిని సమాజం పట్ల అవగాహన పరుస్తున్నారు. యువత, విద్యార్థులు చెడు దారిన పడకుండా డ్రగ్స్, మద్యం లాంటి వ్యసనాలకు బానిసలు కాకుండా తగిన అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇలా వృత్తితో పాటు సామాజహితం కోసం పాటుపడుతున్న ఎస్ ఐ రాజేందర్ ను స్థానిక ప్రజలు, అధి కారులు, ఉపాధ్యా యులు అభినంది స్తున్నారు.

## నేటి నుంచే ఇంటర్ పరీక్షలు

### -ఐదు నిమిషాల వరకూ అనుమతి



**మంథని టౌన్ మార్చి 04 (నినాదం న్యూస్) :** ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం నుండీ ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ పరీక్షలకు విద్యార్థులు హాజరు కానున్నారు. ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభం అయ్యే ఈ పరీక్షలకు ఐదు నిమిషాలు ఆలస్యంఐనాఅనుమతించనున్నారు. మంథని పట్టణం లోని ప్రభుత్వ బాలికలు, బాలుర జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. సీ సీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరగనున్నాయి. పరీక్షా కేంద్రాల సమాచారాన్ని తెలిపే క్యు అర్ కోడ్ ను హాల్ టికెట్ల పై ముద్రించారు.విద్యార్థులు సమయానికి అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. బాలికల కళాశాలలో 197 మంది, బాలుర కళాశాలలో 190 మంది ఈ పరీక్షలకు హాజరు కానున్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీజేపీ కైవసం

### -పెద్దపల్లిలో బిజెపి శ్రేణుల సంబరాలు



**పెద్దపల్లి, మార్చి 04 (నినాదం న్యూస్):** ఉమ్మడి మెదక్,నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థి శ్రీ మల్క కొమరయ్య ఘన విజయం సాధించారు.ఈ సందర్భంగా పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో మంగళవారం బిజెపి పెద్దపల్లి పట్టణ మరియు మండల శాఖ ఆధ్వర్యంలో జెండా కూడలిలో పటాకులు కాల్చి సీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ అదిలాబాద్ నిజామాబాద్ మెదక్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందిన మల్కా కొమురయ్య కు అభినందనలు తెలిపారు.ఈ విజయంతో ఉపాధ్యాయ లోకంలో బిజెపిపై ఉన్న అపారమైన విశ్వాసం,నమ్మకం మరింత బలపడిందన్నారు. ఈ విజయంతో పెద్దపల్లి అసెంబ్లీ మరియు జిల్లాలో కాషాయ హావ మొదలైందన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు పెంజార్ల రాకేష్,మండల అధ్యక్షులు వేల్పుల రమేష్,శిలరపు పర్వతాలు,పల్లె సదానందం,కావేటి రాజగోపాల్,పోల్సాని సంపత్ రావు, పర్ష సమ్మయ్య,జంగ చక్రధర్,ఉప్పు కిరణ్,టూరు రవి,శిలవేరి ఓదెలు, అక్కపల్లి క్రాంతి,ములుగురి రాజా, వీరు,ఈర్ల శంకర్,శివం గారి సతీష్, బెజ్జంకి దిలీప్,గుడ్ల సతీష్,పిట్ట వినయ్,గాదాసి సతీష్,ఎర్రోళ్ల శ్రీకాంత్, వినోద్,సంపత్,రాజేందర్ కుమార్, ప్రశాంత్,శ్రీను,ఉమేష్,వేణు,సురేందర్, వంశీ,మనోహర్, సారయ్య,నర్సింగ్గం, సందీప్,శివ,శ్రీనివాస్,సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గాయత్రీ సహిత ఋగ్వేద పారాయణం

### -బ్రహ్మశ్రీ నరేంద్ర కాప్రే చే ఆధ్యాత్మిక ప్రవచనము

**మంథని టౌన్ మార్చి 04 (నినాదం న్యూస్):** మంథని పట్టణంలోని శ్రీ శీలేశ్వర - సిద్దేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 3 నుండి 9 వ తేది వరకు సంపూర్ణ ఋగ్వేద స్వాహాకార యజ్ఞము 3వ తేదీ పాల్గున శుద్ధ చతుర్థి నుండి 9వ తేదీ పాల్గొన శుద్ధ దశమి వరకు ఏడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా కమంగళవారం 8.30 గంటల నుండి 1 గంట వరకు గురు వందనము, నిత్య పూజ, గాయత్రీ జపసహిత ఋగ్వేద పారాయణ స్వాహాకారము అనంతరము సాయంత్రం 5 గంటల నుండి సుహాసినిలచే స్తోత్ర పారాయణము, ప్రదోష పూజ, రుద్రక్ర మార్చన, బ్రాహ్మశ్రీ వేదమూర్తులు నరేంద్ర కాప్రే గారిచే ఆధ్యాత్మిక ప్రవచనము, తీర్ద ప్రసాద వితరణ కార్యక్రమములు ఉంటాయని బ్రహ్మశ్రీ వేదమూర్తులు ఒజ్జల గణేశావధాని, ఆమ్నాయవర్ధిని మిత్రబృందము వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తజనులు అధిక సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పునీతులు కావాలని వారు కోరారు.

## ఇంటర్ పరీక్షలకు సన్నద్ధం



**పెద్దపల్లి,మార్చి04 (నినాదం న్యూస్):** పెద్దపల్లి జిల్లాలో బుధవారం మార్చి 5వ తేదీ నుండి జరగబోయే ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో మొత్తం 23 సెంటర్లలో పరీక్షలు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు,నిర్వహించ నున్నట్లు,పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా మొదటి సంవత్సరం విద్యార్థులు సుమారు 4894,ద్వితీయ సంవత్సర విద్యార్థులు 5636 మంది,లో మొత్తం 10,530 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు.ప్రతి పరీక్షా కేంద్రానికి నియమించిన చీఫ్ సూపరింటెండెంట్,డిపార్ట్ మెంటల్ ఆఫీసర్ లకు శిక్షణ ఇవ్వడం జరిగిందని,ప్రతి పరీక్ష కేంద్రంలో సీ.సీ. కెమెరా,త్రాగునీరు,విద్యుత్ సౌకర్యం, టాయిలెట్స్ సౌకర్యం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.పరీక్షల నిర్వహణకు ఒక జిల్లా పరీక్షల కమిటీ, 4 సెట్టింగ్స్ స్క్వాడ్స్,ఒక ఫ్లేయింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేసి,ప్రతి పరీక్ష కేంద్రంలో విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసుకునే విధంగా అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన ఆ ప్రకటనలో తెలిపారు.

## విజయోస్తూ ... ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

### -5 నిమిషాలు ఆలస్యమైన అనుమతి



**మంచిర్యాల ప్రతినిధి, మార్చి 4 (నినాదం న్యూస్):** జిల్లా వ్యాప్తంగా ఇంటర్ వార్షిక పరీక్షలు బుధ వారం నుంచి ప్రారంభం కానున్నాయి. బుధవారం ప్రథమ సంవత్సరం, గురువారం ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరగనున్నాయి. ఇంటర్మీడి యట్ వార్షిక పరీక్షలకు ఒక నిమిషం ఆలస్యం నిబంధనను ఎత్తివేశారు. పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాలు (9.05) వరకు విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు అనుమతిస్తారు. పరీక్ష కేంద్రాలను గుర్తించేలా హాల్ టికెట్ పై క్యూఆర్ కోడ్ ముద్రించారు. స్కాన్ చేసి పరీక్ష కేంద్రం లొకేషన్ తెలుసుకోవడానికి వీలుంటుంది. పరీక్షల కోసం మంచిర్యాల జిల్లాలో అధికారులు పకడ్బందీగా ఎర్పాట్లు చేశారు.ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులను 30 నిమిషాల ముందు నుంచే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఇంటర్మీడియట్ పరీక్ష నిర్వహణ కోసం జిల్లాలో 23 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం 4,965 మంది, ఒకేషనల్ 935, ద్వితీయ సంవత్సరం 5,625 మంది, ఒకేషనల్ 1015మంది విద్యార్థులు హాజరుకానున్నారు. విద్యార్థులు తమ వెంట హాల్ టికెట్ తీసుకొని పరీక్ష కేంద్రాలకు రావాలని అధికారులు తెలిపారు. వెబ్ సైట్ నుండి డౌన్లోడ్ చేసుకున్న హాల్ టికెట్ పై కళాశాల ప్రిన్సిపాల్ సంతకం లేకున్న డైరెక్ట్ గా హాజరు కావచ్చు అని తెలిపారు. ఆర్టీసీ అధికారుల సైతం పరీక్ష సమయంలో బస్సులు నడిచేలా చర్యలు తీసుకోనున్నారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్ ఇతరాత్ర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరు. కేంద్రాల్లో విధుల నిర్వహించే ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది సెల్ ఫోన్లను పరీక్ష కేంద్రాల ప్రాంగణంలో వినియోగించకుండా ఆంక్షలు విధించారు. పరీక్ష కేంద్రాల చుట్టుప్రక్కల జిరాక్స్ దుకాణాలు మూసి వేయ నున్నారు. విద్యార్థులను ఎలాంటి ఆటంకాలు కలగకుండా అన్ని 144 సెక్షన్ అమలు చేస్తూ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఆయా కేంద్రాల్లో అవసరమైన వసతులతో పాటు గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఆన్లైన్ ద్వారా ఉన్నతాధికారుల కార్యాలయాకు లింక్ చేశారు. ఈ మూడు గంటలు విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటారు. ప్రతి కేంద్రంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు.

## అభివృద్ధి పనులకు అవినీతి అంటగట్టిన కాంగ్రెస్

- మానేరు నీళ్లను ఆపాలనే ఏనాడు ఆలోచన చేయలే
- ఒక పని చేయకుండా 15నెలల కాలాన్ని వృధా
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**మంథని మార్చి 4( నినాదం న్యూస్):** ముందు తరాల భవిష్యత్ కోసం ఆలోచన చేసిన తాము అభివృద్ధి పనులు చేస్తే వాటికి కాంగ్రెస్సోళ్లు అవినీతిని అంటగట్టి బదనాం చేసి ప్రజలకు అన్యాయం చేశారని మంథనిమాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మంగళవారం మంథని మండలం అడవిసోమన్‌పల్లి గ్రామంలోని మానేరుపై నిర్మించిన చెక్‌డ్యాంను సందర్శించి చెక్‌డ్యాంలో నిలిచిన నీటిలో చేపలు పడుతున్న మత్స్యకారులను కలిసి ఉపాధి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ గొప్పగా ఆలోచన చేసి అడవిసోమన్‌పల్లి గ్రామంలోని మానేరుపై చెక్ డ్యాం నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, ఈ చెక్‌డ్యాంతో అనేక ప్రయోజనాలు ఉంటాయని ఆలోచనతో చెక్‌డ్యాం నిర్మిస్తే దానిపై మంథని ఎమ్మెల్యే రాద్ధాంతం చేశారన్నారు. చెక్ డ్యాంలు వేస్తు అని అసెంబ్లీలో మాట్లాడారని అన్నారు. ఎన్నికల ప్రచారంలో బాగంగా అడవిసోమన్‌పల్లిలో చెక్ డ్యాం కేవలం బీఆర్ఎస్ పార్టీ వాళ్ల ప్రయోజనాలకే నిర్మించారని, సైంటిఫిక్‌గా నిర్మించలేదని రకరకాలుగా మాట్లాడారని ఆయన గుర్తు చేశారు. అయితే ఈనాడు అడవిసోమన్‌పల్లి మానేరుపై నిర్మించిన చెక్‌డ్యాంతో భూగర్భజలాలు పెరిగాయని, మత్స్యసంపదతో అనేక కుటుంబాలు ఉపాది పొందుతున్నాయని ఆయన తెలిపారు. అడవిసోమన్‌పల్లితో పాటు ఇతర గ్రామాలకు చెందిన మత్స్యకారులు ఇక్కడ చేపలు పట్టుకుని జీవనోపాధి పొందుతున్నారని ఆయన అన్నారు. అనేక ఏండ్లు ఈ ప్రాంతాన్ని పరిపాలించిన ఎమ్మెల్యే కుటుంబం ఏనాడు ఈ ప్రాంత ప్రజల గురించి ఆలోచన చేయలేదని, గోదావరి, మానేరు నీళ్లు వృధాగా పోయి సముద్రంలో కలుస్తున్నా కనీసం కాలు అడ్డం పెట్టి ఆపాలని, సాగు, తాగునీరు అందించాలని చూడలేదన్నారు. ఈనాడు చెక్‌డ్యాంతో ఎంతో మంది ఉపాధి పొందుతుండగా భూగర్భజలాలు పెరిగి రైతులకు మేలు జరుగుతుందని, ఈ ప్రయోజనాలపై మంత్రి ఏమనిసమాధానం చెప్తాడని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కరకట్టలు నిర్మిస్తామని, ఇంకా అనేక పనులు చేస్తామని చెప్పిన ఎమ్మెల్యే అధికారంలోకి వచ్చి 15నెలలు గడుస్తున్నా ఒక్క పని చేయలేదని, 15నెలల కాలాన్ని వృధా చేశారని ఆయన అన్నారు. అడవిసోమన్‌పల్లి అనాదిగా కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేస్తూ వస్తున్నా కేసీఆర్ నాయకత్వంలో ఓట్ల కోసం, కులాలు, పార్టీలు చూడకుండా ప్రజల కోసమే పని చేయాలని ఆలోచనతో ఇక్కడ చెక్‌డ్యాం నిర్మించామన్నారు. ఈ చెక్‌డ్యాం ద్వారా జరుగుతున్న ప్రయోజనాలను చూసైనా ఎమ్మెల్యేకు జ్ఞానోదయం కావాలని, ఆగిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఈ నియోజకవర్గంలో అద్భుతమైన కాళేశ్వరం ప్రాజెక్టు వస్తే దానిని నిర్వీర్యం చేసేందుకు కుట్రలుచేశారని, ఈ ప్రాంత ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టును సైతం వినియోగంలోకి తీసుకురావాలని ఆయన అన్నారు.ఆయన వెంట బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడేది బిజెపియే



**సుల్తానాబాద్, మార్చి 04(నినాదం న్యూస్):** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరా డేది బిజెపి పార్టీ యే అని పెద్దపల్లి బిజెపి జిల్లా అధ్యక్షుడు కర్రే సంజీవరెడ్డి స్పష్టం చేశారు. మం గళవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని తె లంగాణ చౌరస్తా వద్ద ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలలో బిజెపి అభ్యర్థి మల్క కొమరయ్య ఘ న విజయం సాధించిన సందర్భంగా బిజెపి శ్రేణు లు పటాకులు కాల్చి,సీట్లు పంపిణీ చేసి సంబరా లు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅ తిథిగా జిల్లా అధ్యక్షుడు హాజరై మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పో రాడేది బిజెపి పార్టీ అని గుర్తించిన ఉపాధ్యాయు లు బిజెపి అభ్యర్థి మల్క కొమురయ్యను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజలకు తెలిసేలా చేశారని పేర్కొ న్నారు.ఈ సందర్భంగా మల్క కొమురయ్యను భా రీ మెజార్టీతో గెలిపించిన ఉపాధ్యాయులకు ప్రత్యే క కృతజ్ఞతలు తెలియజేశారు.అలాగే బిజెపి అ భ్యర్థి గెలుపు కొరకు కృషిచేసిన బిజెపి నాయకు లకు, కార్యకర్తలకు, వివిధ అనుబంధ విభాగాలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా అని చెప్పారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు కూకట్ల నాగరాజు, మండల అధ్యక్షులు కందుల శ్రీనివాస్, సీనియర్ జిల్లా నాయకులు కడారి అశో క్ రావు, సొదరి మహేందర్ యాదవ్, కొమ్ము తిరు పతి యాదవ్, నాగుల మల్యాల తిరుపతి, వేగో లపు శ్రీనివాస్ గౌడ్, కామని రాజేంద్రప్రసాద్, లంక శెంకర్,కొల్లూరి కుమార్, ఇగురం రామస్వామి, ఎన గందుల సతీష్, గజభింకర్ పవన్, పల్లె తిరుపతి, శేకర్ మాస్టర్, భాగ్యలక్ష్మి, కొల్లూరి సంతోష్, కందు నూరి కుమార్, బుర్ర సతీష్, వల్స సాయి కిరణ్, ఏళ్ళంకి రాజు, గుడ్ల వెంకటేష్, బూసరపు సంపత్, మహేష్ పటేల్, తోరికొండ సుధాకర్, వేముల శ్రీని వాస్, కొత్తిరెడ్డి అరవింద్ రెడ్డి, కోయ్యాడ శ్రీకాంత్, సాయి కుమార్, మనోహర్, ప్రశాంత్, ఈశ్వర్, రా జిరెడ్డి, శ్రీనివాస్ పటేల్ తదితరులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా సైన్స్ దినోత్సవం



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, మార్చి 04(నినాదం న్యూస్):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ మరియు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమ్మె ఆధ్వర్యంలో మంగళవారం సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాకతీయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్లు ఎన్.రామస్వామి, వి.కిషన్ హాజరై విద్యార్థులకు సైన్స్ సంబంధిత అంశాలపై అనేక విషయాలను వివరించారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఎన్. రామస్వామి మాట్లాడుతూ మన నిత్య జీవితంలో సైన్స్ ఒక విడదీయరాని భాగమని, భారత దేశంలో ఇంకా అనేక పరిశోధనలు జరగాల్సి ఉందన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వి. కిషన్ మాట్లాడుతూ మనం నేడు ఆధునిక యుగంలో ఉన్నామని, భారతదేశం సైన్స్ లో వేగంగా పురోగతి సాధిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు విద్యార్థి దశ నుండే శాస్త్రీయ అవగాహన కలిగి ఉండాలన్నారు. కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ప్రదర్శనను తిలకించి, ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందజేశారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్విజ్, సాంస్కృతిక పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే. శ్రీదేవి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి. లక్ష్మీనరసింహం, అకాడమిక్ కోఆర్డినేటర్ డి. జనార్ధన్, అధ్యాపకులు ఎం రాజేశ్వర్, ఇ. శారద వి. దేవేందర్, బి. రోజ్ మేరీ, ఆర్. కృష్ణవేణి, బి. వెంకటేశం పాల్గొన్నారు.

## ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలి : సీఐ రవీందర్



**చెన్నూర్ ఫిబ్రవరి 4 ( నినాదం న్యూస్ ):** చెన్నూరు పట్టణం లోని: జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో చెన్నూరు పట్టణ సీఐ రవీందర్ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులు,ఒత్తిడికి గురి కావద్దని,ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సీఐ రవీందర్ పేర్కొన్నారు. మంగళవారం చెన్నూర్ పట్టణం లోని పలు పాఠశాలలను సందర్శించి పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. పరీక్షలంటే భయం వద్దని, ఒక్కసారి పరీక్షలో తప్పిపోయినా మరలా రాసి పాస్ కావచ్చని తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం



**పెద్దపల్లి,మార్చి (నినాదం న్యూస్):** ఈ నెల 1వ తేదిన పెద్దపల్లి రైల్వే స్టేషన్ వద్ద అచేతన స్థితిలో ఉన్న సుమారు (50-55) ఏళ్ళ వయస్సుగల మగ వ్యక్తిని 108 అంబులెన్స్ లో సిబ్బంది పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం చనిపోయాడు.ఇట్టి గుర్తు తెలియని వ్యక్తి శవాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురి గదిలో బద్రపరచనైనది. ఆనవాళ్లు:చామన ఛాయ వర్ణం,తల వెంట్రుకలు మరియు గడ్డం తెలుపు,నీలి రంగు ఫుల్ టీషర్ట్, ఆకుపచ్చ లుంగీ ధరించి యున్నాడు.ఇట్టి వ్యక్తి వివరాలు తెలిసిన పెద్దపల్లి పోలీస్ స్టేషన్ నందు సంప్రదించగలరని పెద్దపల్లి ఎస్సై లక్మణ్ రావు తెలిపారు.మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబర్ 8712656506బి8712656507 సంప్రదించాలని సూచించారు.

## నేటి నుంచే ఇంటర్ పరీక్షలు

### -ఐదు నిమిషాలు ఆలస్యమైన అనుమతి



**మంథని మార్చి 4 (నినాదం న్యూస్):** ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం నుండీ ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తెలుగు, హిందీ,సంస్కృతం, ఉర్దూ పరీక్షలకు విద్యార్థులు హాజరు కానున్నారు. ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభం అయ్యే ఈ పరీక్షలకు ఐదు నిమిషాలు ఆలస్యం ఐనా అనుమతించనున్నారు. మంథని లోని ప్రభుత్వ బాలికలు, బాలుర కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. సీ సీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరగనున్నాయి. పరీక్షా కేంద్రాల సమాచారాన్ని తెలిపే క్యు అర్ కోడ్ ను హాల్ టికెట్ల పై ముద్రించారు. విద్యార్థులు సమయానికి అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. బాలికల కళాశాలలో 197 మంది, బాలుర కళాశాలలో 190 మంది ఈ పరీక్షలకు హాజరు కానున్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు.

## మున్సిపల్ కార్మికులకు రూ.వెయ్యి ఇవ్వకపోవడం సిగ్గుచేటు



**మంథని మార్చి 4 (నినాదం న్యూస్):** మంథని మున్సిపల్ పరిధిలోని మున్సిపాలిటీ కార్మికులకు వేయి రూపాయల వేతనం అమలు చేస్తున్న పెరిగిన వేతనం ఇవ్వకపోవడం సిగ్గుచేటని సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేష్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మున్సిపల్ కార్మికులకు వెయ్యి రూపాయల వేతనం పెంచి 9 నెలలు గడుస్తున్నా జిల్లాలో అన్ని మున్సిపాలిటీలో వేయి రూపాయల వేతనం అమలు చేస్తున్నా కార్మికులకు పెరిగిన వెయ్యి రూపాయల వేతనం ఇవ్వకపోవడం సిగ్గుచేటని అన్నారు .అలాగే గత నాలుగు సంవత్సరాలుగా కార్మికులకు సబ్బులు నూనెలు చెప్పులు బట్టల కూలి డబ్బులు ఇవ్వకపోవడం చాలా బాధాకరమన్నారు. ఎన్ ఎం ఆర్ కార్మికులను కాంటాక్ట్ పద్ధతిన తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ చొరవ తీసుకొని కార్మికులకు పెరిగిన తొమ్మిది నెలల వెయ్యి రూపాయల వేతనాన్ని వెంటనే అమలు చేసి ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు.ఆయన వెంట ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆర్ల సందీప్,వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బావు రవి,యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## వనపర్తి మున్సిపాలిటీలో
## రూ.45.11కోట్ల వార్షిక బడ్జెట్ ఆమోదం
### కలెక్టర్ ఆదర్శ్ సురభి వెల్లడి



**వనపర్తి ప్రతినిధి, (నినాదం):** వనపర్తి పురపాలికలో 2025-26కి రూ.45.11 కోట్ల వార్షిక అంచనా బడ్జెట్‌ను ఆమోదిం చినట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వెల్లడించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వనపర్తి పురపాలికలో రూ.45.11 కోట్ల ఆదాయం సమకూరనున్నట్లు వేసిన అంచనా బడ్జెట్ నుకలెక్టర్ ఆదర్శ్ సురభి ఆమోదించారు. ఇందులో మున్సిపాలిటీలో వివిధ మార్గాల ద్వారా వచ్చే ఆదాయంతో పాటు 15వ ఫైనాన్స్, స్టేట్ ఫైనాన్స్ నిధులు ఉన్నాయని తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన 2024-25 సవరించిన బడ్జెట్, ఇప్పటి వరకు అయిన ఖర్చులు, 2025-26 ఆర్థిక సంవత్సరంలో అంచనా బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అకౌంటెంట్ కృష్ణయ్య బడ్జెట్ వివరాలను చదివి వినిపించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.26.36 కోట్ల అంచనా బడ్జెట్‌ను ప్రతిపాదించగా 2025 సవరించిన బడ్జెట్ విలువ రూ.39.28 కోట్ల ఆదాయంగా పద్దులో చూపించారు. ఇప్పటివరకు ఈఆర్థిక సంవత్సరంలో రూ.11.67కోట్లు వివిధ అభివృద్ధి పనులకు ఖర్చు చేసినట్లు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.45.11కోట్ల ఆదాయం వివిధ మార్గాల ద్వారా సమకుర నున్నట్లు అంచనా వేశారు. ఇందులో 10శాతం నిధులు మొక్కలు నాటడం, వాటి సంరక్షణకు గ్రీన్‌బడ్జెట్‌గా కేటాయించినట్లు చూపించారు. 1/3 వంతు బడ్జెట్‌ను పురపాలక సంఘంలోని విలీనమైన ప్రాంతాలు, అభివృద్ధి చెందని ప్రాంతాలు, మైనారిటీ, బలహీన వర్గాలు నివసించే ప్రాంతాలు, మురికి వాడల అభివృద్ధికి వాడనున్నట్లు పేర్కొన్నారు. పురపాలికలోని 33 వార్డుల అభివృద్ధి కొరకు దాదాపు రూ.22.26 కోట్లు కేటాయించారు. అంటే ఒక్కో వార్డుకు దాదాపు రూ.60 లక్షల వరకు ఖర్చు చేయ నున్నారు. వీధి కుక్కల నియంత్రణ ఏ.బి.సి చేసేందుకు రూ.15 లక్షలు కొత్త బడ్జెట్‌లో కేటాయించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిధులు సమకూర్చుకుంటేనే అభివృద్ధి సాధించవచ్చని సూచించారు. అన్ని పురపాలికల్లో ప్రాపర్టీ ట్యాక్స్ వంద శాతం వసూలు చేసేందుకు కృషి చేయాలని, అదేవిధంగా కుళాయి బిల్లులు, ఎల్.ఆర్. ఎస్ చేయించడంపై పూర్తి దృష్టి పెట్టాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీ యాదయ్య వనపర్తి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, కొత్తకోట, ఆత్మకూర్, అమర చింత, పెబ్బేరు మున్సిపాలిటిల కమిషనర్లు పాల్గొన్నారు.

# సమానత్వంతోనే సమాజ పురోగతి

### హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



**వరంగల్‌బ్యూరో, (నినాదంన్యూస్):** ఎలాంటి అవాంతరాలు లేకుండా స్త్రీ,పురుష సమానత్వంతోనే సమాజం పురోగతిని సాధిస్తుందని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. మంగళవారం హనుమ కొండ సుబేదారిలోని యూని వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో కళాశాల మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో యాక్సిలరేట్ యాక్షన్ అనే అంశంపై సమావేశాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ముఖ్యఅతిథిగా హాజరై అతిథులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లా డుతూ గతంలో బాలబాలికల నిష్పత్తితో పాటు విద్య లోనూ వ్యత్యాసం ఉండేదని, కానీ అది నేడు తగ్గిపోతూ వస్తుందన్నారు. సమాజంలో వివిధ అవకాశాలను పొందేందుకు మహిళలకు సమాన హక్కులు రాజ్యాంగంలో కల్పించబ డ్డాయన్నారు. మహిళలకు ఉన్నత విద్యను అభ్యసించే హక్కును రాజ్యాంగం కల్పించిందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలికలు విద్యా, ఉద్యోగ, ఇతర రంగాలలో సమాన అవకాశాలను సాధించాలన్నారు. ఈసందర్భంగా ముందస్తు మహిళాదినోత్సవ శుభాకాంక్షలను కలెక్టర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా హాజరైన కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం మాట్లా డుతూ భిన్న రంగాలలో మహిళలు రాణిస్తూ తమ ప్రతిభను చాటుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి జయంతి, కాకతీయ యూనివర్సిటీఈసీ మెంబర్ డాక్టర్ కె.అనితారెడ్డి తదితరులు మాట్లాడారు. కలెక్టర్ ప్రావీణ్య, తదితరులను మహిళా అధ్యా పకులు శాలువాలతో ఘనంగాసత్క రించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఉమెన్స్ సెల్ డైరెక్టర్ అసి స్టెంట్ ప్రొఫెసర్ శ్రీలత, అసిస్టెంట్ ప్రొపె, సర్లు శ్రీధర్ కుమార్ లోథ్, తిరునహరి శేషు, మహిళా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రంజాన్ పండుగకు ఏర్పాట్లను పూర్తి చేయాలి
### అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్



**ములుగు ప్రతినిధి, (నినాదం):** పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన నేపథ్యంలో సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అదనపు కలెక్టర్ సి హెచ్ మహేందర్ జి. అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రంజాన్ సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లు, కల్పించాల్సిన సౌకర్యాలపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు, లోటుపాట్లకు తావులేకుండా జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలు, గ్రామాలలో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా సమన్వయంతో పని చేయాలని అధికారులకు సూచించారు. ప్రధానంగా ఎక్కడ కూడా తాగునీరు, పారిశుధ్యం వంటి సమస్యలు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బందికి బాధ్యతలు పురమాయిస్తూ, నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, వీధి లైట్ల మరమ్మతులు జరిపించాలన్నారు. బోర్లు, పైప్ లైన్ మరమ్మతులు ఉంటే ముందస్తుగా చేపట్టాలని తెలిపారు. అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ప్రార్థనా సమయాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని విద్యుత్ శాఖకి సూచించారు. మసీదులు, ఈద్గాల వద్ద పారిశుధ్య సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడ కూడా శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, సమస్యాత్మక ప్రాంతాలలో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. కాగా వేసవి సీజన్ ప్రారంభం అవుతున్న దృష్ట్యా తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. రంజాన్ పండుగ రోజు శ్యామ్యానాలు తాగునీరు తదితర ఏర్పాట్లు చేయాలని, రంజాన్ హెూలీ, ఉగాది పండుగలకు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. రంజాన్ పండుగ రోజు ములుగు ఈద్గాలో దాదాపు 5 వేల మంది ప్రార్థనలో హాజరు అవుతారని, అలాగే అన్ని మండల కేంద్రాలలోని ఈద్గాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సి హెచ్ రవీందర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారు లు, ముస్లిం మత పెద్దలు మిర్జా రహమతుల్లా బేగ్, హాజీ అబ్దుల్లాహ్ బిన్ అహ్మద్ సయాద్ షకిల్, రియాజ్ మిర్జ, ఖుతుబద్దిన్, అబ్దుల్ రబ్, తదితరులు పాల్గొన్నారు.




NINADAM CINEMA

## టాలీవుడ్‌లోకి సోనాక్షి సిన్హా ఎంట్రీ



హిట్టు, ఫ్లాప్‌లతో సంబంధం లేకుండా వరుసగా సినిమాలు చేసుకుంటూ వెళుతున్నాడు సుధీర్ బాబు. గతేడాది హరోంహర, మా నాన్న సూపర్ హీరో సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాగా.. ఇవి మిక్స్‌డ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచాయి. దీంతో ఎలాగైన హిట్ కొట్టాలనే కసితో ప్రస్తుతం జటాధర అనే సినిమా చేస్తున్నాడు. మైథాలజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమాకి వెంకట్ కల్యాణ్ కథనందిస్తూ దర్శకత్వం వహిస్తుండగా.. తెలుగు, హిందీ బైలింగ్యువల్ ప్రాజెక్ట్‌గా ఈ సినిమా రాబోతుంది. అయితే ఈ సినిమాకు సంబంధించి ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాతో బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. మార్చి 08 నుంచి సోనాక్షి జటాధర షూటింగ్‌లో పాల్గొనబోతున్నట్లు సమాచారం. కాగా దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇటీవలే హీరమండి: డైమండ్ బజార్ అనే వెబ్ సిరీస్‌తో వచ్చి సూపర్ హిట్ అందుకుంది సోనాక్షి.

### ఒకేసారి 500 మందితో
## హృతిక్, ఎన్టీఆర్ డ్యాన్స్



దేవరతో సాలిడ్ హిట్ అందుకున్న అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్ ప్రస్తుతం వార్ 2 సినిమాతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. వార్ సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రంలో హృతికి రోషన్ కథానా యకుడిగా నటిస్తుం డగా.. తారక్ కీలక పాత్రలో మెరుస్తున్నాడు. ఆదిత్య చోప్రా ఈ సినిమాను నిర్మిస్తుండగా.. అయన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఒక క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఈ సినిమాలో హృతిక్, ఎన్టీఆర్ మధ్య క్రేజీ డ్యాన్స్ సీక్వెన్స్ ఉండబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. తాజాగా సినిమాలోని పాట కోసమే ఏకంగా 500 మంది డ్యాన్స?ర్లను రంగంలోకి దింపినట్లు వార్తలు వస్తున్నాయి. 500 మంది డ్యాన్సర్లతో హృతిక్, ఎన్టీఆర్ డ్యాన్స్ చేస్తుంటే థియేటర్లు ఏ రేంజ్‌లో ఊగిపోతాయో అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. హృతిక్, ఎన్టీఆర్ మధ్య వచ్చే ఈ డ్యాన్స్‌లో మునుపెన్నడూ చూడని విధంగా ఓ సరికొత్త గీతాన్ని తీర్చిదిద్దుతుంది చిత్రబృందం. యష్‌రాజ్ స్టూడియోలో ప్రస్తుతం ఈ డ్యాన్స్ షూటింగ్ జరుగుతున్నట్లు సమాచారం.

### మాధురిని రక్తంవచ్చేలా
## ముద్దుపెట్టిన హీరో

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ మాధురి దీక్షిత్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తన నటనతో 1980-90ల్లో బాలీవుడ్‌ని ఓ ఊపు ఊపేసింది. దాదాపు 70కి పైగా చిత్రాల్లో నటించిన ఈ ముద్దుగుమ్మ తన డ్యాన్స్‌తో పాటు న టనతో ప్రేక్షకుల్ని కట్టిపడేసింది. అయితే 'బాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్'గా పేరు తెచ్చుకున్న ఈ ముద్దుగుమ్మ కెరీర్‌లో కూడా ఒక మరిచిపోలేని చేదు సంఘటన ఉంది. తన కెరీర్‌లో బిగినింగ్ టైంలో వినోద్ ఖన్నాతో చేసిన ఒక మూవీలో ఈ ఘటన జరిగింది. 1984లో "అబోధ్" సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టింది మాధురి దీక్షిత్. తొలి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ నటి. అయితే 1988లో బాలీవుడ్ సీనియర్ నటుడు వినోద్ ఖన్నా ప్రధాన పాత్రలో వచ్చిన చిత్రం దయావన్. 1987లో కమల్ హాసన్ నటించిన బ్లాక్ బస్టర్ చిత్రం నాయకన్ సినిమాకి ఇది రీమేక్‌గా తెరకెక్కింది. ఈ చిత్రంలో మాధూరి కథానాయికగా నటించగా.. ఫిరోజ్ ఖాన్ దర్శకత్వం వహించాడు. అయితే ఈ సినిమా షూటింగ్‌లో భాగంగా వినోద్ ఖాన్నా మాధూరి పెదవులు కొరకడం అప్పట్లో పెద్ద వివాదానికి దారి తీసింది. చిత్ర షూటింగ్‌లో భాగంగా.. ఆజ్ ఫిర్ తుమ్ పే ప్యార్ ఆయా హైపాట చిత్రీకరిస్తుండగా.. వినోద్ మాధురిని ముద్దు పెట్టుకోవాల్సి వచ్చింది. అయితే ఈ సీన్ కంప్లీట్ అయ్యి దర్శకుడు కట్ చెప్పిన అనంతరం కూడా వినోద్ మాధూరిని ముద్దు పెట్టుకోవడం ఆపకపోగా.. ఆమె పెదవి కొరకడంతో రక్తం కారి ఆమె ఏడ్చినట్లు నివేదికలు తెలిపాయి. దీంతో షూటింగ్ అనంతరం మాధురికి వినోద్ క్షమాపణలు చెప్పినట్లు సమాచారం.




టాలీవుడ్ అందాల ముద్దుగుమ్మ సమంత గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. స్టార్ హీరోయిన్‌గా ఓ రేంజ్‌లో పాపులారిటీ సంపాదించుకున్న ఈ భామ ఆ తర్వాత నాగ చైతన్యని ప్రేమించి పెళ్లి చేసుకుంది. సంసారం సజావుగా సాగుతున్న సమయంలో ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చి అతని నుండి విడిపోయింది. ఇక ప్రస్తుతం సింగిల్‌గా ఉంటుంది. ఇక చైతూ నుండి విడిపోయిన తర్వాత సమంతకి మయోసైటిస్ అనే వ్యాధి బయటపడింది. చాలా రోజుల పాటు ఈ వ్యాధితో బాధపడ్డ సమంత సినిమాలకి కూడా బ్రేక్ ఇచ్చింది. అయితే చివరికి ఆ వ్యాధితో ధీటుగా ఎదుర్కొని మళ్లీ సినిమాలతో అలరించేందుకు సిద్ధమవుతుంది. అయితే సమంత సినిమాల్లోకి వచ్చి 15 ఏళ్లు పూర్తయ్యాయి.

## 15 ఏళ్లలో ప్రేమ, పెళ్లి, విడాకులు
### సమంత సినీజీవితంలో ఎన్నో మలుపులు

2010లో విడుదలైన ఏ మాయ చేసావే సినిమా ద్వారా సమంత ఆరంగేట్రం చేసింది. ఈ మూవీ ఫిబ్రవరి 26,2010న విడుదలై పెద్ద విజయం సాధించింది. ఈ సినిమాలో సమంతతో చైతూ జంటగా నటించాడు. ఈ మూవీ సమయంలోనే వారిద్దరి మధ్య ప్రేమ పుట్టిందని టాక్. అయితే ఏ మాయ చేశావే సినిమా విడుదలై 15 ఏళ్లు కావడంతో, సమంత సినీ జర్నీ కూడా 15 ఏళ్లు పూర్తి అయింది. ఈ సినీ ప్రయాణంలో సమంత.. అల్లు అర్జున్, ఎన్టీఆర్, పవన్ , మహేష్, రామ్ చరణ్ లాంటి స్టార్ హీరోల సరసన నటించి అలరించిఆంది. తమిళంలో కూడా వరుస సినిమాలు చేసింది. చివరిగా సమంత తెలుగులో ఖుషి, తమిళంలో కాతువాక్కుల రెండు కాదల్ సినిమాల్లో నటించింది. ఈ సినిమాల తరువాత సమంత జీవితంలో అనేక సవాళ్లు ఎదురయ్యాయి. విడాకులు, మయోసైటిస్ వ్యాధి , తండ్రి చనిపోవడం ఇలా సమంతని అనేక సమస్యలు చాలా ఇబ్బంది పెట్టాయి. మా ఇంటి బంగారం అనే తెలుగు సినిమా ద్వారా రీ ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమైంది. ఈ సినిమా ద్వారా నిర్మాతగా కూడా పరిచయం కానుంది. ఈ క్రమంలోనే సమంత సినీ రంగంలోకి వచ్చి 15 ఏళ్లు పూర్తి కావడంతో తన ఇన్ స్టాగ్రామ్‌లో ఫోటోలను పంచుకుంటూ కృతజ్ఞతలు తెలిపింది.

### సిరాజ్‌తో డేటింగ్‌పై నోరువిప్పిన
## బిగ్‌బాస్ బ్యూటీ



ఇండియన్ స్టార్ క్రికెటర్‌లు, బాలీవుడ్ హీరోయిన్‌ల మధ్య డేటింగ్ వార్తలు రావడం సహజమే అన్న విషయం తెలిసిందే. ఇప్పటికే పలువురు క్రీడ ప్రముఖులు సినీ నటుల మధ్య వార్తలు రాగా.. అందులో కొన్ని నిజం కూడా అయ్యాయి. అయితే తాజాగా స్టార్ క్రికెటర్ మొహమ్మద్ సిరాజ్‌తో బిగ్‌బాస్ 13 ఫేమ్ నటి మహిరా శర్మ డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు వైరల్ అయ్యాయి. దీనికి ముఖ్య కారణం సిరాజ్, మహిరాలు ఇన్‌స్టాగ్రామ్ ఒకరినొకరు ఫాలో అవ్వడమే. అయితే ఈ ఫాలోయింగ్ లైక్‌ల వరకు వెళ్లడంతో వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారా అని గాసిప్స్ స్టార్ట్ అయ్యాయి. అయితే ఈ పుకార్లపై తాజాగా స్పందించింది మహిరా శర్మ. బాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. నేను ఎవరినీ డేట్ చేయడం లేదు. సిరాజ్‌తో డేటింగ్ అంటూ వస్తున్న వార్తలు నిజం కాదు. పబ్లిక్ ఫిగర్‌గా ఇలాంటి పుకార్లను ఎదుర్కోవడం సర్వసాధారణం. అభిమానులు తమకు నచ్చిన విధంగా ఎవరితోనైనా లింక్‌లు పెడుతారు. ఇంతకుముందు బిగ్ బాస్‌లో ఉన్నప్పుడు కూడా ఇలాంటివి జరిగాయంటూ మహిరా చెప్పుకోచ్చింది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S). Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288, CELL : +91 80742 79741